ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



వెల
4 అణాలు

సంపుటము 41 సంచిక 43


ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY

జూలై 13 1949


★ వార్తా చిత్రాలు ★




ప్రపంచ ఆరోగ్యసమితి ద్వితీయ సమావేశంలో పాల్గొనే భారత ప్రతినిధివర్గానికి నాయకత్వం వహించిన రాజకుమారి అమృతకౌర్‌కు ఇటలీలోని ప్రాచ్యవిజ్ఞానవేత్త ప్రొఫెసర్ టుక్సీ రోములో విందుచేసినప్పటి దృశ్యం. ఇందులో ఎడమవైపున టుక్సీ, కుడివైపున ఇటలీలో ఇండియా ప్రతినిధి ఆర్. ఎస్. మణి కనపడుతున్నారు.




పుదుచ్చేరిలో జనవరి 26 న చంద్రనగర్ దినోత్సవం జరిగినప్పుడు డి కత్సం పతాకారోహణోత్సవం జరిపారు.



రక్షణశాఖమంత్రి సర్దార్ బలదేవ సింగు, కార్యదర్శి హెచ్. ఎం. పటేల్, సర్వసేనాని జనరల్ కె. ఎం. కరియప్ప ఈమధ్య పూనాలో నేషనల్ వార్ అకాడమీని సందర్శించినప్పటి దృశ్యం.




గా॥ చంద్రమౌళిగారి "ప్రెస్ సమావేశం"లో రాజమండ్రి జర్నలిస్టులు.



నాల్గంతస్తుల మోటారు గారేజి

అమెరికా ఫ్లోరిడాలో మియమియందు యీ వింత మోటారుషెడ్డు కట్టబడింది. ందు 770 మోటారు లుంచవచ్చు. పైకప్పులేని మీద అంతస్తులో 150, దిగువవాటిలో 0 ఉండగలవు. వచ్చుటకు రెండు తోవలు పోవుటకు రెండు తోవలు గలవు. ..., కాంక్రీటుతో కట్టబడినవి. మనుష్యులకు ఎలక్ట్రిక్ లిఫ్టులు గలవు.



ఇండియా గవర్నరుజనరలు గా॥ సి. రాజగోపాలాచారిగారు గత 28-వ తేదీన విందుచేసిరి. రాజాజి గా॥ కె. కె. టిగర్టుగారితో ముచ్చటించుచున్నారు. వీరు ఇండియాప్రభుత్వం యూనివర్సిటీ కమీషను సభ్యులు.

ఆంధ్రపత్రిక

ప్రతి బుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మపథములకెల్లన్.

—మహాభారతము.

Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర ఆషాఢ బహుళ తదియ బుధవారము



'లడఖ్ రైతువనిత'

ఆంధ్రపత్రిక

1949-వ సం॥ జూలై నెల 13-వ తేది బుధవారము

మంత్రుల ఆత్మసమర్థనలు

మద్రాసు ప్రభుత్వము ఇంతకు ముందు వేసిన, ఇక వేయ సంకల్పించిన పన్నులను సమర్థించుకొనుచు రాష్ట్రసమాచారమంత్రి, న్యాయశాఖామంత్రి మాధవ మీనన్‌గార్లు మంగళవారం నాడు ఒక బహిరంగసభలో మాట్లాడిరి. తాము తలపెట్టిన పన్నులను సమర్థించుకొనుట సహజము. కాని వారి వాదధోరణిమాత్రము అసాధారణముగ కనపడక మానదు. ప్రభుత్వ ఆదాయము పెరుగవలెనను విషయమున, భక్తవత్సలముగారు చెప్పినట్లు అభిప్రాయభేదము లేకపోవచ్చును. ఆదాయము పెరుగుటకు పన్నులు తప్ప గత్యంతరము లేదనవచ్చును. కాని అంతమాత్రముతో అన్ని రకముల పన్నులు సమర్థనీయములు కాజాలవు. కొన్ని పన్నులు సమర్థనీయములైననూ, నాటిని మరల మరల హెచ్చించి, అవి బాధాకరముగ పరిణమించునట్లు చేయరాదు. ఏదైనా పన్ను సమంజసమైనది కాక, అది కొందరికి బాధాకరముగ నున్న ప్రభుత్వము నిర్మాణాత్మకమైన విమర్శలను ఆహ్వానించు నని శ్రీ భక్తవత్సలముగా రనిరి. కాని విమర్శ వచ్చునప్పటికి, విమర్శలకు దురుద్దేశములు ఆపాదించుచుండిరి. తాము సంకల్పించిన పన్నులు బీదప్రజలపై పడు ననుమాట అబద్ధమని, బీదప్రజల పేరుతో మాత్రం ఆందోళన సాగింపబడుచున్నదని శ్రీ మాధవమీనన్‌గారు ఉద్ఘాటించిరి. అంతటితో ఆగక, అమిత భావోద్రేకముతో, "ప్రతివారు బీదలను గురించి మాట్లాడువారే గాని స్వవిషయమును తెలుపుట లేదు. తమ స్వప్రయోజనములను వెలిబుచ్చుటకు వీరికి ధైర్యము చాలకున్నది" అని ప్రకటించినంతమాత్రమున తమ వాదము అప్రతిహతమై, తమ పన్నులు సమర్థనీయములు కాజాలవు. బీదప్రజను గురించి ఆత్మప్రయోజనమునకు ఆందోళన చేయునది పన్నులను విమర్శించినవారే గాక, ఇతరులు కూడ కలరు. ఇచ్చుకొనగలవారిమీదనే పన్నులు పడవలెనను సూత్రము ననుసరించి పరిశీలించిన, తమ పన్నులు ఆ సూత్రము ననుసరించే యున్నవనిరి ఎక్కువగా పైకమున్నవారే మోటారుబస్సులందు ప్రయాణము చేయుదురని, వినోదములకు వెళ్లుదురని వారు చెప్పిరి. బీదప్రజ అనగా ఇటు సినిమాకు వెళ్లుటకు గాని, అటు బస్సులో ప్రయాణము చేయుటకుగాని శక్తి లేనివారనే వారి అభిప్రాయము కాబోలు! అలాంటివారికి ఈ పన్నులవల్ల కలుగు లాభము లేదు. కలిగినచో హర్షించవలసిన విషయము.

పత్రికల ప్రకటనలపై వేయదలచిన పన్నును సమర్థించుచూ, ప్రభుత్వమన్న ఇష్టములేనివారు ఏదో విధముగా దానిపై దెబ్బ తీయుటకు ఈ ఆందోళన లేవదీసిరని శ్రీ మాధవమీనన్‌గారు అనిరి. ఈ వాదము ఎంత గౌరవప్రదముగ నున్నదో వారికే తెలియవలెను. అయితే ప్రభుత్వమన్న సుముఖత చూపక విమర్శించు పత్రికలపై దెబ్బకొట్టు సంకల్పముతో ఈ పన్నును ఉపక్రమించిరని విమర్శకులు జవాబు చెప్పిన గౌరవప్రదముగ నుండునా? కాబట్టి విమర్శకులకు అనవసర దురుద్దేశములు కల్పించకుండుట మంచిది. బస్సులందు ప్రయాణము చేయువారే బీదవారు కారని వారు వాదించినప్పుడు పత్రికలను కొని చదువువారు మాత్రము బీదప్రజ లని వారు అంగీకరించరు. ప్రకటనలపైన పన్ను సామాన్య పన్ను సూత్రములకు భిన్నముగ నున్నదనే దానికి ప్రాతికూల్యత వెలిబుచ్చబడినది. ప్రభుత్వము తలపెట్టిన పన్ను, మొత్తము పత్రికల ఆదాయము లాభములమీద పడదు. ఆ పద్ధతిని కేంద్ర ప్రభుత్వము ఆదాయపు పన్నుద్వారా వసూలు చేయుచున్నది. మద్రాసు ప్రభుత్వము తలపెట్టిన పన్ను పత్రికావ్యాపారములో, ఒక పని మీద పడుచున్నది. వచ్చే నికరాదాయము మీద కాక, అసలు రాబడిమీదనే పడనున్నది. పత్రికల బిల్లు వసూలునందే భాగము కోరుచున్నది. అనగా వ్యాపార నిర్వహణయందు ఖర్చును హెచ్చు చేయుచున్నదనవచ్చును. దీనివల్ల నికరాదాయము తగ్గి కేంద్రప్రభుత్వమునకు రాబడిపన్ను కూడ సన్నగిలును. కేంద్ర ప్రభుత్వము ఆదాయపు పన్నులో రాష్ట్రప్రభుత్వమునకు కేటాయించిన భాగము 15% నుండి 18% కు పెరిగినప్పటికీ రాబడి అధికము కాలేదని. మద్య నిషేధము వల్ల రు. 17/- కోట్లు తగ్గిపోయినదనిరి. మద్య నిషేధము అమలు జరుపదలచినపుడే ఆ విషయము తెలియును కదా? దానిని భర్తీ చేయుటకే అమ్మకముపన్నును అమలుపరచి మూడు సార్లు పెంచిరి కదా? కేంద్ర ప్రభుత్వము ప్రస్తుతమునకు మద్య నిషేధ కార్యక్రమమును వాయిదా వేయమనిన దానిని లెక్క చేయ లేదు కదా? ప్రభుత్వమునకు విస్తృత కార్యక్రమమువల్ల ఖర్చు పెరిగిన పత్రికలకు అదే స్థితి ఏర్పడుచున్నదని వారు గుర్తించుట మంచిది.

ప్రయోజనములేని సంప్రదింపులు

కాశ్మీరులో యుద్ధ సరిహద్దు గీతను, నిర్ణయించుటకు అవసరమైనదాని నవరించుటకు సంప్రతింపులు జరుప ఉభయ అధినివేశములు సైనిక ప్రతినిధులను పంపవలసినదిగా కాశ్మీరు కమీషన్ భారత పాకిస్తాను ప్రభుత్వములకు ఆహ్వానము పంపినది. ఉభయ ప్రభుత్వములు ఆహ్వానమును అంగీకరించినవి. సమావేశము ఈ నెల 18 వ తేదీన జరుగుటకు తాత్కాలికముగ నిర్ణయించిరి. ఈ సమావేశమువల్ల పెద్ద ప్రయోజనము సిద్ధించగలదా అని ఢిల్లీవర్గాలు సందేహించుచున్నారని వార్తలవల్ల తెలియవచ్చినది. గతానుభవమునుబట్టి వారి సందేహములను తేలికగా త్రోసిపుచ్చుటకు వీలులేదు. ఢిల్లీవర్గములకేగాక దేశములో అందరినీ అదే సందేహము బాధించుచున్నది.

జనవరిలో సిద్ధించిన యుద్ధ విరామమును పురస్కరించుకొని సంధినికూడ సాధించి, ఆ పిమ్మట జనవాక్య నిర్ణయమును తెలిసికొనుటకు ఏర్పాటుకు తగిన పరిస్థితిని కల్పించ కమీషను ప్రయత్నించుచూ వచ్చినది. కాని ఆ ప్రయత్నము సఫలము కాలేదు. గత ఆగస్టులో సమితి తీర్మానమును ఆమోదించినప్పటికి, దానికి అర్థముతీసి అమలు చేయుటలో పాకిస్తానుకు, భారత దేశమునకు భిన్నాభిప్రాయము లేర్పడినవి. ఏప్రియలులో తిరిగి కమీషను కొన్ని ప్రతిపాదనలను చేసినది. కాని వాటి విషయమునకూడ అంగీకారము కుదరలేదు. ఆ సూచనలు పూర్తిగ బహిరంగము కాలేదు. వాటిని ప్రతిపాదించుటకు ముందుకూడ సరిహద్దుగీత విషయమున ప్రథమముగా ఒప్పందము తీసికొనివచ్చుటకు ప్రయత్నించినది. ఇపుడు మరల అదే విషయమునుగురించి ఒప్పందమునకు ప్రయత్నించుచున్నది. అందువల్ల ఈసారి ప్రయత్నమును గురించి కూడ సందేహించుటకు కారణము. అన్ని విషయములు వదలి ఈ సరిహద్దునుగురించి చర్చించుట నిరుపయోగము. అంతే కాక అసలు దానికి అర్థముకూడ లేదు.

సమితి ఆగస్టు తీర్మానమును అంగీకరించుటలో భారతదేశము, మూడు షరతులను కోరినది. అవి అజాద్‌కాశ్మీరు సేనలు రద్దుకావలెనని, సంధి ఒప్పందము కుదిరిన వెంటనే సంస్థాన ప్రాంతమంతా, స్థానికాధికారుల పాలన క్రిందకు రావలెనని, ఆ ప్రాంతమేదియు ఇతరుల అధికారము క్రిందకు పోకూడదని. అందుకు కమీషను అంగీకరించినది. కాని పాకిస్తాను ఆ షరతులకు అంగీకరించలేదు. తీర్మానములో స్థానికాధికారులు అన్న పదమునకు అజాద్ కాశ్మీరు ప్రభుత్వము అనీ, కాబట్టి వారి ఆక్రమణలోయున్న ప్రాంతమును వదలుటకు వీలులేదనినది. అజాద్ కాశ్మీరు సేనలను రద్దుచేయుటకు వీలులేదనినది. ఏప్రెల్‌లో కమీషను క్రొత్త ప్రతిపాదనలను చేసినపుడు, అజాద్ కాశ్మీర్ సేనలను, నిరాయుధులను చేయుట గురించి, వారి ఉద్వాసనగురించి రాయబారాలు జరుపవచ్చునని కమీషను సూచించినదట. అలాంటి హామీ పాకిస్తానుచేత ఇప్పించ మనగా అది చేయలేక పోయినది.

కాబట్టి ఇట్టి పరిస్థితిలో యుద్ధవిరామ సరిహద్దునుగురించి సంప్రతింపులు జరుపుటయందు అర్థము కనుపడ లేదు. కాకపోయిన ఎవరి స్థానములో వారుండి, సాక్షాత్తు యుద్ధము మాత్రము సాగకుండా యుండవచ్చును అంతేకాక అసలు సమితి ఆగస్టు తీర్మానము ననుసరించి పరిష్కారమునకు రాజాలదు. ప్రస్తుత స్థితి స్థిరీకరణకు ఉపయోగపడగలదు సరిహద్దు నిర్ణయమైన తరువాతకూడ వెనుకటి విభేదములు యథావిధిగనే యుండును కదా? ఆ విషయమున కమీషను ఆగస్టు తీర్మానమును పురస్కరించుకొని విస్పష్టవైఖరి నవలంబించవలెను. అజాద్ కాశ్మీరు సైన్యములకు ఉద్వాసనచెప్పి రద్దు చేయవలెనని పాకిస్థానుకు ఖచ్చితముగ చెప్పవలెను. పాకిస్తాను అందుకు అంగీకరించక పోయిన సమితి తీర్మానమును త్రోసిపుచ్చినదని ప్రకటించవలెను. ఇంత కాలము రాయబారములు జరిగినా ఒప్పందమునకు రాకపోవుటకు పాకిస్తాను అసంబద్ధవైఖరే కారణము. దానిని బైటపెట్టుటకు కమీషను వెనుకాడుచున్నది. ఎంతకాలము వేచియుండుట అని పరిషత్తులోకి కాశ్మీరు ప్రతినిధులను చేర్చుకొని కాశ్మీరు యూనియనులో చేరుటను భారతప్రభుత్వము స్థిరపరచినది. ఏమైనా సరే పాకిస్తాను కాశ్మీరును వదలుకోలేదని పాకిస్తాను ప్రముఖులు నిర్విర్వామముగ ప్రకటించుచుండగా ఇక జనవాక్య నిర్ధారణవల్ల ప్రయోజన మేమున్నది? సరిహద్దుగీతను గురించిన సంప్రతింపులు దాని విషయమై ఏమైన ఒప్పందమును సాధించునేమో గాని అసలు సమస్య పరిష్కారము కాదు. పైపెచ్చు ఎవరి ఆక్రమణక్రింద నున్న ప్రదేశములు వారికి స్థిరమై సంస్థాన విభజనకు దారి తీయవచ్చును. కమీషను అస్థిరవైఖరి అందుకు దోహద మిచ్చు ప్రమాదముతో కూడుకొనియున్నది.

నవల :

నాతీగాలి

వి.డి. ప్రసాదరావు

౧

ప్రభావతి పల్లెటూరి పిల్ల. పెండ్లికాక ముందే తండ్రి చనిపోయాడు.

తండ్రి విషయంలో గౌరవనీయమైన స్మృతులేవీ ప్రభావతికి లేవు. తండ్రి చాలా మొరటు మనిషి. తల్లిని చాలామాట్లు చావగొట్టేవాడు. తనకు కూడా, తను చేసిన తప్పేదో తెలియకుండానే, తండ్రి చేతిలో చింతబరికెలతోటీ చాంతాళ్ళతోటీ, వాతలు తేలేటట్లు దెబ్బలు తగిలేవి. తండ్రిలో ఆప్యాయతా అప్పుడప్పుడు కనబడేది. ఆ ఆప్యాయత అతని సంతోష స్థితికి చిహ్నంగా తప్ప కేవలం తనమీది వాత్సల్య కారణంగా చూపిస్తున్న ముద్దుగా ఉండేది కాదు. ఆ ముద్దులోనే ఏదో తల్లిమీద పితూరీ చెప్పించేవాడు. తల్లిమీద పితూరీలు చెప్పటం తన కిష్టం ఉండేకాదు. కాని తండ్రివాత్సల్యం చూరగొందా మన్న అభిలాషలో, అతన్ని మెప్పించటానికి మార్గము అది ఒకటే అతను తెరచి ఉంచేటప్పటికి, ఉత్సాహం తెచ్చుకొని తల్లిమీద పితూరీలు చెప్పేది. వాటిలో ఏదో ఒకటి సాకుగా తీసికొని తల్లిని చితకగొట్టేవాడు. తండ్రి అవతలికి సాగాక తల్లి తన కోపం పిల్లమీద కొంత తీర్చుకొనేది. కాని ఇంతలో తనకు ఏడుపు వచ్చి ఏడుస్తూంటే వెంటనే దగ్గరకు తీసుకొని సముదాయించేది. తల్లి దెబ్బలు కొట్టడం తక్కువ. ఆ కాస్తకే తినుబండారాలో మరేవో చిన్నప్పుడు కోరుకు నేవన్నీ కోర్కె తీరా దొరికేవి. తండ్రి అంటే ఇంట్లో ఇద్దరికీ గడగడాటుగానే ఉండేది.

తల్లిది శాంతస్వభావ మనే ఊరంతా మెచ్చుకొనేవారు. కాని ఇంట్లో చిడిముడులూ, చిరాకులూ, చీదరలూ, ఏదో అశాంతితో రగిల కోపమూ, తల్లి ఎక్కువ చూపిస్తూనే ఉండేది. పై వాళ్ళతో నెమ్మది తనం చూపెస్తే, ఇంట్లో ఎంత చిడిముడిపాటు చూపించినా శాంత స్వభావమే అన్న భావం, చిననాడు కలగలసిన ఆదర్శాలలో మిళితమై పోయింది.

తల్లీతండ్రీ కూడా దేవతార్చనపరులే. సంధ్యావందనం వారుస్తూన్నంతసేపూ తండ్రి గొడ్ల విషయమో గోదలవిషయమో ఏదో కేకలు పెడుతూనే ఉండేవాడు తల్లి రోజూ తులసి పూజ, దేవతావిగ్రహాల పూజ చేసుకొంటూనే ఉండేది. కాని పూజ చేసుకొనేటప్పుడుకూడా తెక్కిన పనులకూ, సంభాషణలకూ, ఏమంత అభ్యంతరం కనబడేది కాదు. తను ఈడేరిన తర్వాత ఆ పూజలు తనచేతకూడా తల్లి చేయించేది. ఆ మాత్రం పూజాస్వరూపమూ, స్వభావమూ, చిన నాటినుంచీ ఆమెలోనూ జీర్ణమయిపోయాయి. ఇప్పటికి ఆ విధంగా పూజాపురస్కారాలు చేయటం తనకూ రక్తంలో జీర్ణించిపోయింది.

జీవిత రహస్యాలను వేటినీ ఆ తండ్రి దాంపత్యము తన కన్నుల కవగాహనం కానంత మాత్రంగా దాచలేదు. ఆ గదిలోనే తనూ పడక. పగలంతా తల్లిని చికాకుతో చీదరించి వేసిన తండ్రి, బిడ్డ సరిగా నిద్రపోయిందో లేదోకూడా గమనించకుండానే తల్లిపజ్జ చేరి ఆత్రం చూపించేవాడు. బిడ్డ విషయమై రహస్యంగా తల్లి చేసిన హెచ్చరిక కూడా గమనింపులోకి వచ్చేది కాదు. తల్లితండ్రులు తను మేల్కొని ఉండటం కనిపెట్టారన్న భయంతో కళ్ళు గట్టిగా మూసికొని ఊపిరి బైట పడనీకుండా బిగ్గబట్టుకొనేది. దేహం కామస్వరూపమే ఎరుగని స్థితిలోనే, మనస్సు కామానికి అస్వాభావికరూపాలన్ని ఇచ్చుకొని చెట్టున పండని పచ్చి కాయలను, కృతకంగా కావువేసి పండించిన ట్లయింది.

తండ్రిలో గార్హస్థ్యనిష్ఠకూడా అంత మాత్రంగానే ఉండేది. వెలిచవుల విషయంలో కూడా తండ్రి తన ప్రవర్తన బిడ్డకు తెలియనీయని జాగ్రత్త తీసుకోలేదు. ఒకనాడు తల్లి తనూ పొరిగింట అమ్మలక్కలతో కాలక్షేపం చేస్తూండగా, తను ఇంటికి వెళ్లింది. గదిలో తండ్రీ, మరో స్త్రీ ఉన్నారు.

ఆమెవిషయంలో తండ్రి చూపిస్తున్న లాలిత్యంలో శతాంశము కూడా, తన తల్లిపట్ల చూపటం తను ఏనాడూ ఎరగడు.

ఆ దాంపత్యము, ప్రభావతిలో చిననాడు, అనుకూల దాంపత్య ఆదర్శాన్ని కల్గించలేకపోయింది.

తండ్రిప్రవర్తనలన్నీ తనకు అసహ్యంగానే జుగుప్సాకరంగానే కనబడ్డాయి. అప్పటికిగాని తల్లిలోని ధర్మనిష్ఠ, శాంతస్వభావము, ఓరిమి, ఎంత భరించగలిగాక, ఆపై చిరాకు కాస్తా చూపిస్తోందో, అవన్నీ అవగతం కాలేదు. మనస్సులో తల్లికే గౌరవనీయమైన స్థానం ఏర్పడ్డది. ఆమె అంటే అనురాగమే అభివృద్ధిపొందింది. అస్ఫుటంగానే తల్లి ఒక ఆదర్శం కల్పించింది. కాని అది మనస్సులో సంపూర్ణంగా బలీయంగా జీర్ణమయిందో లేదో తెలియదు.

తండ్రివిషయంలో మధురస్మృతి, అతనికి జబ్బుచేసినప్పటినుంచీ అతను తనపట్ల చూపించిన మార్దవమే. తల్లి అతనికి అహోరాత్రాలూ కంటిమీద కునుకు లేకుండా పరిచర్యలు చేసేది. తల్లిని ప్రియంగా పల్కరించి, స్నేహం చూపెంచి, ఎంతో ఆర్ద్రత చూపించాడు తండ్రి, ఆ నాల్గునాళ్లూ. చనిపోయేముందర, తనని గుండెలకు హత్తుకొని గావురుమని ఏడ్చాడు. తనకూ పెద్దపెట్టున ఏడుపు వచ్చింది. ఇప్పుడు తండ్రి అంటే ఉన్న వాంఛల్యమంతా కన్నీళ్లుగా పొర్లుకువచ్చింది. ఆ నిమిషంలో తన తండ్రికి తనమీద ఎంత వాత్సల్యముందో, అనిపించి, తండ్రి లోపాలన్నీ అడుగునపడిపోయి తండ్రిమీది ప్రేమే మిగిలిపోయింది. తండ్రి పోయినప్పుడు, తల్లిని కౌగలించుకొని ఎడతెగకుండా ఏడ్చింది. అనురాగం లేకపోయినా అంత అనురాగం ఎల్లా ఉందో తెలియలేదు.

తండ్రి పోవటంతో ఇంటికి దక్షత పోయింది. తల్లి పుట్టింట ముసలితల్లి తప్ప ఎవరూ లేరు. ఆమెకు తామె దిక్కుగానో, లేక తమకు ఆమె దిక్కుగానో, అక్కడికి చేరారు. ఇక్కడ మిగిలిన ఆస్తి కొద్ది. తండ్రివైపు వారే ఎవరో ఆ వ్యవహారాలు చూచిపెట్టూ, ఏడాదికి గ్రాసవాసాలకు హెచ్చుతగ్గుగా, అమ్మమ్మ గారింటికి తమకు పంపించేవారు.

ప్రభావతి పెండ్లికై తల్లి చాలా తహతహలాడింది. ముందు కొన్ని సంబంధాలలో విచక్షణ చూపించబోయింది. అంతలో సంబంధాలు కుదరటమే కష్టమౌతూ వచ్చింది. పిల్ల ఈడేరిన సంగతి ఊరిలో పొక్కనీయలేదు.

తల్లి రోగాతురాలైంది. వండి పెట్టే దిక్కు కూడా ముసలి అవ్వే. కాని కాయపుష్టికల ముసలిదేమో, పనికి జంకేది కాదు.

ప్రభావతి ఈడేరినప్పటినుంచి, బైటికి కదిలినప్పుడల్లా, కొంకిరి పిల్లల అల్లరిచూపులు తప్పించుకు రావలసివచ్చేది. దక్షత లేని ఇంటి పిల్ల అవటం వల్ల వాళ్ళచూపులలో ఆమె మరీ తేలిక అయింది. కాని కులక్రమాగతంగా వస్తున్న సహజగరువతనంతో, వాళ్ళఅల్లరులు తప్పించుకొని కోపంతో ఇంటికి వచ్చింది. అపరిపక్వ స్థితిలో మనస్సు సేకరించు కొన్న కామనలను, పరిపక్వ చైతన్య మందుకొన్న దేహం మనస్సులోనే కుమిలింప చేస్తోంది. తల్లి ద్వారా రక్తంలోనే జీర్ణించిపోయిన "సనాతనధర్మం" రక్షగా అడ్డు కాపాడుతోంది. ఆ ఘర్షణలో నీరసపడిపోయి తల్లిముందర వెఱ్ఱిగా ఏడవటం, మందగొడిగా పడిఉండటం, చికాకు చూపెంచటం చేసేది. "అమ్మా, నాకు పెళ్ళి చేసేయమని" ఏడ్చింది. తల్లీ ఆ ఆత్రంతోనే ఉంది.

వ్యవహారాలు చూస్తూన్న ఆయనే ఒక సంబంధము తెచ్చాడు ఉన్న కాస్త పొలం వరకట్నంగా వప్పించి తల్లి పెళ్లిచేసింది.

భర్త వృద్ధుడు కాడు. రెండో పెళ్ళి వాడైనా పాతికేళ్ళ దాదాపువాడే. మొదటి భార్య కాపురానికి వచ్చిన కొద్దికాలంలోనే చనిపోయింది. సంతానం లేదు. వెనుక ఎవ్వరూ లేరు. ఒక స్నేహితుడెవరో కాశీలో ఉద్యోగం ఇప్పించాడట. అక్కడే ఉద్యోగం చేస్తున్నాడు. పెండ్లీ, కార్యం కూడా ఒకసారే చేసుకొని పిల్లను తీసుకువెళ్ళటానికి తయారుగా వచ్చాడు.

ఇష్టాయిష్టాలు ప్రమేయం పెట్టుకోకుండను కొనే పెండ్లిపీటలమీద కూర్చుంది. భర్తలో అందం లేదు. కురూపి అని చెప్పటానికి అసలే వీలులేదు. సాంప్రదాయసిద్ధంగానే పతియందు గౌరవప్రపత్తులు పెండ్లిపీటలమీదే తనమనస్సులో కల్గింపచేసుకొంది. కాని అంత అకస్మాత్తుగా తెచ్చుకున్న వాటి కున్న బల మెంతదో? బలీయం చేసుకోటానికే నిశ్చయించుకొంది.

అతనికిది ప్రథమానుభవం కాదు. తనది ప్రథమానుభవము. తనలోని కోర్కెలకు తృప్తిస్వరూపమిదే అని భావించుకొని సంతృప్తిపడింది. తల్లి భర్తయింటికి, కాశీకి, తనను సాగనంపింది.

ఏడాదికి తల్లి కూడా చనిపోయిందన్న వార్త తెలిసింది. తన పెండ్లికోసమనే అసువులు నిల్పుకొన్నట్లుగా బ్రతికింది. భర్త సానుభూతితో, అమ్మమ్మగారింటికి తీసికొనివెళ్లాడు. ఆ ముసలవ్వను తమతో కాశీ రమ్మని బ్రతిమాలారు. కాస్త తమకు చేయూతగా ఉంటుందేమోనని లోపలి ఆశ. బైటికి కనపడింది ఆమె వృద్ధాప్యానికి సానుభూతి. ముసలవ్వ కాశీ చూడాలని కోరికగా ఉన్నా ఇల్లు విడిచిరానంది. మళ్ళీ కాశీలో గువ్వపక్షుల్లాగా ఒంటరి కాపురం.

అక్కడి బాస అర్థమయ్యేది కాదు. అక్కడి మనుష్యులతో కలవటమే కష్టమైపోయేది. తామున్న యింటిలో అడుగు భాగంలో ఎక్కడో ఓమూలగా ఇంటివారు, మరో కుటుంబం, కాపురం ఉండేవారు. వాళ్ళకు ఘోషా లెక్కువ. తనూ మొదటిలో గది కదిలేదుకాదు. పుణ్యదినాల్లో సరిగంగస్నానాలూ, విశ్వేశ్వర దర్శనాలూ మాత్రమే మొదటిరోజుల్లో బయటికి కదిలిన రోజులు. కాశీకి స్వదేశానికీ దూరప్రయాణావసరాలు రెండుమూడు మాట్లు కలగటంతో, దేశం, లోకం, కన్నులబడక తప్పిందికాదు.

భర్త తనకు చేసిన లోటులని లోటులుగా చెప్పుకోగలవి ఏమీ లేదు. తన తండ్రి అంతగా కాకపోయినా తన తండ్రివలెనే కొంత మొరటుతనమూ, స్తబ్ధత్వమూ భర్తలో ఉండేవి. పెండ్లి అయినకొత్తలో, మమత ప్రదర్శించాడు. సంసారజీవితం సామాన్యమైపోయాక ఆ ప్రదర్శనము అంతగా కానవచ్చేది కాదు. సంసారంలోని చిరుచిరాకు లేవో తప్ప అసంతృప్తు లేవీ ఆమెలోనూ అంతగా ఉండేవి కావు. ఆమె కట్టూ బొట్టూ, బాహ్యశృంగారవిషయాల్లో కూడా అతనికి పాటింపు తక్కువే. అనాగరక పల్లెటి వేషంలోఉన్నా ఏమీ అనేవాడు కాడు. దేశం కన్నుల బడ్డాక ఈడుయువతులను చూసి నాగరవేషం సంతరించుకొంది. కొత్తవేషానికి కొంత ముగ్ధుడే అయ్యాడు. కాని ప్రోత్సాహమేమీ య్యలేదు. ప్రోత్సాహపరచలేదు. అతనికోసమే అన్న భ్రమలోనే, తన అందాన్ని దిద్దుకొంటున్నా ననుకొనేది. కాని తనకోసం తనలో తనకున్న అభిలాషే అని మనస్సులోనైనా వివరించుకొనేది కాదు. ఆ అందాన్ని అలవాటైపోయిన నిరాదరంతోనే పతి ఆస్వాదించటం, మనస్సుకు తృప్తి నిచ్చేది కాదు.

సాయంత్రం కాగానే గంగఒడ్డుకు విహారానికి వెళ్దామని పతిని ప్రోత్సహించేది. అతనిలో ఆ ఉత్సాహా లేమీ ఉండేవి కావు. ఆ ఉద్యోగమూ, ఆ జీతమూ, పిటల్లో, ఈవిలాసాలకు, అర్థమూ, కాలమూ, కూడ అతనికి చిక్కేవి కావు. ఎప్పుడో ఒకప్పుడు ఆమెను వెంటబెట్టుకొని బయలుదేరేవాడు. కాని ఇంటికి వచ్చేదాకా ముళ్లమీద ఉన్నట్టే ఉండేది అతనికి. శిష్టస్వభావంతోనే, ఆ విలాసాలను పతితో కలిసి తన యౌవనపు ఈడుకు తగినట్టుగా అనుభవిద్దా మన్న స్వాభావికవాంఛలే తప్ప తదితర భావనలు ఏవీఆమెలోనూ ఉండేవి కావు.

ఒకనాడు గంగఒడ్డున తనను కన్నులతో వెంటాడుతూన్న ఒక తెలుగు విద్యార్థి చూపులు కంటికి తగిలాయి. ఏదో పరిచయమున్న వ్యక్తి అన్నట్టుగానే లీలగా అభిప్రాయం కలుగుతూంది. కన్నులు మరల్చుకొని పతివెంట ముందుకు నడిచింది. ఆసారి కాశీ వస్తున్నప్పుడు రైలులో తమ ప్రక్కన కూర్చున్న విద్యార్థి. అతని చూపులు తన దేహం నరాలకు తాకుతున్నాయి. చిరాకుతో అడుగు త్వరితం చేసి పతిప్రక్కనే నడుస్తూంది. విశ్వేశ్వరాలయంలో, జనం క్రిక్కిరిసి ఉన్నారు. పతి తనకున్న ఒకపరుస ముందు ఉన్నాడు. జనం స్త్రీ పుంవిభేదం లేకుండా వత్తిడిగా క్రిక్కిరిసి ఉన్నారు. క్రింది చూపుల క్రీగంట వెనుకకు చూసింది. అతను వెనుకనే ఉన్నాడు. విశ్వేశ్వరునివంక చూస్తూ ధ్యానము ఇనుమడింప చేసుకొంది.

ఇంటి సమ్మమెక్కాక సందు మొగంకేసి చూసింది. ఆ విద్యార్థి అక్కడే తారాడుతున్నాడు. తెలియని ఒక భయమూ, తెలియని ఒక ఉద్రేకమూకూడా, వళ్లు జలదరింపచేశాయి.

ఆ సాయంత్రం భర్త ఇంట లేడు. గుమ్మంలో పరాకుగా నిల్చుని ఉంది. ఇంగులో ఎవరూ లేరు. ఆ విద్యార్థి దాహపు చూపులతో గుమ్మంలో అడుగు పెట్టు న్నాడు. లోపల ఇంటివారి తలుపులు వేసిఉన్నాయి. స్త్రీలు ఘోషాలో లోపల ఎక్కడో ఉన్నారు. భయంతో కేక వెయ్యబోయింది. నోట మాట రాలేదు. గబగబ మెట్లెక్కి పైకి పోయింది. అడుగులోనే అతను వెంటబడి వచ్చి, గదితలుపు వేసేలోపలే తన్ను ఆలంబించుకొన్నాడు. ధర్మాధర్మాల భీతికన్న ప్రతిష్ఠభీతి ముందర నోరు నొక్కివేసింది. తలుపు దగ్గరకు చేరవేయించింది. బుద్ధి, కాదన్న విషయాన్ని, దేహం కేవలం కాదని నిరాకరించలేకపోయింది. పైపెచ్చు, భ్రమనే కల్పించింది. "ఈ ఒక్కసారికే ఈ పొరపాటు" అన్న ఉపశాంతి చేకూర్చుకోబోయింది.

కాని ఆ పొరపాటు అక్కడ ఆగలేదు.

"పసిడిఛాయన గరులు తిరిగిన కురులలో, ముడిచిన పూలతో ఎవరికోసమో తిన్నెపై వేచియున్నదా జవ్వని. అందచందాలతో ధవళ కాంతితో విరజిమ్ము ఆ శారీరక సౌష్టవం. ఆమె కన్నిటికి మించిన సొబగు, మెడలోని పచ్చలహారం కల్పిస్తున్నది. ప్రియుని కౌ పౌరం జూపి, ఒండొరులు ఆనందభరితు లౌదామనే అభిలాషతో వేచియున్నట్లున్నది."

ఎవరీ జవ్వని ?...

క్లియోపేట్రా !...

మానవుడికి మణులంటే గౌరవం. అందులో, కళోపాసకులకూ, సాహిత్యోపాసకులకూ ముఖ్యముగా కవులకూ, మణులన్నా, మణిశబ్దమన్నా ఇష్టదాయకం. క్లియోపేట్రా కాలంలో మరకత మణులు విశేషంగా దొరికా యనే చారిత్రాంశాన్ని గ్రహించి ఆమె మెడలో ఒక పచ్చల పతకాన్ని వేశా డొక ఆంగ్ల సాహితీ పరుడు. ఎఱ్ఱ సముద్రం తీరానగల, జీబెల్ సికాయత్, జీబెల్ జబారాలల్లో ఉన్న గనులు, క్లియోపేట్రా గను లని పిలువబడటం దీనికి ఆధారం.

చరిత్రకారులు క్రీ. పూ. 1800 నాటి పచ్చల గనుల్లోని పలుగు పారల చప్పుడు వినిపిస్తారు. ఈ చప్పుడు, ఈజిప్టు ఎగువనుంచి వినపడ్తున్నదంటారు. కాదంటే, ఏదో రాతిభాషకు అర్థం చెప్పి నమ్మిస్తారు. తప్పదు ఒప్పుకోక.

అంతటితో ఊరుకోరు. అడుగునంటారు అలెగ్జాండరు ది గ్రేటు. మరకత మణుల కోసం మహా ఆర్భాట పడ్డాడుట.

చారిత్రకుల మాటే నమ్మవలసి వస్తే క్రీ. పూ. 2000 అనగా ఇప్పటికి నాల్గువేల సంవత్సరాలనుంచి ఈ పచ్చలు . వాడుకలో ఉన్నవని ఒప్పుకోవలసి వస్తుంది. తంజావూరు, మధుర, కుంభకోణం మొదలైన సుప్రసిద్ధ దేవాలయల్లోని దేవతా ప్రతిమల అలంకారంలో, పచ్చలకు ప్రాచుర్యం ఉన్నది. రవీంద్రుని వంశస్థుల వద్ద గూడ పచ్చ లున్నట్లుగా వినికిడి.

* * * *

పచ్చలను పాశ్చాత్యులు 'ఎమిరాల్డ్సు' (*Emeralds*) అంటారు. వీనికి సంస్కృత శబ్దం 'మరకతం'. పసుపురంగు కల్గిన మణులు మాత్రం పచ్చ లనబడవు. మిగతా పచ్చరంగులు, అనగా ఆకుపచ్చ (శ్యామవర్ణం) శుకశ్యామం. మయూరశ్యామం, నాచురంగు మొదలైన వాటితో ప్రకాశించేవన్నీ పచ్చలనే అంటారు, వీటి ఖనిజాన్ని 'బెరిల్' (*Beryl*) అంటారు. ఈ 'బెరిల్' యొక్క రసాయనిక నామం బెరిల్యమ్ అల్యూమినియం సిలికేటు (*Beryllium Alluminium Silicate*) అంటారు. ఈ ఖనిజంలో, బెరిల్యమ్, అల్యూమినియమ్ మొదలైనధాతువులూ సిలికన్ మొదలైన ఉపధాతువులూ మూలద్రవ్యాలు. ఈ బెరిల్ ఖనిజంలో, ఏమాత్రం క్రోమియం ధాతువున్నా పచ్చగా (*Emerald*) మారుతుంది. అసలు ఖనిజమైన 'బెరిల్' బంగారపు పచ్చరంగుగా ఉంటుంది.

మరకతం రత్నమెలా అయింది ?

ఏ ఖనిజమైనా రత్నజాతికి చెందా లంటే, కొన్ని ముఖ్యగుణాలు గల్గిఉండాలి. అవి రంగు (*Colour*), కఠినత్వం (*Hardness*), చిరస్థాయిత్వం, మెరుపు మొదలైనవి. కనీసం మొదటి మూడు గుణాలన్నా కల్గిఉండకపోతే, దాన్ని మణిగా పరిగణింపరు.

పచ్చలు రత్నజాతికి చెందటానికి, వాటికిగల మనోరంజకంగా ప్రకాశించు ఆ పచ్చరంగే కారణం. రత్నానికీ పచ్చరంగు, ఖనిజపదార్థంలో క్రోమియం ఉండటంవల్ల ఏర్పడుతుంది. ఈ పచ్చల్లో నూటికి 0.186 పాళ్లు క్రోమియపు భస్మం (*Chromium Oxide*) ఉన్నదని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. ఖనిజపదార్థంలో, క్రోమియపు భస్మం చాల తక్కువ ఉన్నప్పటికీ పచ్చరంగు ఏర్పడటానికి ఇది చాలనిగూఢ విజ్ఞానులు గ్రహించారు.

రత్నాల కుండవలసిన లక్షణాల్లో దీర్ఘకాలం మనటం ఒకటి. వీటికిగల శాశ్వతత్వానికి కఠినత్వమే కారణం. ఈ పచ్చలు కూడ చాల వరకూ కఠినంగా ఉంటా యనే చెప్పవచ్చు. పచ్చలను నవరత్నాల్లో చేర్చటానికి కావలసిన లక్షణాల్లో ఇది ఒకటి ఐనప్పటికీ, మిగతా రత్నాలతో గనుక పోల్చిచూస్తే పచ్చలు కొంచెం తక్కువ కఠినంగా ఉంటవి. కఠినమైన ఖనిజా లన్నిటినీ, ఒక క్రమంలో వ్రాసి, దానికి

నవరత్నాలు 5:

పచ్చలు

శ్రీ యామర్తి గోపాలరావు

'మో' యొక్క కఠినత్వ పరిమాణము (*Moh's scale of Hardness*) అన్నారు. ఈ పరిమాణంలో పచ్చలయొక్క కఠినత్వ సంఖ్య 7.5.

ఇవి చాల అరుదుగా లభించటం, దానివల్ల వీటి విలువ హెచ్చటం మొదలైన కారణాలవల్ల గూడ, పచ్చలకు రత్నజాతిలో ఒకానొక ఉత్తమస్థానం ఇవ్వబడింది.

ఉనికి

సుప్రసిద్ధమైన పచ్చలు, కొలంబియాలోని మ్యూజో, ఛివోర్ లవద్దనూ, బ్రెజిల్‌లోని బాహియాప్రాంతంలోను, యూరల్ పర్వత ప్రాంతంలోనూ లభిస్తవి.

దక్షిణ మెరికాలోని 'పెరూ' దేశస్థులవద్దనుంచి, ఎన్నో మరకతమణులను స్పెయినువారు దండయాత్ర చేసి హరించినట్లుగా చరిత్రలవల్ల తెలుస్తుంది. కాని ఈ దేశస్థులవద్దనున్న రత్నాలెక్కడనుంచి వచ్చినవా అనేదిమాత్రం ఒక సమస్య. ప్రస్తుతం దక్షిణ మెరికానుంచి వచ్చే మణులన్నీ కొలంబియా దేశపు ముఖ్యపట్టణం 'బొగోటా' ప్రాంతంనుండే వస్తున్నవి. ప్రసిద్ధికెక్కిన పచ్చల గని మ్యూజోవద్ద ఉన్నది.

ఈ మణులు 1830 లో యూరల్ పర్వతాల్లోగూడ లభించినవి. ఇంకా, ఇవి సాల్జ్‌బర్గు ఆల్ప్సులలోను, నార్వేలోకూడ లభిస్తవి. న్యూ సౌత్ వేల్సులో, టోపజ్ (*Topaz*) ఫ్లోర్‌స్పార్ (*Fluorspar*), కేసిటరైట్ (*Casseitarite*) మొదలగు ఖనిజాలతోపాటు 'బెరిల్' కూడ లభిస్తుంది కాని ఇది కొంచెం లేతరంగులో ఉంటుంది. యునైటెడ్ స్టేట్సులో ఈ స్ఫటికాలు అరుదుగా లభిస్తవి.

రత్నగర్భ సింహళదేశపు ఒండ్రుమట్టిలో, కొద్దిగా ఐనప్పటికీ, పచ్చలు దొరుకుతవి.

మేవారు పచ్చలు

యుద్ధకాలంలో మరకత ఖనిజమైన 'బెరిల్' కోసం రాజపుత్రస్థానంలో తీవ్రమైన పరిశోధనలు చేశారు. వాటి ఫలితమే, ప్రస్తుతం మేవారు నుండి ఉత్పత్తి అవుతున్న పచ్చటి స్ఫటికాలు. వీటని తొలిలో కనుగొనినపుడు, జయపూరు పంపి సాన పట్టించారు. అరఅంగుళం మొదలు నాలుగంగుళాలవరకూ పొడవుండి, సుమారు $1\frac{1}{4}$ అంగుళం వ్యాసంగాగల స్ఫటికాలు ఇచ్చట లభిస్తున్నవి. సంస్థాన ప్రభుత్వం వీటి నన్నిటినీ జాగ్రతచేసి చివరకు వేలంవేసి అమ్ముతున్నారు.

పురాతనకాలంనుంచీ ప్రసిద్ధికెక్కిన కుమల్‌ఘర్ కోటకు కొద్దిదూరంలో ఉన్న కాలీగుమన్ (*Kaliguman*) ప్రాంతం, పచ్చల గనిప్రాంతం. ఈ గనులు సుమారు 800 అడుగుల పొడవు 60 అడుగుల లోతూ ఉంటవి. తయారయ్యే మణులు ఒక క్యారటు రెండువేల రూపాయల విలువ ఉంటుంది. కాని ఉత్పత్తిఅయిన మణుల్లో ఎక్కువభాగం లోపభూయిష్ఠమై ఉంటాయి.

కృత్రిమ మరకతాలు

మరకత మణులను శాస్త్రజ్ఞులు, రసాయనిక మార్గాలద్వారా పరీక్ష చేశారు. వీటిల్లో బెరిలియం, అల్యూమినియం మొదలైన ధాతువులూ, సిలికన్ మొదలైన ఉపధాతువులూ ఉంటా యని తేలింది. ప్రకృతి సహజంగా ఏర్పడిన ఈ మణులకు, ప్రతిరూపంగా మానవుడు స్వయంగా తిరిగి తయారు చేయదలిస్తే, ఈ మూలపదార్థాలనే తీసికొని, వాటిని రసాయనిక మార్గాల ద్వారా సంయోగపరచి, కావలసిన పచ్చలు తయారు చేయవచ్చు.

పచ్చలను కృత్రిమంగా తయారు చేయటానికి తొలుత 1890 లో ప్రారంభించిన వారు హాట్‌ఫ్యూలీ, పేర్రీ (*Hautfeiulle and Perry*) అనే ఇద్దరు శాస్త్రజ్ఞులు. వీరు ఒక పాత్రను తీసికొని, దానిలో లిథియం మాలిబ్డేటు (*Lithium Molybda'e*) అనే ఒక రసాయనిక ద్రావణాన్ని పోసి, దానిలో మరకతాల్లోని, మూలద్రవ్యాలను సరియైన పాళ్ళలో కలిపాడు. ఈ పాత్రను పదిహేనురోజులపాటు, 800 డిగ్రీల ఉష్ణోగ్రతవద్ద మరగబెట్టగా, చిన్న చిన్న మరకత స్ఫటికాలు ఆ పాత్రలో ఏర్పడ్డాయి. పచ్చరంగురావటానికి కొద్దిగా క్రోమియా భస్మంకూడా కలిపారు.

ఇలా తయారైన మణులు స్వభావసిద్ధమైన రత్నాలకు ఏమాత్రం తీసిపోలేదు. కాని ఏర్పడిన స్ఫటికాలు చాల చిన్నవిగా ఉన్నవి. వాటిలో మిక్కిలి పెద్దది షుమారు 2 మి. మీ. పొడవు 1 మి మీ. వెడల్పు 1. మి. మీ. మందం ఉన్నది. ప్రథమంలో స్వయంగా తయారు చేయగలిగామనే సంతోషం తప్ప, ఈపద్ధతి ద్వారా తయారైన మణులు సహజమైన రత్నాల కంటె ఎక్కువ ఖరీదుకు గిట్టినవి. అందువల్ల ఈపద్ధతితో రత్నాలను విరివిగా ఉత్పత్తిచేయటానికి వీలు లేకపోయింది.

కాని ఇరవయ్యో శతాబ్దంలో ఈ సమస్య కూడ తేలింది. మిగతా రత్నాలకంటె ఇవి చాల సంశ్లిష్టమైన రత్నాలు. అంటే ఇవి అనేక మూలద్రవ్యాలతో మిశ్రితమైనవి. కెంపులు నీలాలు మొదలైన మణులు ఒక్క ధాతుభస్మాన్ని మాత్రమే కల్గి ఉంటాయి. ఇటువంటి సంశ్లిష్టమైన వస్తువులను తయారుచేయటానికి ఒక సులభమైన పద్ధతి ఉన్నది.


ఒక ద్రవంలో (*Solvens*) ఏదైన ఒక పదార్థాన్ని (*Solute*) కరగించగా ఏర్పడిన మిశ్రిత ద్రవాన్ని 'ద్రావణం' (*Solution*) అంటారు. పంచదారను నీళ్లలో కరగిస్తే పంచదారద్రావణం తయారౌతుంది. ఈమాదిరిగా ఒకానొక ద్రవంలో మరకత మణిలోని మూల ద్రవ్యాలైన బెరిలీయం, అల్యూమినియం మొదలైన పదార్థాల నన్నిటినీ కరగించి, ఒక ద్రావణాన్ని తయారుచేసి, దానినుండి, ఆ కరగించబడిన ఘనపదార్థ మిశ్రమాన్ని తిరిగి సంపాదించటం, వీటిని కృత్రిమంగా తయారుచేయటానికనువైన పద్ధతి.

తయారైన ద్రావణంనుండీ, కరగించబడిన ఘనపదార్థమిశ్రితాన్ని, తిరిగి సంపాదించట మెలా ? ఉదాహరణకు, వేడి నీళ్ళలో, కరగినంత పంచదార చలినీళ్ళలో కరగదు. కరగటానికి వీలైనంత పంచదారను వేడినీళ్లలో కరగించి, ఆ ద్రావణాన్ని క్రమేణా చల్లపరిస్తే, కొద్దికొద్దిగా పంచదార, ద్రావణం (*Solution*) నుండి, ఘనరూపంలో వెలువడ్తుంది. ఇదే విధంగానే మరకతాల్లోని మూల ద్రవ్యాలతో కూడిన ద్రావణా న్నొకదాన్ని వేడిద్రావకంతో తయారుచేసి, దాన్ని క్రమంగా చల్లపరిస్తే, తన్మూల ద్రవ్య మిశ్రితమైన, మరకత మణులు స్ఫటికరూపంలో బయటపడ్తవి.

ద్రావణానికి గల ఇట్టి ధర్మాన్ని ఆధారభూతంగా తీసికొని, ఫ్రాంకుఫర్డు విశ్వవిద్యాలయాలకు చెందిన, జర్మన్ ఖనిజ శాస్త్రవేత్త ప్రొఫెసరు నాకెన్ (*Prof. Nacken*) దీన్ని, ఇటువంటివే మరికొన్ని మణులను తయారుచేయటానికి 1912 లో తొలిసారిగా ప్రయత్నించాడు. చేసిన ప్రయత్నానికి ఫలితం దక్కింది 1928 లో. ఈతడు 'బెరిల్' నే కాక, అభ్రకం ఫెల్స్‌పార్ మొదలైన ఖనిజాలను కూడ కృత్రిమంగా తయారుచేశాడు. ఈ 'బెరిల్' ఖనిజానికి కొంచెం క్రోమియం కలిపితే మరకతంగా మారుతుంది.

వీటిని తయారుచేయటాని కితడు 'ఆటోక్లేవు'లనే ఉక్కు గొట్టాలను ఉపయోగించాడు: ఇవి మన ఇళ్ళలో ధాన్యం మొదలైనవి కొలవటానికి ఉపయోగించే, 'మానిక' ఆకారంలో ఉంటవి. కాని అంతకన్న చిన్నవి. షుమారు 30 ఘ. సె. మీ. వీటి పరిమాణం. మానికలు సాధారణంగా ఇనుపరేకుతో చేస్తే ఇవి మందపు దళసరియైన ఉక్కురేకుతో చేస్తారు. ఇలాంటి గొట్టాల్లో కొంతవరకు నీళ్లు పోసి, దానిలో సరియైన పాళ్ళలో, బెరిలియపు భస్మం, అల్యూమినియం, ఇసుక, కొద్దిగా క్రోమియం కలిపిన మిశ్రమం వేసి, వీటిని షుమారు 380°—400° ఉష్ణోగ్రత వద్దున్న కొలుముల్లో కొద్ది రోజులు ఉంచాడు. ఈ ఉష్ణోగ్రతవద్ద ఘనపదార


(22-వ పేజీ చూడుడు)



కాశ్మీర్‌లోయ: లేహ్‌రాజధానికి పోవు నిరామయరహదారి: బాట కిరువైపులా అస్థినిక్షేపసమాధులు.

ప్రాచ్యఖండనాయకత్వం భారతదేశానికి లభిస్తుందా?

శ్రీ యం. యన్. రాయ్



యుద్ధానంతర పునర్నిర్మాణ సమస్యలతో సతమతమవుతున్న పాశ్చాత్య ఆర్థిక రాజకీయవేత్తలకు, ఆసియాలోని వర్తమాన పరిస్థితుల గూర్చి సమ్యక్పరిజ్ఞానం లేకపోవడం సహజమే. పరిస్థితులు సరిగా తెలియకపోవడంచేత, ఆసియా విషయమై వారికి కొన్ని అపోహలు భ్రాంతులు ఏర్పడడం అనివార్యం. అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న మానవానీకానికి దారి చూపించగల జ్ఞానజ్యోతి ప్రాగ్దిశాకాశాన ఉదయిస్తుందని, యూరప్ అంతా ఈనాడు ఆతురతతో ఎదురుచూస్తున్నవి.

పూర్వం ఒకప్పుడు ఆసియా యూరప్ ఖండాల కూడలిలోనే అట్టి దివ్యజ్యోతి ఒకటి వెల్లివిరిసింది. ఆ జ్యోతి ఈసారి ప్రాగ్గిరించలంలో, ఆర్ష విజ్ఞానానికి పుట్టినిల్లయిన భారతదేశపు నడిగడ్డలోనే ఉదయించగలదనుకోవడంలో విరుద్ధం ఏముంది?

మానవజాతి, ప్రతియుగసంధిలోను, నైతికంగా సంకటావస్థ ప్రాప్తమైనప్పుడెల్లా, ఒక అవతారపురుషునికోసమో లేక ఒక దివ్యసందేశముకోసమో నిరీక్షిస్తూ ఉంటుంది. నేటి యూరప్‌కూడా ఇటువంటి నైతికసంక్షోభావస్థలోనే పడి దురపిల్లుతోంది. కాని తూర్పువు తిరిగి భక్తిభావంతో ఎదురుచూస్తున్న ఈ 20వ శతాబ్దపు ఈ భగవదవతారాన్వేషకు లందరికీ చివరకు ఆశాభంగం కలుగక తప్పదు.

ప్రాచీన దివ్యవిజ్ఞానం అంతా క్రైస్తవ మతంలోనే అంతర్లీనం అయి ఉన్నది. నైతిక పునరుత్థానానికై పెనగులాడుతున్న యూరోపియ జాతులకు "సెర్మన్ ఆన్ ది మౌంట్" అన్న ఏసుక్రీస్తు ప్రబోధంకన్న శ్రేష్ఠమైన సందేశాన్ని ప్రాచ్య మత విజ్ఞాన సంప్రదాయాలు కూడా అందజేయలేవు. ఏసుక్రీస్తు ఏదేశానికీ చెందని విశ్వజనీన వ్యక్తిఅయి సర్వమానవ సౌభ్రాత్రాన్ని బోధించగా, గాంధీజీ సర్వమానవ సౌభ్రాత్రాన్ని బోధిస్తూ జాతీయవాదిగా పనిచేశాడన్న విషయం మనం విస్మరించరాదు. ఏసుక్రీస్తు రోమ్ సామ్రాజ్యాన్ని ధిక్కరించడంకన్న, హెబ్రూజీవిత విధానంలోని దురాచారాలమీద దౌష్ట్యాలమీద తిరుగురాటు చేశాడనడం ఎక్కువ సమంజసం. గాంధీజీకూడా పాతసంప్రదాయాలను మూఢవిశ్వాసాలను నిర్మూలించడానికి ప్రయత్నించాడు; కాని బ్రిటిష్ సామ్రాజ్యవాదంమీద తిరుగుబాటు చేయడమే ఆయన ప్రధాన లక్ష్యం.

ఆయన తిరుగుబాటు చేసిన విధానం నిజంగా విప్లవాత్మకమైనదేనా అన్నది వివాద్యమైన అంశమే. ఈ వివాద మేమైనా, క్రైస్తవమతం సాయపడలేనిచోట గాంధీజం కూడా విఫలం కాక తప్పదన్నది విస్పష్టం.

నైతికపునరుత్థానానికి మతం ఒక్కటే మార్గమని ఎవరైనా నిజంగా బోధించదలచుకున్నట్లయితే, ఆ మతాచరణ ఎట్టిదో వారు విస్పష్టంగా నిరూపించాలి. అనుభవైక వేద్యమైన భక్తి పారవశ్యాలవల్లను, అగమ్యగోచరమైన నీతిబోధలవల్లనూ ప్రయోజనం లేదు, గమ్యస్థానం ఏదో, గంతవ్యమార్గం ఏదో విస్పష్టంగా రూపు కట్టించాలి.

ఫలితాలనుబట్టి చూస్తే, గాంధిజమ్‌కన్న క్రైస్తవమతమే ఎక్కువ కార్యకారి అయినట్లు తోస్తుంది. భారతజాతీయ ప్రభుత్వానికి గాంధిజమ్ శిరోధార్యమైన మతం; ఇంకోవిధంగా చెప్పాలంటే, లౌకికమైన భారత జాతీయ ప్రభుత్వంచేత అధికారరీత్యా గుర్తించబడ్డ మతం గాంధీజమ్ ఒక్కటే అనవచ్చును. కాన్‌స్టాన్టైన్ హయాం నాటినుంచీ రోమన్ సామ్రాజ్యంలో క్రైస్తవ మతం ఏవిధంగా ప్రభుత్వ పోషితమై వచ్చిందో, అదేవిధంగా నేటి భారతదేశంలో గాంధీజంకూడా ప్రభుత్వంచేత మన్నించబడుతున్నది.

కాని భారతదేశం బ్రిటిష్ సామ్రాజ్య ధురంధరత్వంనుండి తప్పించుకొని స్వతంత్రమైనా, గాంధీజీపేరు ఎంత ఆదరిస్తున్నట్లుగా పైకి కన్పించినా, నేడు భారతప్రజాజీవితంలో నైతిక వర్తనం అనేది మాత్రం ఏకోశాన కనిపించదు. భౌతికవాదప్రతిష్ఠితమైన పాశ్చాత్యనాగరకత పూర్వకృతపాప భారంతో దీర్ఘపునాదులకంటా కూలిపోతున్నదనీ, దాని నిక రక్షించగలవారు ఎవరైనా ఉంటే, తాము ఒక్కరమేననీ, భారత జాతీయవాదులు గొంతులు చించుకొని చాటుతున్నారు. జాతీయవాదుల మాటలకూ చేతలకూ మధ్య కన్పిస్తున్న ఈ అఖాతం వారి అతిశయోక్తిదోషం చేత మరింత అలంఘ్యంగా కనిపిస్తున్నదే తప్ప వారిలో నిజంగా గర్వార్హమైనది ఏమీ లేదని కొందరు వెనుక వేసుకొని వస్తున్నారు. ఐక్యరాజ్యసమితి వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థకు చెందిన ఒక శాఖ ఇటీవలనే ఈ విధంగా జాతీయవాదుల అసంగత ప్రసంగాలను సమర్థనచేసింది.

ఇండియా విషయమై ఇలా ఒక మనోహరమైన భ్రాంతి సర్వత్ర క్రమేణ సృష్టించబడుతున్నది. అహింసాత్మకమైన విప్లవంద్వారా స్వాతంత్ర్యాన్ని సాధించిన భారతదేశం ఇకమీద యావత్ప్రపంచానికీ మార్గదర్శకం కావాలనీ, ఒకవైపు యూరోపియ నాగరికతలోని భౌతికవాదమాలిన్యాన్ని ప్రక్షాళితంచేస్తూ, ఇంకొకవైపు నవజాగరణ పొందుతున్న ఆసియాకు నాయకత్వం వహించి ముందుకు నడపవలెననీ ఒక అద్భుతమైన పాత్ర భారతదేశంకోసం కూర్చబడుతోంది.

మానవజాతిలో విశ్వాసం విలుప్తమైపోయి, అవతారపురుషుని ఆగమనంకోసం ఎదురుతెన్నులు చూస్తున్న ఈ భగవచ్చింతాప్రవణుల భ్రాంతులను మనం, మామూలుగా అయితే, అట్టే లక్ష్యపెట్టనవసరంలేదు. కాని అవకాశవాదులైన రాజకీయవేత్తలు కొందరు ఈ భక్తులకు పక్కతాళం వేస్తూ, వారి భ్రాంతులను యథార్థమైనట్లుగా తోపింపజేయడంతో పరిస్థితి ప్రమాదకరంగా పరిణమిస్తోంది. కడచిన అనేక సంవత్సరాలుగా చైనా కూడా అగ్రరాజ్యాలలో ఒకటి అని ఈ అవకాశవాదులచేతనే ఒక భ్రమ కల్పించి పోషించబడింది. కాని ఆ దేశంలో ఇటీవల జరిగిన సంఘటనలవల్ల, ఈ భ్రాంతి భగ్నమై బుద్బుదమట్లు చిట్లిపోయింది. చైనా పోగొట్టుకున్న ఈ 'అగ్ర' స్థానానికే అవకాశజ్ఞులైన రాజకీయవేత్తలు యిప్పుడు ఇండియాను దువ్వి సంసిద్ధం చేస్తున్నారు. చైనామీదికి ప్రళయకాలసముద్రంలాగా విరుచుకుపడ్డ కమ్యూనిస్టు విప్లవాన్ని అరికట్టి ప్రాగ్దక్షిణ ఆసియాలో ప్రజాస్వామ్యానికి భారతదేశం పట్టుగొమ్మ కావాలని వారిప్పుడు తియ్యతియ్యమాటలతో మనకు నూరిపోస్తున్నారు.

ఇస్లాంమతరాజ్యాలకుకూడా భారతదేశం నాయకత్వం వహించగలదని ఆశించడం, గడచిన అనేక సంవత్సరాల భారతజాతీయ చరిత్రను కాదనడమే అవుతుంది.

హిందూమత పునరుద్ధరణమంటూ పలవరిస్తూ ఉన్న కొందరు ఛాందస జాతీయవాదుల మూలంగా, భారతదేశం ఆర్థికంగాను రాజకీయంగాను దుర్బలపడడమేగాక ముస్లిం ప్రపంచం యావత్తూ భారతదేశానికి ప్రతికూలంగా తిరిగింది. ముస్లిం రాజ్యాలలో కెల్ల పెద్దది అయిన పాకిస్తాన్ తన పరిమాణ మహిమచేత, తోటి ముస్లిం రాజ్యాలకు నాయకత్వం వహించాలని అర్రులు చాస్తున్నది. ఇటీవల ఇండియా పాకిస్తాన విరోధం, యుద్ధరంగంలో బలాబలాలు చూచుకొనేదాకా కూడా వచ్చింది. కాశ్మీర్ హైద్రాబాదులు దీనికి తార్కాణం. హైద్రాబాదు వివాదలు నైసర్గిక పరిస్థితులు భారతదేశానికి అనుకూలించినవి. ఈ వివాద చివరకు బలవంతునిదే రాజ్యం అన్న న్యాయాన్ని అనుసరించి, ఎట్లాగో పరిష్కారమైపోయినది. కాని ఒకరి విషయంలో న్యాయమైన ఈ సామెత తమ విషయం కూడ ఎందుకు న్యాయం కాకూడదని చెప్పి, పాకిస్తాన్ కాశ్మీర్‌లో ప్రత్యక్షపోరాటానికి తలపడింది. కాశ్మీర్ ఇప్పుడు ఉభయదేశాలను ఒక విషవ్రణంలాగా పట్టి సలపరిస్తోంది. ఈ గాయాన్ని మాన్పడం ఐక్యరాజ్యసమితి కమీషన్ వంటి భిషఙ్మమాత్రులకు సాధ్యం కాదు. కాని ఇంతకూ చెప్పవచ్చిన అసలు అంశం ఏమంటే, నవభారత దేశం ముస్లింరాజ్యాలకు అనుగ్రహపాత్రం కాలేదు. భారతదేశం ముస్లిం రాజ్యాలను సన్నిహితపరచే ప్రేమబంధనం కావడానికి బదులు, వారిని చీలదీసి ఉంచే ఛేదనసాధనంగానే పరిణమిస్తుందని తోస్తుంది. పశ్చిమోత్తర సరిహద్దున నివసిస్తున్న కొండజాతిప్రజల విషయమై ఆఫ్ఘనిస్తానుకు పాకిస్తానుకు ఈ మధ్య పొడమిన రవరవలను దీనికి తార్కాణముగా పేర్కొనవచ్చును. అయితే ఈ వివాదలో రహస్యంచేయికూడా ఉంది. ఆస్తిపాస్తులు పరపుల్లు చేసుకొని వేరుపడి పోయిన ఈ రెండు దేశాలమధ్య పరిస్థితులు ఇట్లా ఉండగా, మధ్యప్రాచ్యపు ముస్లిందేశాలు ఇండియానాయకత్వాన్ని స్వీకరించడం అసంభవం. అదీగాక, ప్రపంచాధిపత్యానికై పోటీపడి పెనగులాడుతున్న అసలు జగజెట్టు లిద్దరూ ఇప్పుడు మధ్యప్రాచ్యాన్నే తమ స్పర్థారంగంగా చేసుకొని, ఒకరినొకరు నెట్టివేసుకోడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ రంగంలో తృతీయవ్యక్తికి ఎవరికీ స్థానం లేదు. టర్కీ, ఇరాన్ మొదలైన సమస్త మధ్యప్రాచ్యదేశాలూ ఈ ఉభయప్రత్యర్థులలో ఎవరి పక్షానో ఒకరి పక్షాన చేరిపోయి, ఉపగ్రహ రాజ్యాలుగా మనుగడ సాగించక తప్పదు. ఇక్కడ ఒకప్పుడు మహోచ్ఛదశలో ఉన్న రష్యన్ ప్రాభవం ఇటీవల తగ్గుముఖం పట్టింది.

రష్యన్ ప్రాబల్యం క్షీణిస్తున్నకొద్దీ అమెరికన్ ప్రాబల్యం విస్తరించుకొని ముందుకు చొరబడుతున్నది.

మధ్యప్రాచ్యంలో అమెరికా పెట్టుబడిదారులకు చమురుకంపెనీలు ఇత్యాది వ్యాపార సంస్థలు అనేకం ఉన్నవి. ఇట్టి కీలకప్రదేశంపై అమెరికా తన ప్రాబల్యాన్ని ఇతరులకు అప్పగింతపెట్టి పరోక్షంగా వ్యవహారం నడపడానికి ఎంతమాత్రమూ సమ్మతింపజాలదు. మధ్యవర్తులు ఎంత విశ్వాసపాత్రులైనా, తన చమురుతో సంబంధించిన వ్యవహారాలలో ఇతరులను చేయిపెట్టనివ్వడం ప్రమాదకర మని అమెరికా భావించడం సహజమే. కాబట్టి ఇస్లాందేశాల రాజకీయాలలో ఇండియాకు ఏవిధమైన పాత్రను ఎవ్వరూ కట్టబెడతారని ఆశించడానికి వీలు లేదు.

అందుచేత భారతదేశ విదేశాంగ విధానం, మధ్యప్రాచ్యంమీద ఆశపెట్టుకోకుండా, దూరప్రాచ్యంమీదికే విధిగా ప్రసరించవలసివస్తుంది. జవహర్లాల్ నెహ్రూ ప్రధానమంత్రి కావడానికి చాలారోజులక్రితం, చాంగ్ కైషేక్ ఒకసారి ఇండియాకు రావడమూ, పండిట్ నెహ్రూ చాంగ్‌లు సమావేశం అవడమూ సంభవించింది. ఆ సందర్భంలో ఉభయ నాయకులకు గొప్ప సౌభ్రాత్రం ఏర్పడ్డట్లుగా ప్రజలకు తెలియజేయుడానికి బ్రహ్మాండమైన ప్రచారమూ, ఆర్భాటమూ జరిగినవి. చాంగ్ కైషేక్ అధికారచ్యుతుడు అయిన్యతర్వాతకూడా వీరి మైత్రి వెనుకటి స్థాయిలోనే నిలిచిఉన్నదా అంటే, ఆ ప్రశ్నకు ఎవ్వరూ నమ్మకంగా సమాధానం చెప్పలేరు. ఏది ఏమయినా, గత సంవత్సరార్థం నుంచి చైనాలో జరుగుతున్న మహత్పరిణామాల గూర్చి భారత ప్రభుత్వం ఇంతవరకు ఒక్కసారి అయినా నోరు విప్పి వ్యాఖ్యానం చేయకపోవడం చాల విస్మయజనకంగా ఉన్నది. కూమింటాంగ్ ప్రభుత్వపరాజయంతో చైనాకు అగ్రరాజ్యపంచకసభ్యత్వచ్యుతి, దూరప్రాచ్య నాయకత్వ భ్రష్టతా ఏకకాలంలో ప్రాప్తించినవి ఇక ఈ దూరప్రాచ్య నాయకత్వ భారాన్ని త్రోయవలసిన వంతు భారతదేశం పాల బడింది. భారతదేశ ప్రధానమంత్రి అవసరోచితమైన సాహస స్థైర్యాలతో ముందుకు వచ్చి ఈ భారాన్ని స్వీకరించాడు. కాని చైనా కమ్యూనిజానికి ఇదివరకే ఎర అయినందున ప్రాగ్దక్షిణ ఆసియాలో, భారతదేశం నాయకత్వం వహించవలసిన మేర చాలా పరిమితమైపోయింది.

ఇక, ఆసియాదేశాల సాంస్కృతిక సమైక్యత విషయానికి వద్దాము. లోతుకు దిగి చూస్తే, ఆసియాదేశాల సంస్కృతులలో, యూరోపియదేశాల సంస్కృతులయందున్నంత సారూప్యమైనా కన్పించదు. యూరోపియన్ సంస్కృతి అన్న పేరుతో వివిధయూరోపియ రాజ్యాలకు సామాన్యమైన ఒక సంస్కృతి ఉన్నదనడానికి చారిత్రకంగా దాఖలాలు ఉన్నవి. పరంపరాగతంగా వస్తున్న ఆచారసంప్రదాయాలు కూడా యూరోపియన్ జాతు లన్నిటినీ ఒక కూటమిగా సంఘటితపరచడానికే తోడ్పడినవి. సంప్రదాయసిద్ధమైన ఈ ఏకీభావం క్రమంగా బలపడి, ప్రస్తుతం వారిని పృథక్కరించి ఉంచిన నైసర్గిక రాజకీయ ఆర్థిక సరిహద్దులను అధిగమించే ఒక స్వతంత్ర యూరోపియ సమాఖ్యా నిర్మాణానికి దారితీయవచ్చును. గ్రీకో—రోమన్ సంస్కృతి యూరోపియన్ జాతులకు తరతరాలుగా వస్తున్న పైతృక సంపద. ఏసుక్రీస్తు ఇచ్చిన సౌభ్రాత్ర సందేశాన్ని ఊతగా గొని ఒక సర్వమానవ సమసమాజాన్ని నిర్మించడానికి యూరప్ ప్రయత్నించినా ప్రయత్నించగలదు.

కాని ఆసియాదేశాలమధ్య ఇటువంటి ఐక్యతాసాధకమైన అనుబంధాలు ఏవీ లేవు. మతాలు ఒక్కటైతే సంస్కృతులు కూడా ఒకటి అవతవని చెప్పడానికి చరిత్రలో కావలసినన్ని నిదర్శనాలు ఉన్నవి. మానవచరిత్రలో ఇటీవలివరకూకూడా సంస్కృతికీ మతానికీ అవిచ్ఛేద్యమయిన సంబంధం ఏర్పడి ఉంది. మతాలు వేరైనా సంస్కృతి ఒకటి కావచ్చు అన్న అభిప్రాయం చాలా అధునాతనమైనది. యూరోపియదేశా లన్నిటికీ క్రైస్తవమతం ఎట్లాగో అట్లా ఒక సర్వసామాన్యమైన మతం ఆసియాదేశాలకు ఎన్నడూ లేదు. హిందూ బౌద్ధ ఇస్లాం మతాలలో దేనికీ ఆసియాఖండంలో బహుళవ్యాప్తి లేదు. హిందూమతం మొదట్నించీ భారతదేశం సరిహద్దులలోనే పరిమితం అయి ఉంది. హిందూమతం తన జన్మదేశంలోనే అనేక శాఖలుగా చీలిపోయి, గుర్తుపట్టలేని రూపాంతరాలు పొందినది. ఈ రూపాంతరాలలో ప్రతిదానికీ దాని దాని ప్రత్యేక కర్మకాండ, మతగ్రంథాలు పూజాపురస్కారాలు ఏర్పడి ఉన్నవి.

యూదు, క్రైస్తవ ముస్లిం మతాలలోకూడా శాఖలు ఉన్నవి. హిందూమతశాఖల కున్నంత వ్యత్యాసం వాటిలో లేదు. తక్కినమతాలవలె హిందూమతం భిన్నభిన్నశాఖలకు చెందిన తన అనుయాయుల నందరినీ ఏకత్వభావప్రేరితులను చేయలేకపోతోంది. భారతదేశంలో జాతివిభేదాలు కూడా దీనికి తోడై సంస్కృతీసమైక్య

(8-వ పేజి చూడుడు)

మన దేశ సమస్యలు- -నాయకుల అభిభాషణలు

కాశ్మీర్ మధ్యవర్తి సంఘము

కాశ్మీరులో యుద్ధవిరమణ సరిహద్దులను నిర్ణయించటానికిగాను కరాచీలో ఇండియా - పాకిస్థాన్ల సైనికోద్యోగులు సమావేశం కావాలని మధ్యవర్తిసంఘం చేసిన సూచనను భారత ప్రభుత్వం ఆమోదించింది.


కాశ్మీర్ లో ఉభయ సేనలమధ్యను సరిహద్దులు నిర్ణయించట్యానికి కరాచీలో ఉభయ సైనికోద్యోగులు సమావేశం జరపవలసినదని మధ్యవర్తి సంఘం చేసిన ప్రతిపాదనను పాకిస్థాన్ ప్రభుత్వం ఎట్టి షరతులు మినహాయింపులేకుండా ఆమోదించింది.

మధ్యవర్తి సంఘ సూచనపట్ల ఆక్షేపణ లేమీ లేకపోయినప్పటికీ, ఈ సూచనలవల్ల కలిగే ఫలితం ఏమైనా ఉంటుందా అని ఢిల్లీవర్గాలు సందేహిస్తున్నారు.

జనవరి 1 వ తేదీనాడు యుద్ధవిరమణ జరిగినప్పుడు ఉన్న ఉభయసేనల స్థానాలనుబట్టి ప్రస్తుతం ఒక సరిహద్దును నిర్ణయించటానికి కరాచీ సమావేశం ప్రయత్నిస్తుంది. ఏప్రిల్ 28 వ తేదీన మధ్యవర్తి సంఘం సూచించిన మీదట మధ్యవర్తి సంఘ సైనిక సలహాదారు ఆమోదించివున్న యుద్ధవిరమణ సరిహద్దును కూడా ఈ చర్చలలో ప్రాతిపదికగా తీసుకొనటం జరుగుతుంది.

మార్చి నెలలో అప్పుడు వున్న సరిహద్దులను రద్దుచేసి నికరమైన యుద్ధవిరమణ సరిహద్దులను ఏర్పరచేనిమిత్తం ఢిల్లీలో సైనిక సమావేశమొకటి జరిగినది. దక్షిణాన జమ్మూరాష్ట్రంలోని మనవార్ అనే స్థలందగ్గరనుంచి ఉత్తరాన టిత్వాల్ మీదుగా కెరన్ వరకూ సరిహద్దు ఉండాలని ఉభయపక్షాలూ అంగీకరించారు. కాని కెరన్ నుంచి గురెజ్ మీదుగా ద్రాస్ కు వెళ్లే సరిహద్దువిషయమైమాత్రం అంగీకారం కుదరలేదు. కరాచీసమావేశంలో ఈ విషయమై చర్చ జరగవచ్చును. నికరమైన యుద్ధవిరమణ సరిహద్దులను నిర్ణయించటానికి మధ్యవర్తి సంఘం పడుతున్న ఆదుర్దావల్లనే ఈ సమావేశం ప్రతిపాదించబడ్డది.

పాతచట్టంక్రింద కొత్తఎన్నికలు పనికిరావు- రాష్ట్రపతి



పాతఇండియా రాజ్యాంగచట్టమైన 1935 సం॥పు ఇండియా ఆక్టుప్రకారము ఇప్పుడు వెంటనే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను జరుపవలెననుట అసాధ్యమైన అసందర్భమైన అవకతవక విషయము.

రాజ్యాంగపరిషత్తులో ఇప్పుడున్న మెంబరులే ఢిల్లీ అసెంబ్లీ సభ్యులుగా వున్నారు. ఈ రాజ్యాంగ పరిషత్సభ్యులు ఆయా రాష్ట్రీయ శాసనసభ్యులచే ఎన్నుకోబడినవారు. ఈ పరిషత్సభ్యుల ఎన్నికలు 1946 ఫిబ్రవరిలో జరిగెను. ఈరీతిగా ఎన్నుకోబడిన కేంద్ర అసెంబ్లీ సభ్యులు నిజముగా ప్రజాభిమానంగల ప్రతినిధులేనా? వీరిని ఎన్నుకొనినటువంటి రాష్ట్రీయ శాసన సభ్యులయందు ప్రజలకింకను విశ్వాసము కలదా లేదా అను విషయమున్నూ నిరూపింపబడి ఋజువుఅయ్యే నిమిత్తమై ఇప్పుడే క్రొత్త ఎన్నికలు జరుపుట మంచిది కాదా అనే విషయమై ఢిల్లీలో కొందరు ప్రముఖులు చర్చించినందువల్ల ప్రాత 1935 సం॥పు ఇండియాఆక్టు ననుసరించియే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగగలవనెడి వదంతి యొకటి వ్యాపించింది. ప్రజాభిప్రాయమును పరీక్షించే నిమిత్తం జరుపబడే ఎన్నికలైనయెడల అట్టి ఎన్నికలను కేంద్రశాసనసభకున్నూ రాష్ట్రశాసనసభకున్నూ మాత్రమే జరుపుటవల్ల ప్రయోజనం లేదు. ప్రాతవోటర్ల జాబితాలతో క్రొత్త ఎన్నికలను జరపినందువల్ల ప్రయోజనం లేదు. క్రొత్తవోటర్ల జాబితాలను తయారుచేయవలెను. అటువంటి తాజా జాబితాలతో జరిపించినవే క్రొత్త ఎన్నికలనిపించుకొనును.

ఎన్నికలు జరుగు తేదికి ఆరుమాసాల క్రిందటివరకు సరిచూడబడిన వోటర్ల జాబితాలు ఉండవలెను. యుక్తవయస్కులైనవారి కందరికి వోటింగు హక్కు యుండవలెను. ఈ జాబితాలను తయారుచేయుటకు ఒక సంవత్సరకాలము పట్టును.

అయితే, యిప్పుడు ఎన్నికలు ప్రాత 1935 సం॥పు ఆక్టుప్రకారం జరిపించవచ్చునా?

తమకు కావన్న క్రొత్తరాజ్యాంగ చట్టము ప్రకారము జరపవలెనా అనే ప్రశ్న యొకటి యున్నది.

కేంద్రఅసెంబ్లీ సంగతి పరిశీలించి చూద్దాం. 1935 సం॥ ఇండియా ఆక్టులో రెండు అధ్యాయములు కలవు. ఒకటవ అధ్యాయములో రాష్ట్రీయ స్వపరిపాలనాధికారములు నిర్వచింపబడెను. రెండవ అధ్యాయములో ఫెడరలు (సమాఖ్య) ప్రభుత్వము నిర్వహించబడెను. కాని యీ ఫెడరేషను ప్రభుత్వవిధానము అమలు జరపబడనే లేదు. ఫెడరేషనుకు సంబంధించిన వోటర్ల జాబితాలు కూడా తయారు కాలేదు.

కేంద్రఅసెంబ్లీకి సామాన్యంగా వోటర్లు సరాసరిగా ఎన్నుకోవలెను. కేంద్ర ఎగువ శాసనసభకు మాత్రమే పరోక్ష ఎన్నికలు జరుగవలెను.

కాని, 1935 సం॥ ఇండియా ఆక్టుప్రకారంగా అయితే కేంద్ర దిగువ శాసనసభకు రాష్ట్రీయ శాసనసభ్యులే ఎన్నుకోవలయుననియు ఎగువ శాసనసభకు మాత్రము వోటరులే ప్రత్యక్షంగా ఎన్నుకోవలెననియు నిబంధింపబడెను. ఇది యిట్లుండగా సంస్థానాల తరఫు ప్రతినిధులు కూడా ఎన్నుకోబడవలెను. సంస్థానాలను కూడా యిందులో చేర్చవలెను. 1935 సం॥ ఇండియాఆక్టు ప్రస్తుత దేశపరిస్థితులకు ఎంతమాత్రం వర్తింపజాలదు. కనుక, అట్టి పాత చట్టమును పురస్కరించుకొని ఎన్నికలను జరుపుట సాధ్యపడజాలదు. ఆ కారణంవల్లనే 1946 సం॥లో కేంద్రశాసనసభకు ఎన్నికలు జరిగినప్పుడు 1919 సం॥ ఇండియా ఆక్టు ప్రకారంగా జరుగును. రాష్ట్రీయశాసనసభల ఎన్నికలు మాత్రము 1935 సం॥ ఆక్టుప్రకారంగా జరుపబడెను.

1947 సం॥ ఆగస్టు 15 తేదీని భారతదేశానికి స్వాతంత్ర్యమును ప్రకటించినతోడనే కేంద్రములో రెండు శాసనసభలు ఉండనక్కరలేదని ఎగువసభ యొకటి ఎత్తివేయబడెను. రాజ్యాంగ పరిషత్తు కేంద్ర అసెంబ్లీ అధికారము ఒప్పజెప్పబడెను. కనుక 1935 సం॥ ఇండియా ఆక్టు ప్రకారముగా కేంద్రఅసెంబ్లీకి క్రొత్తఎన్నికలను జరుపదలంచుట కట్టి అవకతవక ఆభాసమైన పని. అట్టి పని సాధ్యం కాదు.

ఇక రాష్ట్రముల సంగతి చూద్దాం: ఈ రాష్ట్ర శాసనసభలలో మహమ్మదీయులకు సభ్యత్వ స్థానములు ప్రత్యేకింపబడినవి. ఆయా మతసంఘములకు ప్రత్యేక నియోజకవర్గము లేర్పరుపబడియున్నవి. హరిజనులకు, అనాగరిక జాతులకు స్త్రీలకు ప్రత్యేక ప్రాతినిధ్యములు కలవు. అటువంటి నియోజకవర్గపద్ధతి యీ కాలానికి తగదు. మన రాజ్యాంగపరిషత్తువారు క్రొత్తరాజ్యాంగ చట్టములో ఆయా మతసంఘముల ప్రత్యేక ప్రాతినిధ్యము లుండరాదని రద్దుచేసిరి.

కొన్ని రాష్ట్రములలో జిల్లాబోర్డు ఎన్నికలు జరుపుటకు కూడా తగిన క్రొత్త వోటర్ల పట్టీలు తయారుకాలేదు. మద్రాసురాష్ట్రములో జిల్లా బోర్డు ఎన్నికలను జరుపుటకు ఇంకా వెనుకముందు ఆలోచిస్తూ ఉన్నారు. గత 3 సం॥ల నుండి వాయిదా వేయుచునేయున్నారు. ప్రతి రోజూ ఏదో ఒక బిల్లును మినహాయించుచునే యున్నారు.

ఈ సందర్భ పరిస్థితులలో వోటర్ల జాబితాలు చాలా లోపభూయిష్ఠముగానున్నవి. 1946 సం॥ వోటర్ల జాబితాలను ఆధారంగా స్వీకరించియైనను రాష్ట్రీయ ఎన్నికలు జరుగు వీలు లేదు. ఒకవేళ యీ రోజున రాష్ట్రశాసనసభలకు ఎన్నికలు జరిపినట్లయితే ఉండవలసిన మొత్తము వోటర్లలో 1/11 వంతు లేదా 3/17 వంతు వోటర్లు మాత్రమే యిప్పటి జాబితాలలో కలరు. ఈ కొలదిమంది వోటర్లతో ఎన్నికలను జరిపి తన్మూలంగా ప్రాప్తి ప్రజాభిప్రాయము నిరూపింపబడినదని వాదించుటకు వీలు లేదు. ఇట్టి ఎన్నికలద్వారా ప్రజాభిమతము వ్యక్తమైనదనుట హాస్యాస్పదము.

రాష్ట్రాల సంగతి ఏకారణంచేతనైనను విడిచిపెట్టి, కేంద్రశాసనసభకు మాత్రమే ఎన్నికలను జరుపుటకు పూనుకొనేయెడల రాష్ట్రీయ శాసనసభల సభ్యవర్గములద్వారా కేంద్ర అసెంబ్లికి ఎన్నికలను జరుపవలసియుండును. ఈ రాష్ట్రీయ అసెంబ్లీ సభ్యవర్గములు 1936 సం॥ వోటర్ల జాబితాలనుబట్టి ఎన్నుకోబడియుండిరి. కనుక యిట్టి సభ్యవర్గముచే కేంద్ర అసెంబ్లీకి సభ్యులు ఎన్నుకోబడినయెడల వోట్లు యివ్వవలసిన వోటర్లలో ముప్పాతికవంతుమంది మాత్రమే వోట్లు ఇచ్చినట్లగును. ఇట్టి ఎన్నిక ఫలితమును ప్రజానిర్ణయమని చాటించుట అసత్యమును సత్యముగా వెల్లడించుట యగును. భగవంతునియెడల అపచారము చేసినట్లగునుకాని, నేడు అటు కాక మరొక విధముగా ఎన్నికలను కేంద్ర శాసనసభకు జరుపజాలము.

కాబట్టి ప్రస్తుతం సాధ్యమైన ఎన్నిక పద్ధతుల నన్నింటిని అనేక హేతువాదములతో త్రోసివేసినపిమ్మట, ఇక తేలెడి సారాంశమేమనగా, ప్రస్తుతము ఎన్నికలను జరపకుండా ఉండటమే అయితే, యీ ఎన్నికలను త్వరగా జరిపెంచే పద్ధతికూడా చూడవచ్చును. మన రాజ్యాంగపరిషత్తు చాలా నిద్రపోతూ తాబేటి రథంలాగున సాగుతోంది. కాని యిటీవల దానికి కొంత చురుకు పుట్టినది. ఈ పరిషత్తు పని త్వరగా ముగియగానే 1950 సం॥ నవంబరులోనే మనము ఎన్నికలు జరుపుకోవచ్చును. ఈ పని నెరవేరేయెడల, ఇంతలోనే మనము త్వరపడి, తాతలనాటి పాత వోటర్ల జాబితాలతో తుప్పుపట్టి పాతఎన్నిక పద్ధతులతో ఎన్నికలను జరుపవలసిన అగత్యము లేదు.

"భారతదేశ విదేశ వాణిజ్యస్థితి" - జాన్‌మత్తయి

డాలరు క్షామమునుండి తప్పించుకొనుటకై బ్రిటను చేయుచున్న కృషికి భారతదేశము కూడా తప్పక తోడ్పడగలదు. ఆరీతిగా తోడ్పడుట భారతదేశానికి క్షేమకరము. స్టర్లింగు మారకపురేటు స్థిరంగానే ఉండేటట్లు చెయ్యాలి. కేవలము స్వలాభ కాంక్షతోనే భారతదేశము పైరీతిగా కోరుచున్నది. స్టర్లింగు యొక్క (పౌనుయొక్క) విలువను స్థిరప్రమాణములో నుంచుటకై బ్రిటన్ ఖజానామంత్రి క్రిప్సు చేయుచున్న ప్రయత్నములకు మనము కూడా తోడ్పడవలెను. కాని, అమెరికానుంచి భారతదేశం తెప్పించుకొనుచున్న సామగ్రులు ప్రస్తుతం అత్యంతావశ్యకములైనవి కనుక అమెరికానుండి సరకులను తెప్పించుకొనుట విరమింప వీలు లేదు. పౌను విలువను స్థిరప్రమాణంలో ఉంచుటకుగాని బ్రిటిషు సరకులను కొంత పరిమితి వరకు మాత్రమే భారతదేశము తెప్పించుకొనగలదు. భారతదేశానికి కావలసిన వ్యవసాయ యంత్రములను పరిశ్రమలకు కావలసిన యంత్రములను అమెరికానుంచి తెప్పించుకోవలసి యున్నది. కనుక యీ అమెరికను సరకులను తెప్పించుకొనుట తగ్గించవలెనంటే సాధ్యం కాదు

ఆసియా ఖండమునకు భారతదేశము నాయకత్వం వహించవలసియున్నది. కనుక భారతదేశమును ఆర్థికముగా సమర్థమైన దేశముగా చేయవలెనను అభిలాషతోనైనను భారత దేశాభివృద్ధికి బ్రిటను తోడ్పడవలెను. భారతదేశమునకు బ్రిటను చెల్లించవలసిన స్టర్లింగు బాకీమొత్తము విషయములో న్యాయమైన విధముగా దఫాలవారీగా చెల్లించు విషయమై బ్రిటిష్ ఖజానామంత్రితో ఒక తృప్తికరమైన ఒడంబడిక చేసికోవచ్చును. భారతదేశానికి బ్రిటనుకు మధ్య వ్యాపారం జరుగుతూఉండడమే కాకుండా వృద్ధిపొందుతూ వుండాలి. ఉభయ దేశాలకు మధ్య 200 ఏండ్లనుంచి వర్తకం జరుగుతోంది. పాత ఖాతాదారులతో వ్యాపారం ఎప్పుడూ శ్రేయస్కరం.

కాబట్టి స్టర్లింగు నిలువల విషయమున ఆయన ఎదుర్కొనిన సమస్య తానంతట అది తేలిక పరిష్కారమవుటకు వీలున్నది. నేను భారతదేశ ఆర్థిక శ్రేయస్సు వ్యవహారముల నిర్వహించవలసిన మంత్రిని: అందువల్ల ఆ అనుభవములో భారతదేశ భవిష్యత్తు అమోఘముగా నుండగలదని నేను చెప్పగలను. మా దేశము నెదుర్కొనిన ఆర్థికసమస్యలన్నిటికి మూలం పరిపాలనకు సంబంధించినవని అప్పుడప్పుడు నేను భావించుతూవుంటాను. ఇపుడు మాదేశంలో అమలునంగున్న పన్నుల ప్రమాణమునుగురించి ఆలోచించుట, మేము తక్షణము పరిశీలించవలసిన సమస్యలందొకటి. ఆ పన్నుభారము క్రమముగా తగ్గుట చాల అవసరమని నా అభిప్రాయము. ప్రస్తుత పన్నులవిధానము యుద్ధానంతర పరిస్థితులలో వచ్చినది.

తను మరింత దుష్కరమొనర్చినవి. ఆయా కారణాలచేత, బహుజాతిసమన్వితమైన యూరోపీయఖండంకన్న కూడా భారతదేశమే ఈవిషయంలో తీసిపోతోంది. యూరప్‌లోని ఇటాలియన్లకూ స్వీడిష్‌వారికీగాని, స్పానిష్‌వారికీ జర్మనులకూగాని ఆచారవ్యవహారములలోను వేషభాషలలోను ఉన్నంత సాన్నిహిత్యము భారతదేశంలోని రాజపుట్లకు బెంగాలీలకుగాని పంజాబీలకు తమిళులకుగాని లేదు.

ఆసియా దేశాలమధ్య సాంస్కృతిక సమైక్యత ఉన్నదనడం ఉత్ప్రేక్షగా తప్ప నిజంగా తీసుకోవడానికి వీలులేదు. సాంస్కృతిక సమైక్యతను ఆధారంగా చేసుకొని ఇండియా ఆసియా ఖండానికి నాయకత్వం వహించగలదనుకోవడం ఈ పరిస్థితులలో భ్రాంతే అని తోస్తుంది.

హాంకాంగ్ రక్షణలో ముప్పేటలముళ్లు

హాంగ్ కాంగుకు, కమ్యూనిస్టులతో వాణిజ్య వ్యాపారాలు వృద్ధిచేసుకోవచ్చునేమో నన్న ఆశ కలుగుతూంది. కాని ఈ వలస విషయంలో వాళ్ల ఉద్దేశ్యాలు ఎల్లా ఉన్నాయో అన్న భయంతో గుండె గతుకుమంటూనూ ఉంది.

ఈ వ్యాసరచన సమయానికి, కమ్యూనిస్టు ముఖ్యబలాలు, హాంగ్ కాంగ్ సరిహద్దులకు 200 మైళ్లపై చిల్లు దూరంలోనే ఉన్నాయి. కాని సమీపంలో, ప్రక్కనున్న క్వాంగ్ టుంగ్ రాష్ట్రంలోనే, అక్కడక్కడ కమ్యూనిస్టు గోరిల్లాదళాలుకూడా చాలా సమీపంగానే ఉన్నాయి. హాంగ్ కాంగ్‌కు ఈమధ్యనే చేరుకొన్న బ్రిటిష్ దళాలు, కొద్దివారాలలోనే, యుద్ధవిజయాలతో ఆరితేరిన కమ్యూనిస్టు సైన్యాలను, హాంగ్ కాంగ్ సరిహద్దుపొడుగునా ఉన్న పచ్చని పరిచేలలో ఎదుర్కోవలసివస్తుందనే అంచనా వేసుకొంటున్నాయి.

హాంగ్ కాంగ్ విషయంలో కమ్యూనిస్టు ఉద్దేశాలేమిటో తెలియక బ్రిటిష్ ఉద్యోగులు తికమకలు పడుతున్నారు. చాలామాట్లు బ్రిటిష్ ఉద్యోగులవద్దనుంచి విషయసేకరణ చేద్దామని నేను వెళ్లాను. కాని వాళ్లు నాకు చెప్పటం కంటె, నేను రెండునెలలు కమ్యూనిస్టు పాలనలో ఉండి వచ్చినందువల్ల, నావద్దనుంచి విషయాలు తెలుసుకొందామన్న స్థితిలోనే వాళ్లు ఉంటూ వచ్చారు. హాంకాంగ్ ప్రభుత్వ అధికారులు, ఎక్కడ ఏచిన్నవిషయం, ఏదైనా కమ్యూనిస్టు ఉద్దేశాలకు సూచనగా దొరకుతుందేమో నని గాలిస్తున్నారు. ఎందుకంటే, చైనీస్ కమ్యూనిస్టులు, ఇన్నిఏళ్ళనుంచే ఎప్పుడూ కూడా, హాంగ్ కాంగ్ విషయంలో అధికార యుతమైన అభిప్రాయం ఏమీ వెలిబుచ్చి ఉండలేదు. అనధికారరీత్యా, "హాంకాంగ్ సమస్య సంప్రదింపులతో తేల్చుకోవచ్చును" అనిమాత్రమే ముక్తసరిగా చెప్పి ఊరుకొంటూ వచ్చారు.

ఈలోపుగా, హాంగ్ కాంగ్‌లో తము చేసేందుకు ఏ అభ్యంతరమూ లేదన్న అవకాశాన్ని పురస్కరించుకొని, ఒక దినపత్రికను (హ్వా హ్సి యాంగ్ పావ్) ప్రచురింపసాగారు. న్యూ చైనా న్యూస్ ఏజన్సీ అనే వార్తాసంస్థను స్థాపించి, 'చైనా డైజస్టు' అనే ఆంగ్లపక్షపత్రికను నడుపుతున్నారు. దక్షిణచైనాలోని కమ్యూనిస్టు గోరిల్లా మురాలతో ఎప్పటికప్పుడు వేగు నడుపుకొంటూ ఉండేందుకు చైనా కమ్యూనిస్టులు, హాంగ్ కాంగ్‌ను బాగా ఉపయోగించుకొంటూ వచ్చారని, కొందరు అభిజ్ఞవర్గాలవారి అభిప్రాయము.

హాంగ్ కాంగ్ చరిత్ర చిత్రంలో, తక్షణ తాత్కాలిక పరిస్థితుల స్వరూపంకన్నా దీర్ఘ కాల పరివర్తనా స్వరూపమే ఎక్కువ స్పష్టంగా గోచరిస్తుంది.

ఒక శతాబ్దంక్రింద, కాపిటలిస్టు తత్వవిస్తీర్ణ శక్తి నిరాఘాటత్వానికి, చైనా నాలుగు గోడల మధ్య ఏకాకిగా పడిఉంటూన్న విధానానికి, ప్రబల నిదర్శనంగా ఉండేది. ఆనాడు పారిశ్రామిక పాశ్చాత్య ప్రపంచంలో అగ్రేసరత్వం వహించిన బ్రిటన్, కరుడుకట్టిపోయిన చైనా కోట గోడలను పగలగొట్టటానికి బహు తీవ్రంగా ప్రయత్నించింది. హాంగ్ కాంగ్ దీవి, కొండల మయంగా ఉండేది. అప్పటికి వృద్ధిపొందలేదు. జననివాసం కూడా చాలా పల్చపల్చగా ఉండేది. 1842 లో జరిగిన నల్లమందు యుద్ధంలో చైనానుంచి ఈ దీవిని లాగివేసుకొన్నారు. హాంకాంగ్ విక్టోరియా హార్బరు, చైనాగడ్డమీద ఉన్న కౌలూన్ అనే పట్టణాన్ని (కౌలూన్ అంటే, చైనీయభాషలో తొమ్మిది రాక్షసులని అర్థము—ఇక్కడ తొమ్మిది కొండగుట్టలు, తొమ్మండుగురు రాక్షసుల మూపురాలలాగా ఉంటాయి.) 1860 లో చైనాపై జరిగిన యుద్ధంలో స్వాధీనపరుచుకొన్నారు. 1898 లో, మంచూ సామ్రాట్టుల ప్రభ కొకటివేళ్లతో కదిలిపోయే సమయంలో, కౌలూన్ చుట్టూఉన్న రాష్ట్రానంతనూ ఆ

ఆంధ్రా రాత్

రాజులవద్దనుంచి బ్రిటిష్‌వారు గుత్తకు పుచ్చుకొన్నారు.

ఆనాడు చైనా సామ్రాట్టుల తత్వం పాతపడి స్థాణువుగా నిలచిందిగానూ, పాశ్చాత్యుల సామ్రాజ్యవిస్తరణ తత్వం నిరాఘాటమైన ప్రబల శక్తిగానూ పాశ్చాత్యతత్వం ముందు పూర్వకపు చైనా రాచరికము, కొకటివేళ్లతో కదిలిపోయింది.

కాని గతపాతికేళ్లల్లోనూ, పాశ్చాత్యవలస విధానమే గడ్డకట్టి నిలచిందిగా తయారయేటప్పటికి, దాన్ని కదిలించటానికి ఆశియన్ జాతీయ తత్వము నిరాఘాటమైన శక్తిగా బయలుదేరింది. బ్రిటన్ ఈనాడు తనను సమర్థించుకొంటూ, ఈనాడు హాంకాంగ్ ఇంతటి రేవుగా వాణిజ్య వ్యాపారకేంద్రంగా అయిందంటే, అంతా తమ కృషీ, వాణిజ్యదక్షతవల్లనే అనీ, ఉత్తబయలులోనుంచి హాంకాంగ్ అనే పట్టణాన్ని తమ కాయకష్టంతో నిర్మించామనీ, ఈనాటి హాంకాంగ్ సౌభాగ్యం అంతా తమ చలవేననీ చెబుతూంది. ఈనాడు అక్కడ 20 లక్షల జనాభా, అందులో నూటికి తొంభై ఎనమండుగురు చైనీయులు, ఉన్నారంటే - బ్రిటీష్ పరిపాలనాదక్షతకు, శాంతి రక్షణా సామర్థ్యానికి, ఇన్‌ఫ్లేషన్‌తో కరెన్సీలు తారుమారౌతూన్న పరిసరమధ్యంలో సుస్థిరమైన కరెన్సీ నిలిపిన ప్రభుత్వ ఆర్థికచాకచక్యానికి, నిదర్శనంగా చెప్పుకొంటారు.

చైనా దేశభక్తులు, ఏ పక్షానికి చెందిన వాళ్లయినా సరే, రక్షణ కావలసినప్పుడు హాంగ్ కాంగ్‌కే చేరుకొంటారు. కాని హంకాంగ్ మాత్రం చైనాదేననీ, చైనానీరసస్థితిలో నున్నప్పుడు చైనానుంచి పాశ్చాత్యులు లాగివేసుకొన్న వలసలలోదే నని ఏకకంఠంతో వాదిస్తారు.

చైనాతో వ్యాపారంలో కొల్లగొట్టిన లాభంతోనే, చైనీయ కార్మిక శక్తులను, కూలినీ ఉపయోగించుకొనే, హాంకాంగ్ నగరం నిర్మించబడిందంటారు. దేశీయవిప్లవపక్షం అంటూ ఒకటుండి నడపసాగితే, ప్రజలలో ఈ అభిప్రాయాలకున్న శక్తిసామర్థ్యాలెంతో విశదమౌతుంది. అల్లా 1925-27లో కూమింగ్‌టాంగ్ విప్లవపక్షంగా పనిచేస్తున్న రోజులలో ఈ శక్తి హాంకాంగ్‌లో, జనరల్ స్ట్రైక్సు రూపంలో ప్రదర్శితమై, హాంకాంగ్‌ను చేయి కాలాడకుండా చేసివేసింది.

జనం రద్దీతో కిటకిటలాడుతూ క్రిక్కిరిసిఉన్న హాంగ్ కాంగ్ బజార్ల పేవ్‌మెంట్లమీద, ఇంగ్లండునుంచి క్రొత్తగా దిగిన లెనిస్టర్ పైకు రెజిమెంటు, బ్రిటిష్ రిక్రూట్ల తెల్లమొగాలు కనబడటం ఎక్కువౌతూ వస్తూంది. వాళ్లకన్నా కాస్త ఈ ఎండలకు అలవాటుపడీ, చామనచాయకు తేలిన, బ్రిటిష్ హస్సార్‌లూ కనబడుతారు. ఈ హస్సార్‌ల రెజిమెంటును మలయానుంచి ఇక్కడకు తెచ్చారు. గారిసన్‌లోని నాల్గువేల సైనికుల సంఖ్యను ఇప్పుడు మూడురెట్లు చేస్తున్నారు. అటు హాంగ్ కాంగ్ హార్బరులో, "బెల్‌ఫాస్టు" జమైకా" అనే క్రూయిజర్ యుద్ధనౌకలూ, మూడు డిస్ట్రాయర్లూ జలవిహారం చేస్తున్నాయి. కమ్యూనిస్టుల ఉద్దేశాలేమిటో తెలియక, తమ రక్షణలను బలీయం చేసుకొనేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

కమ్యూనిస్టులూ, చైనీయ మధ్యతరగతి జనాభా—వీరి మనస్సులలో బ్రిటన్ హాంగ్ కాంగ్‌కు అంటిపెట్టుకొని ఉండాలని నిశ్చయించుకొన్నది" అన్న అభిప్రాయం కల్గించటానికే, ఈ బలాల సేకరణ ముఖంగా ఉద్దేశించబడింది. కాని యుద్ధపరిచయం ఉన్నవాళ్ళెవళ్ళూ ఈ 12,000 ల స్వల్పసైన్యమూ ఉధృతంగా వచ్చిపడే శత్రుబలాలను అరికట్టగలుగుతుందని ఏమాత్రమూ అపోహపడుతారనేది కల్ల.

డిసెంబరు 1941 లో బ్రిటిష్, కనెడియన్, ఇండియన్, చైనీస్ సైనికులూ, వలంటీర్లూ మొత్తం అంతా 15,000 సైన్యం హాంకాంగ్ రక్షణలో ఉంది. జపాన్ సైన్యాలు 50,000 సంఖ్యలో ముట్టడించాయి. రక్షణ సైన్యాలు నగరం పడిపోకుండా, పదహారురోజులదాకా మాత్రమే ఎల్లాగో పాటుపడగల్గాయి. హాంగ్ కాంగ్‌కు ఇప్పటికీ ప్రయోజనకరమైన విమానాశ్రయాలు సరిగ్గా చాలినన్ని లేవు. నేటి ఎద్దడి ఎక్కువ. కాని బ్రిటిష్ ఉద్యోగులు కొందరు అప్పటికీ ఇప్పటికీ చాలా తేడా ఉందనీ, ఇప్పుడున్న బ్రిటిష్, వైమానిక నావికాబలాలకు 1941 లో ఉన్న వాట్లకూ పోలికే లేదనీ ఈనాడు పైచెయ్యి బ్రిటన్‌దేననీ చెప్పుకొంటారు.

కానీ మరో తేడా కూడా ఉంది. 1941 లో చైనీయ జనాభా యావన్మందీ - జపాన్ అంటే ఉన్న ద్వేషంతో బ్రిటిష్‌వారికి సంపూర్ణంగా సహాయం చేయ సుద్యుక్తులై ఉన్నారు. హాంకాంగ్‌ను చైనాలో చేర్చటానికే యుద్ధం జరిగితే, చైనీయ ప్రజాశక్తి అంతా కమ్యూనిస్టుల సహాయానికే ఉపకరిస్తుంది. ఎక్కువ మంది అధమం, బ్రిటిష్‌వారిపట్ల సహాయనిరాకరణమన్నా అవలంబిస్తారు.

అమెరికన్ నౌకలు ఒక క్రూయిజర్‌తో సహా, హాంగ్ కాంగ్ పరిసరాల్లో చాలా ఉన్నాయన్న ధీమా ఒకటికూడా ఇక్కడి బ్రిటిష్ ఉద్యోగులకుంది. అమెరికన్ వైస్ అడ్మిరల్ ఆస్కార్ బాడ్జర్ హాంకాంగ్ బ్రిటిష్‌వారి చేతుల్లో ఉండటమే తన అభీష్టమనీ, ఆ రీతిగా చైనా కొక గవాక్షంలాగా హాంగ్ కాంగ్ మిత్రహస్తాలలో ఉండటం, (ముఖ్యంగా ట్సింగ్‌టావ్ పోయినందువల్ల,) మంచిదనీ, మాయామర్మంలేకుండా చెప్పేశాడు. కాని అమెరికన్ ప్రభుత్వము, ఈయన అభిప్రాయాల నెంతవరకూ పాటించనున్నదో కూడా స్పష్టంగా తెలియదు.

మరికొందరు బ్రిటిష్‌ఉద్యోగులు—కమ్యూనిస్టులు హాంగ్ కాంగ్‌ను ముట్టడించటం మాటే "కేవలం నూతన యుద్ధం ప్రారంభమవటమే; తదనుగుణ్యంగానే పరిస్థితులుంటాయ" అంటూ పెద్దచేసి చెపుతారు.

కమ్యూనిస్టులు తలచుకొంటే ఏ యుద్ధావసరమూ లేకుండానే హాంగ్ కాంగ్‌ను గొంతు నులిమెయ్యగలరనే విషయం వాళ్ళు మర్చిపోతున్నారు. ఇక్కడున్న 5000 మంది కమ్యూనిస్టులలో, చాలామంది, ఒక్క 'యుటిలిటీస్ యూనియన్' లోనే కాక, అక్కడి రెండు, పెద్ద కార్మిక ఫెడరేషన్‌లలోనూ కీలక స్థానాలలో ఉన్నారు. రాష్ట్రాన్నంతనూ ఒక్క జనరల్ స్ట్రైక్‌తో, అచేతనంగా చేసివేయగలరు. దక్షిణ చైనాలో చలామణిలో ఉన్న కోటానుకోట్ల హాంగ్ కాంగ్ డాలరులను, హంగ్ కాంగ్‌పై గుమ్మరించి, హాంగ్ కాంగ్ వాణిజ్యవ్యాపారాలను బీభత్సంలో ముంచెత్తగలరు. చైనాతో హాంగ్ కాంగ్ వాణిజ్యవ్యాపారాలను ఉత్తరించగలరు. ఈ వ్యాపారాలమీదే హాంగ్ కాంగ్ బ్రతుకు ఆధారపడి ఉంది.

ఈ విషయాలన్నిటినిబట్టీ, కొందరు ఉద్యోగులు, బ్రిటిష్ సైన్యాలను ఇక్కడికి చేర్పటం విషయంలో, అల్లరిచేసుకొని కమ్యూనిస్టులను రెచ్చగొట్టటం మంచిది కాదంటారు. అనవసరంగా, కజ్జాకోరుతనం చూపించటం బుద్ధిహీనత అంటారు. గత ఏప్రెల్‌లో, తాత్కాలిక సంధి జరుగుతున్న చివరిదినాన్న అమెథిస్టును (బ్రిటిష్ యుద్ధనౌకను) యాంగ్‌ట్సీనది ఎగువభాగానికి పంపించటం ఇల్లాటి బుద్ధితక్కువ పనేనంటారు. అప్పుడు "అమెథిస్ట్" సంఘటన విషయంలో చాల కోపాలే వచ్చాయి. కాని కాస్త సింహావలోకనం చేసుకొన్నాక, పరాయివాళ్ళ దేశ ఆంతరంగిక యుద్ధరంగంలోకి బ్రిటిష్‌నౌకను నడపటంలో నౌకాధికారి చాలా పెద్ద తప్పు చేశాడనే, చాలామంది భావిస్తున్నారు.

హాంగ్ కాంగ్ రక్షణకు స్థానిక బలాలను బహు కొద్ది మాత్రంగానే సేకరించగల్గుతున్నామని ప్రభుత్వాధికారులకు చాలా అలజడిగానే ఉంది. కాని ప్రజాభిమానం చూరగొనలేకపోవటంవల్లనే ఈ ఫలితం సంభవించింది. 1945 లో బ్రిటిష్‌వారు మళ్ళీ హాంగ్ కాంగ్ ప్రవేశించినప్పుడు హాంగ్ కాంగ్ చైనీయులు చాలా ఉత్సాహసంతోషాలే వెలిబుచ్చారు. హాంగ్ కాంగ్ సౌభాగ్యము అందుకొంటున్నా, అక్కడి చైనీయులు, "తాత్కాలికావసరానికితప్ప ఇక్కడ శాశ్వతంగా బ్రిటిష్‌వారు ఉండబోరు"అని తప్ప వేరుగా భావించలేకపోయారు.

కేవలం లాభనష్టాల బేరీజుమీదే దృష్టి కల్గిన హాంకాంగ్ చైనీయవర్తకుల కిది అంత సమస్య కాకపోవచ్చును. అక్కడి చైనీయ కార్మికులకు, జీవనవ్యయప్రమాణాలు హెచ్చిపోయి, తల దాచుకొనేందుకు పిచ్చికగూళ్లులాంటి గూళ్లు తప్ప దొరకకుండా ఉన్నాయి. తగినంత కూలి ఎల్లా సంపాదిస్తామా, ఎల్లా తల దాచుకొంటామా అనేవే వారికి సమస్యలుగా ఎక్కువగా బాధిస్తున్నాయి.


కాని - విద్యాధికులైన కొద్దిమందీ - చైనీయులూ, విద్యార్థులూ, ఉద్యోగులూ మొదలైనవాళ్లం తా - రాజకీయ చైతన్యం ఉన్నవాళ్లందరికీ హాంగ్ కాంగ్ ప్రభుత్వంలో ఉన్నతోద్యోగాలు "యూరపియన్లకు" తప్ప చైనీయులకు లేకపోవటం కష్టంగానే ఉంది. హాంగ్ కాంగ్ ప్రభుత్వము సమర్థనీయమే ఐనా, మేడిపండు మేలిమిగా తప్ప, ప్రజాప్రాతినిధ్యము లేకపోవడాన్ని నిరసిస్తూనే ఉన్నారు. ఈనాడు చేస్తున్న స్వల్పసంస్కారాలేవీ కూడా, ఈ అసంతృప్తిని ప్రాథమికంగా తీర్చలేవు. వలస రాజ్యాలకార్యదర్శి, అర్థర్ క్రీచ్ జోన్స్, తము ప్రవేశపెట్టనున్న సంస్కారాల విషయంలో ఉత్సాహం చూపకపోవటం కేవలం "హాంగ్ కాంగ్ జడత్వం" అని వ్యాఖ్యానించాడు. హాంకాంగ్ బ్రిటిష్ యాజమాన్యంలోని పత్రిక టెలిగ్రాఫ్, "ఈ వ్యాఖ్య చాలా కుఅతనంగా ఉంది తప్ప ఇంకేమీ కాదు" అని విమర్శించింది. బ్రిటిష్ యాజమాన్యాన్నే నడుస్తూన్న దక్షిణచైనాలోని "మార్నింగ్ పోస్టు" పత్రిక-"హాంకాంగ్ మనస్తత్వము, ఒక శతాబ్దపు నైరాశ్యంలోనూ, స్వప్రాతినిధ్యవాంఛ ఎప్పటికప్పుడు నిరాకరించబడ్డ వైఫల్యంలోనూ జన్మించిన మనస్తత్వము" అని విపులీకరించింది.

ఈ వాతావరణంలో, కమ్యూనిస్టులు షాంఘై ప్రవేశించిన నాడు ప్రభుత్వముపెట్టిన సొసైటీ ఆర్డినెన్సు - ప్రజలను రెచ్చగొట్టటంమాట అటు ఉంచినా, ఇంగిత జ్ఞానహీనంగా ఉందని కొందరనుకొంటున్నారు. ఈ ఆర్డినెన్సు క్రింద— "విదేశసంబంధికమైన"-అంటే చైనీయసంబంధమైన రాజకీయపక్షాల నన్నిటినీ ప్రభుత్వం నిషేధించింది.

అప్పుడే "కూమింగ్‌టాంగ్", మరికొన్ని "మాధ్యమిక"పక్షాలూ, కార్యాలయాలు మూసివేసుకొన్నాయి. కమ్యూనిస్టులకు బాహాటంగా, కార్యాలయం, కమ్యూనిస్టుపక్షమూ అంటూ లేవు. చిత్రమేమిటంటే, కమ్యూనిస్టులవల్ల అల్లరి వస్తుందని పోలీసులు భయపడటమేలేదు. అంతకన్నా ఏదో పక్షాన్ని దొరకపుచ్చుకొని, కమ్యూనిస్టులతో మంచిమాట చేసుకొని యుద్ధానికి రెచ్చగొట్టబోయే తదితర నాయకులంటేనే పోలీసులు ఎక్కువ జాగ్రత్త వహిస్తున్నారు.

హాంగ్ కాంగ్ చైనీయులలో, రాజకీయ చైతన్యం కలవారంతా, ఈ ఆర్డినెన్సు తమ రాజకీయ హక్కులపై ఆంక్షగానే భావిస్తున్నారు. ముఖ్యంగా ఈ ఆర్డినెన్సు ఆధా

(21-వ పేజీ చూడుడు)



శ్రీ మహాబలిపుర యాత్రావిశేషాలు

శ్రీ పొన్నాడ శ్రీనివాసరావు

వేం 1 వ తేదీ యుదయము 8 గం॥ మదరాసు ప్రభుత్వ స్పెషల్ బసస్‌పై, ఒక యాత్రా బృందము తిరువల్‌కుంద్రం మీదుగా బయలుదేరాము. వివిధభాషలవారు మాతో ప్రయాణం సాగించారు. చెంగల్పట్ మీదుగా తిరుకల్ కుంద్రము 9-30 గం॥ వెళ్లి పక్షితీర్థము చూచి 12-30 గం॥ మహాబలిపురము చేరాము. ఇది తొల్లి 'మాయల్లాపురం' అని వాడుకలో యుండేది. సరియైన పేరు 'మహామల్లపురము' 'మల్లాపురి', లేక 'మహాబలిపురం' అని వాడుక నామములు కలవు. ఐరోపా దేశస్థులు '*Seven Pagodas*' అని పిలిచెడువారు. రెండు శతాబ్దములకు పూర్వము ఈ రేవుగుండా రోము, గ్రీసు మొ॥ మధ్యధరాదేశ ఓడరేవులతో వ్యాపారము చేసినట్లు చరిత్ర తెలుపుచున్నది. ఈ ప్రదేశమున రోమక్, చీనా నాణెములు దొరికినవి. దీనిని బట్టి శిథిలమైన పురాతన రేవుపట్టణమని తెలియుచున్నది.

దాక్షిణాత్యులు దీనికి బలిచక్రవర్తిపేరిడి, మహాపుణ్యక్షేత్రముగా ప్రచారము చేసి, ద్రవ్యార్జన మొనర్ప సమకట్టిరి. కాని, చరిత్రాధారము లేదు. ఇచ్చటి స్థలపురాణమున 'మల్లాపురి' అని వాడబడుచున్నది. ఈ ప్రాంతము తొల్లిట, పల్లవులు కంచి రాజధానిగా చేసుకొని ఏలిన 'నరుత్తమ భూపతి', 'యమర భూపతి' చే నోడింపబడెనట. అమరుడు మల్లులనువారి నాయకుడట; గాన నాతని రాజమల్లుడనియు, మహామల్లుడనియు వాడుచుండిరట. ఈ పురమునకు మహామల్లపురమని వాడుకయు కల్గెను. ఈ విషయము చెంగల్పట్ మాన్యూల్‌నందు కానవగును. ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ యిండియా 1906-7 రిపోర్టు 217 - 43 పేజీయందు ఈ సంగతి స్పష్టముగా నున్నది.

ఇచ్చటి శిల్పనైపుణ్యము పల్లవ రాజుల నాటిదని చాటుచున్నది. సముద్రపుటొడ్డున *Sveen Pagodas* యుండెడివని, ఈ దేవళపు గోపురములు బంగారురేకు తాపడము కలిగియుండెననియు, సూర్యకాంతిచే తళతళ మెఱయుచు, నావికులకు మార్గదర్శిగా యుండెడి దట. కాలక్రమమున ఆరు గోపురములు సముద్రమున కలిసిపోయినవి. సముద్రపుటొడ్డున బలమైన గోడకట్టి సముద్రపు నీరు రాకుండా చేసి ఆ దేవళమును కాపాడుచున్నారు. ఇందు ఒక స్వామి నిద్రావస్థలో చీకటి అంధకారములో శయనించినట్లు విగ్రహము కలదు. ఆ విగ్రహము చమురుగ్రక్కుచున్నట్లు యుండి శిల్పనైపుణ్యమును చాటుచుండును. ఆ గోపురము పల్లవుల శిల్పనైపుణ్యము చాటును.

దక్షిణపువైపున పాండవుల పంచరథములున్నవి. వీటిని పరిశీలించిచూడ పల్లవులను జయించి రాజ్య మేలిన చాళుక్యులనాటి శిల్పమని తేలుచున్నది. పెద్దది ధర్మరాజు రథము మూడుఅంతస్థుల రథము. రెండంతస్థు లెక్కుటకు వీలుగా మెట్లు కలవు. మిగత వాటికి అంతస్థులున్నవి కాని, ఎక్కుటకు వీలులేదు. దీనికి పడమటగా ఏకరాతినంది కలదు. ప్రాంగణమున ఉగ్రసింహము కలదు. అవతలతట్టున, ఏకరాతి యేనుగ కలదు. ఇవిఅన్నియు ఏకరాతిని దొలిచి చెక్కబడినట్లు కనబడుచున్నవి.

1. ధర్మరాజు రథము—27′ × 25′ × 34′ పశ్చిమాభిముఖమై యున్నది.

2. భీమరథము—42′ × 25′ × 25′ ముందువైపున వరండా కలదు, పశ్చిమాభిముఖమై ఏకరాతినుండి దొలువబడినది. ఇందు స్తంభముల బలము చాలక కాబోలు నడుమను పగిలియున్నది.

3. అర్జున రథము—11′ × 16′ × 20′ మూడంతస్థులపైన డాబావంటి కప్పు కలదు.

4, 5. నకుల సహదేవుల రథము—ఈ రెండు ఒకే రీతితో దొలువబడియున్నది. కొంచము వంకర తిరిగియున్నది.

ద్రౌపది రథము—ఉత్తరవైపున యున్నది. పర్ణశాలపోలిక నున్నది. ఏకశిలశిల్పము.

పడమటి ప్రక్కన లైట్‌హౌసు కలదు. ఇది ఫ్రెంచివారు కొండలపై ట్టిరట. ఇంగ్లీషువారు మదరాసులో లైటుహౌసు నిర్మించుకొన్నప్పుడు వీరు యిక్కడ కట్టుకొనిరట. ఆ లైటుహౌసుకు దీనికి చాల వ్యత్యాస మున్నది. దీని చెంతనే రాయలగోపురము కలదు. దీని పని పూర్తి కాలేదు. దీనిపైకెక్క వచ్చును.

ఆ కొండలను దొలచి అనేకగుహాలు నిర్మించబడియున్నవి. బౌద్ధభిక్షువుల నివాసముకొఱకు నిర్మించబడినవని చరిత్ర చెప్పుచున్నది. కాని యిందుగల శిల్పమును పరిశీలించగా బౌద్ధుల నివాసయోగ్యమునకు తగనట్లు గ్రహించ కలము. శిల్పనైపుణ్యము పెద్దజల్లు సింహద్వారము గనేకము లాకొండపై నున్నవి. ఏకారణము చేతనో ఆ కట్టడములు పూర్తి కానట్లు తోచుచున్నది.

శ్రీ వరాహస్వామి దేవళము:— దైవము దేవళమధ్య మండపమున లేదు. ఎడమవైపు మండపమున శిల్పనైపుణ్యము చాటి కడురమ్యముగానున్నది. కుడివైపున పార్వతి ప్రతిమ గోడకు చెక్కబడియున్నది. ఈ రెండిటి మధ్య మండపము దొలచబడియున్నది. కాని అచ్చోట ప్రస్తుత మేమియు లేదు. అచ్చోట ఏ శివుడో యుండియుండును. పై చెప్పిన శ్రీ వరాహస్వామి,పార్వతి, ఆ రాతపైనే చెక్కియుండుటచే అవిపోవుటకు వీలు లేకపోయెను. ప్రధాన విగ్రహములు వేరురాతిచే చెక్కబడుటచే యవి యదృశ్యమైనవి. ఇట్టి విధముగనే ప్రధాన విగ్రహములు ఆ దేవళములలో లేకపోవుటకు కారణమై యుండవచ్చును.

యముపురి:—ఇచ్చటకూడా ప్రధాన దైవము లేదు. ఒక గోడకు చెక్కబడిన మహిషాసురవధ చిత్తరువు కలదు. శిల్పము వేనోళ్ల ప్రశంసనీయము.


విఘ్నేశ్వరుని గుడి:— ఈగుడిలో మాత్రము విఘ్నేశ్వరుడు కలడు. ఇచ్చట దీపనైవేద్యములు జరుగుచున్నట్లు కానవగును. వరాహ, వామన విగ్రహములు భూమిని త్రవ్వి తీయబడినవట. కొన్ని దేవళములలో దైవమును గుర్తుపట్టుటకు వీలు లేని స్థితియందు కలవు.


పంచపాండవ మండపము, రామానుజ మండపము, ద్రౌపది స్నానఘట్టము యూహించవలెనే కాని గుర్తుపట్ట వీలులేకున్నది. కొండక్రింద అర్జున తపస్సు, కొండగోడలపై చెక్కబడియున్నది. దానిప్రక్కనే ఒక కోతి పెంటికి పేలు కుక్కుతున్నట్లు కడుహాస్యముగా చెక్కబడియున్నది. ధర్మరాజు దర్బారు కొండగోడపై చెక్కబడినది. అందు మంత్రులు, సామంతులు, చతురంగబలము సైన్యాధిపతులు, వందిమాగధులను కడుచక్కగా చిత్రించబడియున్నవి.

కృష్ణగోవర్ధనగిరి చిత్రము ఒక కొండగుహలో చెక్కబడియున్నది. గోవులు, గోపికలు గ్రామవాసులు ఈ చిత్రములో సుందరముగా చిత్రింపబడియున్నవి. ఆ గుహలో మరో రెండు మండపము లున్నవి. అందు యిదివరలో ఏ విగ్రహము లున్నవో తెలియవు కాని నేడు గబ్బిలములు కానవగును. ఇదే యాత్రికులకు సత్రమువలె నుపయోగపడుచున్నది.

శ్రీకృష్ణుని వెన్నముద్ద:—ఒక పెద్దకొండ అంచున ఒక తెల్లని పెద్దరాతిగోళ మున్నది. దీని గరిమనాభి యంచున పడుచున్నది. అది ఏమాత్రమయిన కదిలిన కొండమీదనుండి క్రిందికి దొర్లిపోవును. ఇంకను అనేక చిన్న చిన్న శిల్పములు కానవగును. ముఖ్యమగు శిల్పములకు ప్రభుత్వమువారు పేర్లు వ్రాసియున్నారు. అచ్చట గవర్నమెంటువారిచే ఏర్పాటుచేయబడిన గైడరు కలడు. అతడు మనకు అన్నియు చూపును.

కొబ్బరిచెట్లు, ములగచెట్లు, సర్వీ మొ॥ చెట్లు విస్తారముగా నున్నవి. ఊరుమధ్యన, ఒక కోనేరు కలదు. దీని చెంతన, ఒక నూతనాలయముకలదు. అందు నిత్యారాధన జరుగుచుండును. పెండారీలు అను ఎనిమిది విగ్రహములు కానవగును. శిథిలశిల్పచరిత్రాత్మక ప్రదేశమగుటచే వివిధప్రాంతములనుండి యనేకమంది యాత్రికులు వచ్చుచుందురు. మదరాసుప్రభుత్వమువారు *Bus Transport* ను స్వాధీనము చేసుకొన్న తరువాత యిటువంటి చరిత్రాత్మకమైన స్థలమునకు చక్కని సదుపాయములతో ప్రయాణసౌకర్యములు చేకూర్చినందులకు వారి కృషి నభినందించక తప్పదు. మదరాసుకు 35 మైళ్లలో కలదు. రాత్రి 8 గం॥ తిరిగి మదరాసు చేరుకొంటిమి.





కథానిక:



శ్రీ గొల్లమూడి లక్ష్మీనారాయణ

మెరుపులతో నయానా, ఉరుములతో భయానా చెప్పింది; బ్రహ్మాండం బ్రద్దలయ్యేట్లు గర్జించింది ఆకాశం. ఊహూఁ. నిరాశ చేసుకుని వలవలా విలపించింది.

విద్యుద్దీపాలు ఆరిపోయినవి. వాన వెలిసింది. 'కావ్ కావ్' మంటూ అంధకారంలో అగమ్యంగా చెట్లదమీదనుంచి చెదరిపోయినవి కాకులు. అంధకారం భయంకర రూపాల్లో తాండవ మాడుతున్నది.

సత్రంలో గుడ్డి వెలుగు. ముడుచుకుని వున్నారందరూ. అంత నిశ్శబ్దంగా లేదు. వంగిన నీడ ఒకటి కదిలి మాయమయిందే.

సత్రాన్ని వదిలి రోడ్డెక్కింది ఓ వ్యక్తి. మెల్లగా కర్ర నాధారంచేసుకుని జారిపోతూన్న రోడ్డుమీద అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నది.

దీపాలు వచ్చినవి. చీకటు చెట్లు మెరసినవి. నడక మరికొంత శీఘ్రగతిని సాగించిం దా స్త్రీ వ్యక్తి.

ఆమె తలమీద చీరెచెరగు కప్పుకున్నది. ముఖం ముడతలు పడ్డది. నొసట బొట్టు లేదు. ఆ ముడతలు పడ్డ ఆ రెప్పల మధ్య కనుపాపల్లో జ్యోతు లున్నవి. ఆ జ్యోతులలో వీడని ఆశ ద్యోతక మాతున్నది.

అట్లాగే బరువుగా నడుస్తున్నది.

రోడ్డుమీద ఎగుడు దిగుడులు, బురద రంగులు..................

...తను కలలోనైనా అనుకోలేదు ఇట్లా జరుగుతుందని. ఎవ్వరు ఊహించనూ లేదు. తను ఆశించింది, ఊహించింది, నిర్మించుకున్న గగన సౌధాలు!...అంత అదృష్టానికి తను నోచుకో లేదు.

తెలివి తేటలకు లోటు లేదు. చురుకైన బుద్ధి. తనకి నచ్చినవాణ్ణి కట్టుకుని సుఖంగా ఉంటుందని, దాని కడుపున కాయ ఒకటి కాస్తే, చూసి ఊపిరి విడుద్దామని తను ఎంతగా కలలు కన్నది! ఎట్లా గాలిమేడలు కట్టింది!

అంతా బూడి దయిపోంది. తను కుప్పలా కూలిపోవలసిన దుర్గతి కల్పించింది. తన కోరికలు నెరవేరుస్తుం దనేగా అంత గారాబంగా పెంచింది? తండ్రి లేని పిల్ల; తల్లైనా, తండ్రైనా తనేగదా అని కాలు నేలమీద పెట్టనీయకుండా రాజకుమార్తెను పెంచినట్లు పెంచింది.

ఆయన బతుకుంటే ఇలా జరిగేదా? తన లాగా అదే దానికి నచ్చినవాణ్ణి పెళ్ళిచేసుకుంటుం దని చూస్తూ ఊరుకునేవారా? ఆయనే మంచి సంబంధ మొకటి చూసి మూడు ముళ్లూ వేయిస్తేనేకాని కన్ను మూసేవాడుకాదు.

ఐనా తన కెప్పుడూ అనుమానం కలగలేదు, ఇంత మార్పు వస్తుం దని; ఇట్లా ముంచుకొస్తుం దని, ఆనాడు రామయ్యగారి అబ్బాయితో సంబంధం ఉన్నట్లు తెలిసిననాడే అనుకోలేదు. తను మందలించి ఊరుకుంది. చిలక్కి చెప్పినట్లు చెప్పింది. చెప్పే పలుకులు అది అర్థం చేసుకుంటె ఇక లేని దేముంది? ఏది మంచో, ఏది చెడ్డో దానికి తెలియదు; ఇంకొకరు చెప్తే వినదు. "ఎదిగున్న పిల్ల. కుర్రతనం. తెలియక చేసి ఉంటుం"దని సరిపెట్టుకుని కూతురు బాగుపడ్తుం దని ఆశించింది.

ఎంతటి కష్టాన్నయినా ఇట్టే తోసేసేది—'అబ్బే! నాకు నచ్చలే'దంటూ. ఆయన సంపాదించిన నాల్గు రాళ్ళూ దీనికే పెట్టి సలక్షణమైన సంబంధం తెద్దామని ఎంత చక్కటి కుర్రాళ్లను, ఎంత ఆస్తిపరులను తెచ్చింది! ఎందుకు పుట్టుంది మంచి బుద్ధి—ఆరాత మొగాన రాసి వుంటే?

అసలు పుటకతోనే పుట్టిం దా బుద్ధి. పల్లెటూళ్ళో వుంటూ బస్తీషోకులన్నీ కావాలనేది. తనూ చేసేది. ఒక్కగా నొక్క కూతురు. దాని ముద్దూ మురిపెం చూట్టానికేగా తను బతికుంది? కాని అది అట్లా పెడదోవన పడ్తుం దని ఏ దేవుడు వచ్చి సూచించినా, ఆయన పోయిననాడే, తనూ ఆయనవెంటే పోయేది.

తను ఎన్నో చెప్పింది. ఊహూఁ. చెవిటి దానికి శంకు వే? చివరికి అట్లా సూరిగాడితో అకస్మాత్తుగా పట్టణానికి లేచి వచ్చిందాకా, ఇంతగా కొంప ముంచుకొస్తుం దని ఊహించ లేదు.

దానికి నయానా చెప్పింది: 'అమ్మాయి, ఇది మంచిపని కాదు. మన వంశంలో ఎన్నడూ లేనివి, కళంకం తీసుకురాబోకు. నీ మంచి కోరి చెపుతున్నా. నీ అందచందాలన్నీ అడ్డమైన లోకులకోసం ఇట్లా నలిగి బూడిదై కావల్సిందేనా? అయిన దేదో అయింది. ఇప్పటికైనా బుద్ధి మాగ్చుకో. ఒక సంసారం, ఒక యిల్లు అంటూ ఏర్పరచుకో. నీమీద కొండంత ఆశలు పెట్టుకున్నాను. కొడుకైనా, కూతురైనా నీవే అని తృప్తిపడుతున్నా.' ఏమీ కూరలేదు కూతురు.

భయానా చెప్పింది. 'ఒసేయ్! నీవు చేస్తున్న పనికి పురుగులు పడి చస్తావ్. ఈ విధంగానె వుంటే నీకూ నాకూ 'రాం రాం'! ఒక్క రాగి దమ్మిడన్నా నా దగ్గర్నుంచి నీకు రాదు. నీకు ఒక తండ్రి అంటూ లేని సంతానం కలిగి, ఉన్న దంతా నాశన మయ్యాక, నా కాళ్లదగ్గర పడితే నిన్నాదరించేది లేదమ్మ!'

కూతురి హృదయం బెదరలేదు చెదరలేదు.

'నా సంగతి నీ కెందుకు? నా విషయంలో జోక్యం కల్గించుకోటానికి నీ వెవరసలు? మహా శ్రీరంగనీతులు చెప్పొచ్చావు. వెళ్ళిపో...' అనరాని మాటలు అన్నది కూతురు. చెవులు చిల్లులు పడ్డైనె. తను అప్పుడు బెదిరింది. వలవలా ఏడ్చింది. చివరికి, కూతురికాళ్లు పట్టుకుని 'నా మాట చెల్లించవూ?' అని కొండలు కరిగేటంత జాలిగా మొత్తుకుంది.

అహఁ. అది కరగలేదు. ఎట్లా జాలి తెలుస్తుంది. పాషాణం. చెడిపెతో తనకి సంబంధం ఏమిటి? తల్లి కా దంటూ పురుగును విదిలించినట్లు విదిలిస్తుంటే తను ఎంతగా ప్రాధేయపడుతుంది?

'అమ్మాయి! ఇదే చెపుతున్నా! నీవు పంకిల కూపంలో పడిపోయావు. నిన్ను బయటికి తీయటానికి భగవంతుడే రావాలి. రేపు కుక్కలా నా యింటిముందు దొర్లుతుంటే నిన్ను రక్షించేది లేదు. ఆ తర్వాత నీవే గ్రహిస్తావు.' అని చెప్పి గిరుక్కున తిరిగి వచ్చేసింది.

శాంతసముద్రంలా గడుపుకుంటూ వచ్చింది ఇన్నాళ్ళూ. కాని తన జీవితంలోనే తన కిష్టం లేని సంఘటనలు జరగవలసిన జాతకం తనది. ఈ లోకంలో తన పని పూర్తయినట్లే. రోజుల్లోనే పడిపోయింది జీవితం. కొంతకాలం కళ్ళు మూసుకుంటే 'మహాసాధ్వి స్వర్గానికి వెళ్ళింది' అనిపించుకుంటుంది. కాని ఒక్కటే దిగులు. ...తను ఎంత పాపం చేసి వుండకపోతే అటువంటి ఛండాలురాలు తన కడుపున పుట్టుంది. ఎంత చెడినా కన్నకూతురు. కన్నప్రేమను కా దనటం కష్టం. నవమాసాలు రక్త మాంసాలతో పెంచి అష్టకష్టాలు పడి కూతురికి ప్రాణం పోసింది. కొండంత ఆశ పెట్టుకుని కూతుర్ని పుష్పాల్లో పెంచింది. ఆకాశాని కెత్తింది. కూతురు భూమిన పడి చితికింది...తనకి వ్యథ తెచ్చుకుంది.

ఇదే ఆయనయితే......? ఛా, సిగ్గులేదు; కుక్కబుద్ధి......

సూదుల్లా వానజల్లు. ఆమె మనసు జలనిధి నదీసంగమంలా వుంది.

బలవంతాన అడుగుతీసి అడుగు వేస్తున్నది. ఆమెకు గుండెదడ ఎక్కువ కాసాగింది. చలిగాలికి వెక్కిరిస్తున్నట్లు నవ్వుతున్నవి చెట్లు. ప్రకృతి అంతా హేళనచేస్తున్న ట్లనిపిస్తున్నది.

సందులు గొందులు తిరిగింది.

దీపాలతో వెలుగొందుతున్న సందు. ఆమె నడక ఆపింది. ఒక యింటిని తదేకదీక్షతో చూస్తూ నిల్చుండిపోయింది. మళ్లా అటూ యిటూ పచార్లు చేసింది.

కన్న ప్రేమ ఉప్పెనలా వచ్చింది. చివరికి ఆ యింటితలుపు కొట్టింది.

"ఎవరది?" లోపలినుంచి విసుగున సూచిస్తూ కేక.

మళ్లా తలుపు చప్పుడుచేసింది.

"ఎవరంటుంటే...?" కోపంగా. కాసేపటికి విసురుగా తలుపు తెరచుకుంది.

లోపల వెలుతురు — బయట చీకటి.

లోపలి వ్యక్తి స్త్రీ. నిమిష కాలం నిశ్శబ్దం.

'ఇప్పుడు వీల్లే దండీ!' తల వంచుకుని ప్రాధేయపూర్వకంగా అన్నది లోనున్న స్త్రీ. బయటనున్న వ్యక్తి మారుమాటాడలేదు. లోపలికి అడుగేయ లేదు. లోనున్న స్త్రీ ఆశ్చర్యపోయింది. క్షణంలో భయపడ్డట్లుగా చలించింది. చేతులు తలుపు రెక్కలు పట్టుకున్నవి.

బయటనున్న ఆమె లోపలికిఅడుగేసింది. మరు క్షణంలో ఆమె ముఖం కాంతి పుంజంలో మునిగింది.

లోనున్న స్త్రీ మళ్లా ఆశ్చర్యపోయింది. పకపకా నవ్వింది. క్షణంలో స్థిరంగా నిల్చింది. చురచురా చూసింది. తూష్ణీంకారం చేసింది.

ఆమె వింత చెందింది. 'చంద్రా!' అని పలకరించ బోయింది, ఎంతమంది పాపులు ఉచ్చరించిన పేరో అని సంశయించి, 'అమ్మాయి, ఎవర్నో గుర్తుపట్టావా?' ప్రేమగా పల్కరించింది.

"గుర్తుపట్టకేం మహాతల్లి, ఏం రోగమొచ్చింది కనకా?" క్షణ మాగి "మళ్లా దాపురించా వెందుకే రాకాసీ!" చంద్ర పలికింది. ఒక్కొక్క ప్రాణం పాశంవేసి లాగినట్లుగా వుంది ఆమెకు.

"అమ్మాయి! నీ విలా తిట్టిపోస్తా వని తెలిసే వచ్చాను. నా నెత్తిమీది బాధ్యత నన్నిక్కడికి తెచ్చింది. నే చెప్పాల్సిన నాల్గు ముక్కలూ చెప్పిపోదా మని వచ్చాను. బాగుపడే గీత వుంటే బుర్ర కెక్కుతాయి. లేదూ; నీ పాపాన నీవు పోతావు..."

"ప్రారంభించావూ ఉపన్యాసం? వాగినది వాగినట్లుగానే ఉండాలి కదా! ఓ పెద్దిమ్మా, ఇక్క డెవరూ లేరు, నీ పురాణం వినటానికి. విని విని చెవులు దిబ్బళ్లు వేసినై."

"అమ్మాయి! అనవసరంగా ఉద్రేకం తెచ్చుకోకు. నే చెప్పే నాలుగు మాటలు విను. మంచికో, చెడుకో తల్లిని చెప్తున్నా. చెప్పక తప్పదు."

"నా బతుకు రేపో మాపో అన్నట్లుగా వుంది. మంచాన బడ్డది ఈ జీవితం. నీవు ఎంత కాదన్నా, ఎంత చెడ్డా, నీవు నాకు కూతురవి కాకపోవు. చావబోయే ముందు, కన్నతల్లి,, నా బాధ్యత నేను నెరవేర్చుకోవాలి. నే చెప్పే మాటలు నీ కిప్పుడు చెవి కెక్కవు. ఎట్లా ఎక్కుతాయి? పంది బురదగుంటలో పడుకుని అదే స్వర్గం, అదే పన్నీరు అనుకుంటుందట. చనిపోయేప్పుడు, నీ అదృష్టం బాగుంటే అంతా చివికాక అయినా తెలిసివస్తుంది.. ..." ఆమె చెపుతున్నది చంద్ర కోరచూపులు చూస్తూ, తల ఊపుతూ వింటున్నది.

"అమ్మాయి, మీ నాన్నగారి గౌరవం నిలబెట్టు. ఎటు చూచినా, ఇలాంటి ఛండాలప్పని ఎవరూ చేయలేదు. నా ఆశలన్నీ నీమీద పెట్టుకున్నా..." ఆమె చలించుతున్నది. చలిగాలికి వణుకుతున్నది. నిస్సత్తువవల్ల కూలబడిపోయింది. చంద్ర నిల్చుని వింటున్నది. లోపల గదిలో నుంచి "ఏమిటా గొడవ, చంద్రా!" అని కఠోర స్వరం.

"కూతురైనా, కొడుకైనా నీవే. నీవు బాగు పడితే అదే నాకు పదివేలు. ఇప్పుడైనా మించిపోయింది లేదు. మన ఊరు కాకపోతే మరో ఊరు. ఒక సంసారం, ఒక యిల్లూ అంటూ ఏర్పరచుకో. ఈ ముసలిముండ గొంతులో కాసిని నీళ్ళు పోయి."


"చాల్చాలు. చాలాసేపు చెప్పావ్. ఇంతకీ పొట్టకూటికోసం ఇన్ని ఏడుపులు ఇన్నాళ్లూ ఎక్కడికి పోయిం దేమిటీ కన్నకూతురు? ఒక మొగుడంటూ ఉండా లంట; ఒక సంసారంట. పిల్లట జల్లట. ఈ నాటకాలు బూటకాలు నా దగ్గర చెల్లవే! మహా చెప్పొచ్చావు శ్రీరంగనీతులు. సాగినన్నాళ్లూ సాగించుకున్నావు; సాగిపోయింది. ఇప్పు డేమో ముసలితొక్క వయినావు. శ్రీరంగనీతులు చెప్ప కేం చేస్తావు? నా కాళ్లమీద పడ కేం చేస్తావు? ఊఁ. పో! నీకూ నాకూ కుదరదు. కన్నతల్లిట...కడుపుకోసం కోటి నీతులు...రోజా గొడవ తక్కువయిందనా?"

"అమ్మాయి!" ప్రపంచాన్ని సుడులు త్రిప్పే ఆ సంబోధన, పచ్చి గాయంమీద నవనీతం లాంటి ఆ సంబోధన చంద్రకి విషప్రాయ మైనది.

"నీవు చాలా పొరబడ్డావు, అమ్మాయి! నీ డబ్బుకోసం, నీ మెతుకులకోసం, నీ చేతి అక్షితల కోసం, నీయింట్లో పడివుంటానని చెప్పటం లేదు. నీ పాపిష్ఠి డబ్బు చిల్లి దమ్మిడీ నాకక్కరలేదు. బాగుపడి నా దగ్గరకే రమ్మని నే నంటున్నా. నీ బాగుకోసం ఇన్ని అవస్థలు పడుతున్నాను. అంతే కాని, ఇట్లాగ నీ చేతితో పచ్చి గంగ పుచ్చుకోను. నీ యింటిలో ఒక్క రోజూ నిలదొక్కుకోను..."


"ఛా ముండా! తొందరగా పో! ఒక్క క్షణం వున్నావంటే ఊరుకోను. ఊఁ వెళ్లు..."

(17-వ పేజీ చూడుడు)




చెశ్మాశాహె దృశ్యం

కాశ్మీర్ సౌందర్య దృశ్యాలు





లిడ్డర్ లోయలో ఒక దృశ్యము




కాశ్మీర్ వడ్రంగులు పనితనము నకు ప్రసిద్ధికెక్కిరి. కొయ్య మీద చేసిన ఈ నగిషీ పని అందుకు నిదర్శనము

ఆరోగ్యప్రదేశంగా ప్రసిద్ధిచెందిన సోనామార్గ్







★




దుండగీండ్ర దాడికి గురిఅయిన సరిహద్దు గ్రామాలలో జీవితం ఇప్పుడిప్పుడే తిరిగి స్వస్థ పడుతోంది



అఫర్‌వత్ పర్వతాన్ని ఆనుకొనియున్న గుల్‌మార్గ







"మాకు ఒక ఏనుగు కావాలి!"

"మాకు ఒక ఏనుగును పంపవలసింది." అంటూ జపాన్ పిల్లలు భారతప్రధాని నెహ్రూకు అనేక సందేశాలు పంపారు. యుద్ధకాలంలో జపాన్ జంతుశాలలోని ఏనుగు చచ్చిపోయింది. అప్పటినుంచీ ఏనుగును చూడాలని ఆ పిల్లలు ముచ్చటపడి భారత దేశం ఏనుగులకు పుట్టిల్లని ప్రధాని నెహ్రూను తమ కొక ఏనుగు పంపవలసిందనీ ఉత్తరాలు వ్రాశారు. హిమాంశునియోగి అనే ఆయన జపాన్ వెళ్ళినప్పుడు ఆయన్ను చుట్టుముట్టి పిల్లలంతా తమతమ ఉత్తరాలు నెహ్రూకు అందచేయమని ఆయన్ను బతిమాలారు. జపాను పిల్లలల్లా ఆయన్ని చుట్టుముట్టడం, జపాన్ పిల్లల ఉత్తరాల నమూనా, ఈ చిత్రాలలో కనవస్తున్నాయి.



రాజకుమారుడు - సేవకులు

మూలం : గ్రిమ్సు 'ఫెయిర్రీ టేల్సు'

అనువాదం : 'ఆనందనిలయం'

అనగనగా ఒక వూరు. ఆ వూరుకు రాజు లేడు కాని, రాణి ఉండేది. ఆ రాణికి మాంచి అందమైన కూతురు ఉంది.

ఆ అమ్మాయిఅందాన్ని చూచి ఎందరో రాజులొచ్చేవాళ్ళు ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకోడానికి. కాని రాణి వాళ్ళను చూచి "నేను కొన్ని పనులు చెప్తా. ఆ పను లెవరు చేస్తారో వారికి నా అమ్మాయి నిచ్చి పెళ్ళి చేస్తా. ఒకవేళ మీరా పనిని చేయకపోతే మీ ప్రాణాలు తీసేస్తా" అని చెప్పేది.

వచ్చినవాళ్ళంతా సరేనని ఒప్పుకొనేవాళ్ళు. ఆమె చేయమన్న పన్లు చేయటానికి ఒప్పుకున్నారే కాని వారికి ఒక్కపనీ చేయటానికి సాధ్యం కాలేదు. వారందరి ప్రాణాలూ తీసేయించేసేది. ఇలా ఎందరో రాజులు ప్రాణాలు కోల్పోయారు.

ఇంకో వూళ్లో చాల పేద రాజుండేవాడు. అతనికి ఒక్కడే కొడుకు. ఆతడి పేరు కేరళుడు. రాణీకూతురి అందాన్ని విని కేరళుడు తండ్రితో ఒక రోజు "నాయనా! నా కా రాజకుమారిని పెళ్లి చేసుకోవాలనుంది."అని చెప్పాడు.

"అ దెప్పటికీ సాధ్యం కాదు. నీవు పోయావంటే ఆ రాణి దగ్గిర నీ ప్రాణాలు పోగొట్టుకోవాల్సిందే. ఇప్పటికే చాలా మంది ప్రాణాలు ధారపోసుకున్నారు." అని చెప్పేడు.

ఈ మాటలు వినేటప్పటికి కేరళుడు చాలా నిరాశ చెందేడు. ఆ దిగుల్తో మంచం పట్టేడు.

తన కొడుకు చచ్చిపోతాడేమో యని భయపడి కేరళునితో "అబ్బాయీ! నీ వెందుకు మంచమెక్కావో నాకు తెలుసు. ఆ రాణి దగ్గరకు వెళ్ళు. నీకు ఆ అమ్మాయి దొరుకుతుంది." అని అన్నాడు.

ఇవి తన చెవికి సోకేటప్పటికి కేరళుడుకి ఎక్కడలేని సంతోషం వచ్చింది. ఆ దెబ్బతో రోగం కుదిరిపోయింది మూడు దినాలకంతా. నాల్గో నాడు తోడుగా సేవకు లెవ్వరూ లేకపోయేటప్పటికి నాయన్తో "సేవకుల్ని పోయే దోవలో చూసు కుంటా"నని చెప్పి బయల్దేరాడు రాజకుమారి యుండే నగరానికి.

కేరళుడు తన తోవలో తాను పోతూంటే ఒక పిల్లకొండను చూచేడు. దాన్ని చూచి "ఇదేమిటీ! నే నెప్పుడూ ఇక్కడ కొండ ఉండేటట్లు చూడలేదే? ఇదొకవేళ కొత్తగా పుట్టియుండవచ్చు" అని అనుకొంటూ దాని దగ్గరకు పోయాడు. అలా పోయి చూస్తుడు గదా! ఆ కొండ ఓ మనిషిగా మారింది. వాడు నిద్రపోతున్నాడు. కేరళుడు అతగాడిదగ్గర కెళ్ళి "నీ వెందుకు నిద్రపోతున్నా"వని అడిగేడు.

"నేను పొద్దున్న అన్నం తిన్నా. పని లేకపోయేటప్పటికి నిద్రపోయా. ఇప్పుడు ఆకలైంది. మళ్ళా ఎర నెక్కడైనా సంపాయించుకుందామని లేచా"అని అన్నాడు ఆ వింత మనిషి.

"అయితే నీ పేరేమిటి? పొద్దున్నే తిన్నావు?" అని అడిగేడు కేరళుడు.

"నన్ను వూరివారంతా భూతంగాం డంటారు. నే నివాళ పొద్దున్న మూడు ఆవులూ, నూరు రొట్టెలూ తిన్నా" అన్నాడా పెద్దమనిషి.

"నాకు సేవకుడుగా వస్తావా?" అని అడిగేడు కేరళుడు.


"నీవుగనా నాకు బాగా అన్నంపెత్తే. వస్తా"నన్నాడు భూతంగాడు.

'పెట్టా, రా' అని చెప్పి భూతంగాణ్ణి వెంటపెట్టు కెళ్ళేడు.


మళ్ళా కొంచెం దూరం పోయేటప్పటికి వారి కింకోమనిషి అగుపడ్డాడు. తల కిందుగా ఉంచి ఓ చెవిని భూమి కానించాడు. ఏదో శబ్ద మయ్యేటప

బొమ్మల కథ 6









పికి తలెత్తాడు. కేరళుడు వాడి కుండే పెద్ద చెవిని చూచేడు.

అతగాడిదగ్గరకు పోయి "నీ విక్కడేం చేస్తున్నావ్?" అని అడిగేడు కేరళుడు.

'నేనా? వింటూన్నా' అని చెప్పేడా మనిషి.

'ఇప్పుడు నీ వేం వింటూన్నావు?' అని అడిగేడు.

"చెల్లు పెరగగా గల్లే శబ్దం సముద్రం పై పక్షులు ఎగురుతూ చేసే శబ్దాన్ని వింటున్నా" అని చెప్పేడా మనిషి.

ఇప్పుడు రాజకుమారి ఇంట్లో ఏం జరుగుతూందో చెప్పు, చూద్దాం." అని అడిగేడు.

"ఒక బీద రాజకుమారుణ్ణి చంపం దానికి ఏడుస్తోంది నా ఇం ఆ రాజకుమారి" అని చెప్పేడు.

"నాకు సేవకుడుగా ఉంటావా?" అని అడిగేడు.

"మీకు సేవకుడిలాగ నుంటా" నని వారిద్దరితో బయల్దేరాడు.

దూరంగా కల్గే శబ్దాన్ని వింటాడు కాబట్టి అతనికి 'దూరపు వినికిడిగాడ'ని పేరు.

ఇంకా కొంచెం దూరం వెళ్ళేటప్పటికి రోడ్డు కిరుప్రక్కల పొడుగాటి రెండు వస్తువులు చూచేరు. వారు చెట్లమైనా పడిపోయాయని అనుకున్నారే గాని, దగ్గర కెళ్ళి చూస్తే ఆ పెద్ద వస్తువులు రెండూ ఓ మనిషి చేతులయ్యాయి. అలాంటి చేతు లెప్పుడూ వారు చూడలేదు. అలా పోయేటప్పటికి ఆ పొడుగాటి చేతులవాడి ముఖం దగ్గరకు వచ్చేరు.

కేరళుడు అతడిదగ్గర కొచ్చి "నీవు చాల పొడుగుమనిషిలా గున్నావే? నీ పే రేమిటి?" అని అడిగేడు.

నాకు అంతటి పొడుగు దేహం లేదుకాని నాకు ఇష్టం వచ్చినట్లు పెరిగే చేతు లున్నాయి. అందుచే నన్ను పొడుగాటి చేతులో డంటారు." అని అన్నాడు ఆ కొత్తమనిషి.

'నాతో రా' అని చెప్పి పొడుగాటి చేతులోణ్ణి కూడా పిలుచుకో పోయాడు కేరళుడు.

రెండడుగులు అవతల పెట్టారో లేదో చిన్న గుడ్డను ఓ కంటికి అడ్డంగా కట్టుకున్న మనిషి ఎదు రయ్యాడు. అతణ్ణి చూచి "నీ వెవరవు? కంటి కెందుకు

(16 వ పేజీ చూడుడు)

బాలగేయం :



గాజులవాడు

"మహేశ్వర్"

గాజులోయ్ గాజులోయ్
గణగణమని చిరుగంటల
గలగలమను ముంజేతుల
మ్రోయించే గాజులోయ్
రకరకాల గాజులోయ్
రమ్యమైన గాజులోయ్
బాలలకే అందమైన
బలేబలే గాజులోయ్!

ఒక మేడ. గుమ్మంలోంచి ప్లీడరుగారమ్మాయి సరోజ:

"ఏయ్ గాజులబ్బీ,... ఏయ్ గాజులబ్బీ, ఇలారా..." అని పిలుస్తుంది.

గాజులబ్బి:

ఎవరు వారు ఎవరు వారు?
నను పిలిచే దెవరు వారు?
కమ్మని ఒక పిలుపు పిలిచి
రమ్మనగా వస్తునాను, ఎవరు వారు?

సరోజ: ఇటే, ఇటు,... ఈమేడ, ఇలారా గాజులబ్బీ.

గాజులబ్బి:

నను పిలిచిన చిట్టితల్లి నువ్వేనా?
బంగరుపు పిచికలాగు చెంగుచెంగు
మని గెంతే చిన్నారి నువ్వేనా?
నీ చేతుల మెరిసేవి,
నిగనిగలాడే గాజులు
రంగురంగు గాజు లెన్నో
నాణ్యమైన గాజు లెన్నో
ఎంచుకొనవె చిట్టితల్లి
వన్నెచిన్నె గాజు లెన్నో.

[కావిడి దింపి గొంగళీ పరుస్తాడు గాజులబ్బి. సరోజ పెదకాళ్లు వేసుకుని కూర్చుంటుంది.]

సరోజ: "మరేం గాజులబ్బి, మరొచ్చి గంటే, మా అమ్మ ఇంట్లో లేదులే. నిన్న బళ్లో గాజులన్నీ బద్దలై పోయేయ్: 'అమ్మ చూస్తే కొడుతుంది. మరేం, రేపు డ్రాయింగుబుక్కు కొనాలని డబ్బులడిగి వుంచుతాను, ఎల్లుండి వస్తావా?"

గాజు: "అమ్మతోనూ, నాన్నతోనూ అబద్ధాలు చెప్పకూడదమ్మా! గాజులు వేసుకో. తరవాత మీ అమ్మ నడిగి నేనే డబ్బులు తీసుకుంటాను."

సరోజ: "అమ్మకి తెలుస్తే చావ మొత్తేస్తుంది. ఇంకో ఉపాయం చేస్తాను. అన్నయ్యకంపస్ బాక్సులో డబ్బు లుంటాయ్. చడీ చప్పుడూ కాకుండా తీసి తెస్తాను."

గాజులబ్బి: "పిచ్చితల్లీ! ఐతేమాత్రం, ఈ కొత్తగాజు లెలా వచ్చేయే అని అమ్మ అడగదూ? అమ్మకి తెలియకుండా ఏ పనీ చేయకు. మరి ఎంచుకుంటావా గాజులు?"

రంగు గులాబీ నీ చేతులకీ
చమ్కీగాజులు చక్కని మెరుపూ!
వదులు వదులుగా వంకి గాజులు
గణగణమని నీ మణికట్టున పడి
ఖంగుఖంగుమని కంచుగంటలై
నీ పాటల కవి శ్రుతిని వేయగా
దేవకన్యవలె దివినుం డొచ్చిన
చిన్నారికి ఈ చిలకల గాజులు
పొన్నారికి ఈ పలకల గాజులు
పసందైన ఈ పట్టు గాజులూ...

[ఇంతలో సరోజతల్లి మేడమీంచి దిగి వీధిగుమ్మంలో కొస్తుంది.]

తల్లి: "ఔనే సరోజా! అప్పుడే గాజులమాట దింపించేవ్?"

సరోజ: "లే... లేదే... మరి, మరేం, పాట వింటున్నాను."

తల్లి: "నువ్వు పాటవింటూకూచుంటే అతను గాజు లమ్ముకోవద్దూ?"

గాజులబ్బి: "గాజు లెయ్యడానికే ఒచ్చేతల్లీ!"

తల్లి: "మొన్న వేయించిన గాజులన్నీ గుండచేసింది చాలక, నాతో చెప్పకుండా గాజులు వేయించుకుంటున్నావ్?"

సరోజ: "మరినువ్వు కప్పూ సాసరూ ఎలా బద్దలుకొట్టేవే? నాన్నకి తెలియకుండా మళ్లా కొనిపెట్టేశావా, లేదా?"

తల్లి: "అబ్బనంగనాచీ! వేలంత పిల్లవున్నావో లేదో, ఇప్పట్నించీ ఈ పెద్ద కబుర్లేమిటే? (గాజులబ్బితో) నువ్వు వెళ్లోయ్ గాజులబ్బి."

గాజు: "నా బంగారుతల్లిని ఏమీ అనకండమ్మా! ఏదో చిన్నతనం. కొత్త రకం ప్లాస్టిక్ గాజు లున్నాయి."

[సుబ్బారావు—సరోజ అన్న వస్తాడు.]

సుబ్బారావు: "ఓసి దెయ్యం! అప్పుడే గాజులు కొనేసి కూచుంటివి?"

సరోజ "ఈ వెధవచూడే, ఎలా తిడుతున్నాడో?"

తల్లి: "ఒరేయ్ సుబ్బీ, నువ్వు దాని వూసు ఎత్తేవంటే చీరేస్తాను."

సుబ్బారావు: "మరి సినిమాకి డబ్బులు పారెయ్. దానికి గాజులు వేయిస్తే, నాకు సినిమాకి డబ్బియ్యాలి. దాని ఎక్కువేమిటి?"

తల్లి: "ఆడారి అచ్చన్నలా ఇక్కడెందుకురా, లోపలికి పోకూడదూ!"

సుబ్బారావు: "ఓయ్ గాజులబ్బీ, విరగనివీ, చితకనివీ, ఏవేనా ఇనపగాజులుంటే దీనికి వెయ్యవోయ్."

సరోజ: "వెధవకి జాగ్రత్తలో సున్నా ఒచ్చింది! వాడిచేతికి నాలుగు గాజులు తొడగవోయ్."

తల్లి: "ఇలా కుక్కల్లా కాట్లాడుకోండి, చెరో నాలుగూ తగిలిస్తాను!"

గాజు: "నన్ను వేగం తోలీండమ్మా."


తల్లి: "ఏదో దానికి నచ్చినవి వేసి, తరవాత రావోయ్."

[సుబ్బారావూ, తల్లీ లోపలకి వెళ్లిపోతారు.]

గాజులబ్బి: ఏదీ చెయ్యి?
(పాడుతూగాజులు తొడుగుతాడు.)

కలకల మని నీ నవ్వులలో
గలగల మని ఈ గాజులలో
నీ అందాలన్నీ పెరిగెడుగా
విరగని గాజులు తొడిగితిగా
గాజులోయ్, గాజులోయ్.
గలగల గలమని ఈ గాజులతో
కలకల మని నీ నవ్వులతో.

(గాజులబ్బి వెళ్లిపోతాడు.)



...ంత కట్టుకున్నావు? కంట్లో మట్టి ఏమైనా పడిందా?" అని అడిగేడు కేరళుడు.

"నన్ను 'చురుకుకళ్లుగా'డంటారు. నా కంట్లో మట్టీ పళ్ళేదు. గిట్టీ పళ్ళేదు. కంటి గంతను తీసానంటే ఏవస్తువు అడ్డం వున్నా, ఎంత దూరంలోవున్నా ఆ వస్తువును బాగా చూడగల్గుతా. దగ్గరుండే వాటిని చూడాలంటే కంటిగంత కట్టుకోవాల్సిందే" అని అన్నాడా మనిషి.

"నీతో నాకు పని వుంది; నాతో వస్తావా?" అని అడిగేడు కేరళుడు.

వస్తానండి' అని చెప్పి, కేరళునితో బయల్దేరేడా చురుకుకళ్లుగాడు.

కేరళుడు సేవకుల్తో పోయేటప్పటికి మధ్యాహ్నమైంది; ఎండ ఎక్కువైంది. ఉక్కపోసేటప్పటికి కోటును తీసేశాడు కేరళుడు. కొంతదూరం పోయేటప్పటికి రెండు కోట్లు వేసుకొని ఒంటినిండా గుడ్డ కప్పుకొనియుండే మనిషిని చూచేరు. ఆతడి ముఖాన్ని చూడలేదు కాని, వాడు "అబ్బా చలి; చాలా చలిగా ఉందే" అని అనేమాటలు విన్నారు.

అతగాడి దగ్గర కెళ్ళి "చలిగా ఉందా! ఉక్కపోసి నేను కోటు విప్పేస్తే నీ వెందుకు కోట్లు విప్పలే!" దని అడిగాడు కేరళుడు.

"నేను నా కోటు విప్పానంటే చుట్టూ మంచు పడ్తుంది. చలికి తట్టుకోలేక చావాల్సిందే నీవూ, నీ సేవకులూ" అని చెప్పేడా ముసుగుమనిషి.

అతగాడికి 'మంచుగా'డని పేరు పెట్టి తనకూడా రాజకుమారి యుండే ఊరికి పిలుచుకెళ్ళేడు.

ఆ మర్నాడు సేవకులక్కణ్ణే వదలి రాణిదగ్గరకెళ్ళి రాణితో "రాణిగారూ! మీ అమ్మాయిని నేను పెళ్ళి చేసుకోవా లనుకున్నా. ఇస్తారా?" అని అడిగేడు.

"నేను మూడు పన్లు చెప్తా వాట్ని చేశావంటే, నీకు తప్పక ఇచ్చి పెళ్లి చేస్తా. నీవు చేయకపోతే నీ ప్రాణం పోయినట్లే జాగ్రత్త!" అని గంభీరంగా పలికిందా రాణి.

"ఆహా! బాగానే తెలుసు; ఇవాళేం చేయాలో చెప్పండి" అని అడిగేడు.

నావద్ద చాలా విలువైన ఉంగరం ఉండింది. ఆ వుంగరం నే చేతిలోనుంచి జారి సమీపంలో ఉండే నదిలో పడింది. దాన్ని చీకటి పడేలోపల తీసుకురావాలి. లేకపోతే నీ ప్రాణాలు తీసేయిస్తా" అని ఉత్తరు విచ్చిందా రాణి.

అక్కణ్ణుంచి బయల్దేరి, తన సేవకుల్తో రాణి చెప్పిందంతా సవిస్తరంగా చెప్పేడు.

"నేను నీకు సహాయం చేస్తా" నని చురుకు కన్నుగాడు నది ఒడ్డు కెళ్లి కంటి గంత విప్పాడు. గంత విప్పేటప్పటికి తళతళ మెరుస్తూండే ఉంగరం అతగాడి కంటికి తెలిసింది.

భూతంగాడు నోరు తెఱచి నదిలో ఒక్కచుక్క నీళ్లు లేకుండా తాగేశాడు. పొడుగుచేతులోడు ఉంగరాన్ని తీసుకొచ్చి కేరళుని చేతి కిచ్చేడు.

కేరళుడు ఆ వుంగరం తీసుకెళ్లి రాణి చేతి కిచ్చాడు. దాన్ని చూడంగానే చాలా ఉరిమిచూసింది అతగాణ్ణి. "ఇంకోపని రేపిస్తా; నీవు పోవ"చ్చని చెప్పి రాణి తనలో "రేపు ఉదయాన్నే ఎవడూ చేయజాలనంత కష్టమైన పని ఏదిస్తామా?" అని ఆలోచించింది ఆ రాత్రంతా.

ఉదయాన్నే కేరళు డొచ్చాడు రాణి దగ్గరికి. రాణి అతణ్ణి చూచి "నీవు నిన్న వచ్చావు. నీ కిప్పుడు చాలా ఆకలిగా ఉండే టట్లుంది. ఇవాళ మధ్యాహ్నం లోపల నా పొలంలో ఉండే మూడు వందలావుల్ని తినేయాలి. నా కంటికేమైనా ఒక్కముక్క అవుపడిం దంటే నిన్ను చీల్చి చెండాడ్తా" అని గదమాయించింది ఆ రాణి.

"నేను ఎప్పుడూ ఒంటరిగా తినేది అలవాటు లేదు; నాతో వచ్చినవాళ్లలో ఎవరినైనా కూడా పిలుచుకెళ్లడానికి ఉత్తర్వియ్యండి" అని అడిగేడు.

?సరే, నీ వొక్కణ్ణి మాత్రం కూడా తీసుకెళ్లు" అని అంది రాణి.

కేరళుడు ఆవులుండే పొలంలోకి పిలుచుకెళ్ళేడు భూతంగాణ్ణి. భూతంగాడు అన్నీ ఒక్కదెబ్బలో తినేశాడు. అగీ చాలక రాణిగారి వంటింట్లో పడి అక్కడుండే భక్షణాలంతా తినేశాడు.

రాణికి మధ్యాహ్నం అన్నం రాలేదు. 'కారణ మే'మని వంటలక్క నడిగింది.

మధ్యాహ్నం రాజకుమారుడు, అతని సేవకుడూ వచ్చి ఇక్కడుండేదాన్నంతా తినేసేనారు" అని చెప్పిందా వంటలక్క

రాణి గాబరాపడింది. ఇంకోఉపాయాన్ని ఆలోచించింది. ఉపాయం తోచగానే 'హ్హహ్హ, దీనితో వాడు నాశనమే' అని తలచి కేరళుణ్ణి పిలిపించిందా రాణి.

ఆతడు రాగానే "నీవు ఈ రోజు రాత్రి నాతోరా. మనిద్దరం భోజనం చేద్దాం. ఆ తర్వాత నాకూతుర్తో రెండు గంటలసేపు మాట్లాడ్దువు" అని చెప్పింది.

"మీరు సమ్మతిస్తే అభ్యంతరమే లేదు. అలాగే వస్తా" నన్నాడు కేరళుడు.

"నాకూతుర్తో మాట్లాడేటప్పుడు నిద్రపోవుగదా?" అని అడిగింది.

"నిద్రపోవటమా! నిద్రపోను."

నీవు నిద్రపోయావంటే నా కూతురు అక్కడ మాయమై పోతుంది. అవతల నేనొచ్చి చూస్తా! నాకూతురు నీ దగ్గర లేకపోతే నిన్ను చంపేస్తా" అని భీకరంగా పలికింది.

'అలాగే కానీయండి' అని రాణితో బయల్దేరాడు కేరళుడు.

కేరళుడు ఏమరి యుండేటప్పుడు నీళ్లలో మత్తుమందు కలిపి ఆతగాడి చేతిలో ఇచ్చి తాగమందా రాణి.

ఏమీ తెలియని కేరళుడు తాగేశాడా నీటిని. భోజనం కాగనే రాణి తన కూతురుండే గదికి తీసుకెళ్లింది అతన్ని.

ఆ గది చాలా చక్కగా ఉంది. ఆ గదికో కిటికీ ఉంది. ఆ కిటికీ దగ్గర కూర్చుని కేరళుడు రాజకుమారితో సరదాగా మాట్లాడుతున్నాడు. అతనికి నిద్ర వచ్చేసింది. ఎంత రాకుండా చేసుకుందామన్నా అతనికి మాళలేదు.

మెల్లగా కళ్లు మూసేడు. అలా కళ్లు మూసి తెరచేలోపల మాయమై పోయిందా రాకుమారి.

కేరళుడు లేచి ఆ గదియంతా వెతికాడు. ఎక్కడా కంటికి అగుపళ్ళా. కిటికీ దగ్గర కెళ్లి దానిలో భూతంగాణ్ణి చూచేడు. భూతంగాణ్ణి చూచి "రాజకుమారి మాయమైపోయింది. ఇక ఒక గంటసేపటిలో వెతకాలి. లేకపోతే నా ప్రాణమే పోతుంది." అని పెద్దగా అరిచేడు.

భూతంగాడు "నీవు చెప్పేది నాకేమీ వినపడలేదు." అని అన్నాడు

కేరళుడు అవవగానే దూరపు వినికిడిగా డొచ్చాడు. వాడి వెనకాల్నే పొడుగుచేతులోడూ ఒచ్చాడు.

"నన్ను క్రిందికి దింపు" అని అడిగాడు.

పొడుగాటి చేతులోడు చేతుల్ని చాచి రాజకుమారుణ్ణి క్రిందికి కిటికీగుండా దింపాడు.

దూరపు వినికిడిగాడు చెవిని భూమిమీద పెట్టి "అదుగో! ఆమె నీతోనే 'రాజకుమారా, నే నీ నదిఅవత లుండే దీవిలో ఒక చెట్టు తొఱ్ఱలో వున్నా' అని చెప్తోంది" అని అన్నాడు.

చురుకుకళ్లవాడు గంతవిప్పి "ఆమె నిజమే చెప్తోంది. ఈ దీవిలో ఉంది" అని చెప్పాడు.

"మనకు పడవా, గిడవా లేదే; అక్కడికి ఎలా పోయేది?" అని అడిగాడు తన సేవకుల్ని.

మంచుగాడు తన కోటు విప్పేడు. అలా విప్పేటప్పటికి దీవి చుట్టూఉండే నీరంతాగడ్డకట్టిపోయింది. దానిమీద పొడుగుచేతులోడు పోయి రాజకుమారిని తీసుకొచ్చి కేరళున కిచ్చేడు. పొడుగాటి చేతులోడు కేరళుణ్ణి రాజకుమారినీ కిటికీగుండా ముందటి గదిలోకి వదిలేడు.

అలా ఉంచాడో లేదో కాణి తలుపు తెరచింది. తెరవంగానే మహా కోపం వచ్చింది. తన కూతురు రాజకుమారుని పక్కన ఉండం చూచి ఏమీ మాట్లాడకుండా కొంచెం సేపుండి "రాకుమారా, నాతో రా. చాలా రాత్రయింది. నీవు నీసేవకుల్తో పడుకోటానికి చక్కటి గది ఏర్పాటుచేశా; వస్తావా?" అని అడిగిందా రాణి.

కేరళుడు రాజకుమారి చేతివేళ్లను స్పృశించి, రాణితో బయల్దేరాడు. రాణి కేరళుణ్ణి ఆతని సేవకుల్తో రాతితో కట్టిన గదిలోకి తీసుకెళ్ళి వదిలింది. వారు లోపలకు పోగానే తలుపునకు వెలుపల గడియ వేసి వంటలక్కదగ్గరకు పరుగెత్తింది.

వంటలక్కను చూచి "నీవు శీఘ్రంగా పోయి రాళ్ల క్రింద బాగా మంట పెట్టు. రాత్రంతా మండాలి" అని చెప్పి పోయింది రాణి.

కొంచెంసేపయ్యేటప్పటికి కేరళుడు "ఈ గది చాలా వేడిగా ఉందే" అని అనుకొని తలుపు తీయటాని కెళ్ళాడు. కాని తలుపు రాలేదు.

మంచుమనిషి ఆ గది చాలా బాగుం దని మెచ్చుకుంటున్నాడు- మిగతా వాళ్లంతా వేడితో చస్తూంటే!

మంచుమనిషిని కోటు విప్పమన్నాడు కేరళుడు. మంచు మనిషి కోటు విప్పంగానే ఆ గోటంతా మంచు పడింది. దాంతో లోపలి వారంతా సుఖంగా మాట్లాటుకుంటూన్నారు.

దీన్నంతా ఆ రాకాసిరాణి విని, వంటలక్కను మంటలు ఇంకా ఎక్కువ చెయ్యమంది. అలాగే మంట లెక్కువ చేసిందా వంటలక్క.


ఆ వేడికి తాళుకోలేక కేరళుడు మంచుమనిషికికోటు తీసివేసుకొన్నాడు. మంచుమనిషికికోటు లేకపోగానే ఆగటుంతా మంచుగడ్డగా మారిపోయింది. ఆ గదిలో వారంతా నిశ్శబ్దంగా ఉండిపోయారు.

నిశ్శబ్దంగా ఆ గది యుండే టప్పటికి 'లోపలివారంతా చచ్చిపోయా' రని రాణి తలచి తలుపు తెరచింది తలుపు తెరవంగానే అందరూ వెలుపలికి వచ్చేశారు.

"విప్పవద్దకు పోయి చలి గాచుకుందాంరండి" అని పిలిచేడు కేరళుడు. అంతా అతగాడితో బయలుదేరివెళ్లారు.

వాళ్లని చూచి రాణి "వీళ్లను జయించటానికి నాతరంగాదు. ఇక్కడ నేనుంటే నాప్రాణంకూడా తీసేట్టున్నా" రని అనుకొని ఇక ఆవూర్లో ఉండకుండా మరోవూరికి పరుగెత్తిపోయింది.

ఆ తర్వాత కేరళుడు రాజకుమారిని పెళ్లి చేసుకొని తన సేవకుల మూలానగదా ఈ పెళ్లి జరిగిం దని తలచి వారికిని తనదగ్గరనే ప్రియమిత్రులుగా నుంచుకొని సుఖంగా కాలం గడిపేడు.



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

3౫

అన్నమాచార్యుల రచన : (చరిత్రపీఠికలో నుద్ధృతము. పు. ౧౦౭.)

రామక్రియ - ఆదితాళం

[పల్లవి]

(౧) , రి నీ స సా గ రి గా | , పా , ప పా ప మా గ గా
చా టె ద ని ది యే స త్య ము సుం డో

(౨) , రి నీ స సా గ రి ప మ గ రి గా | , పా , ప పా ప మ ధ మ గా
చా టె ద ని ది యే స త్య ము సుం డో

(౩) , గ నీ స గా ప మ గ రి స రి గ మ | పా ప ధా ప ధా సా , ని ధ ప మ గా
చా టె ద ని ది యే స త్య ము సుం డో

(౪) , గ నీ స గా ప మ గ రి సా రి గ మ | ప ధ స ని గ రి స ని ధ స ని ధ ప మ గా
చా టె ద ని ది యే స త్య ము సుం డో

(౧) , గ గ గ మ గా రి స ని | స గ రి గ పా ప ధ ప మ గ రి ప మ
చే టు తే ద త ని సే విం చి న ను

(౨) గ రి గ మ గ మ గ రి స రి స ర స ని | స గ గ రి గ ప ప మ ప ధ ని , ధ ప మ
చే టు తే ద త ని సే విం చి న ను
గ రి స రి ని స రీ
చా టె ద

[చరణం]

(౧) , ప ధా పా , ప ప పా | , మ పా మ పా మ ధ మా గా
హ రి నొ ల్ల ని వా ర సు ర లు సుం డో

(౨) , ప ధా ధ ప మ గ గ పా | మ ప ధా ప ధా ప ధ నీ ధ ప మ గ
హ రి నొ ల్ల ని వా ర సు ర లు సుం డో

(౩) , ధ నీ ధ ప మ గ రి సా గ రి గ మ | ప మ ప ధా స నీ ధ ని సా రి స నీ ధ మ గ
హ రి నొ ల్ల ని వా ర సు ర లు సుం డో
, గ ధా ప గ రి ప స స రి నీ | , స సా గ రీ గా , ,
సు ర లీ త ని దా సు లు సుం డో

(౧) , ప ధా ప మ గ మ ధ స స | , ధ సా స సా స ని గ రి సా
ప ర మా త్ము డి త డె ప్రా ణ ము సుం డో

(౨) , ,, ,, | , రి నీ స గా గ రీ , సా
ప్రా ణ ము సుం డో
, స రీ స సా సా స ని ధ ధ ప మ | గ మ ప ధ సా , ని ధ ధ ప మ , గ రి ప మ
మ రు గ క మ ఱ చి న ను త్రి తే ద క ను
గ రి (చాటెద)

ఇట్లే క్రింది చరణములు :

(౨) వేదరక్షకుడు - విష్ణుడు సుండో !
సోదించె శుకు డ - చ్చుగ సుండో !
ఆదిబ్రహ్మ గ - న్నాతడు సుండీ !
యేదెస వెదకిన - నితడే ఘనుడు (చాటెద)

(౩) ఇహపర మొసగను - యీతడె సుండో !
వహి నుతించె బా - ర్యతి సుండో !
రహస్య మిదివో - రహి శ్రీ వేంకట
మహీధరంబున - మనికై నిలిచె. (చాటెద)

లఘుటీక : మరుగక = విడిచియుండజాలనంత తగులము లేక; సోదించె శుకుడు = శ్రీ భాగవతమందు శుకమహర్షి దీనిని తేల్చినాడు; అచ్చుగ = స్పష్టముగా; వహి = పుస్తకము - ప్రమాణగ్రంథము - ప్రామాణికముగా నని ఇక్కడి యర్థము. రహిగా = ఆనందముతో; మనికి = ఇల్లు చేసుకొని.

పల్లవి

(11-వ పేజీ తరువాయి)

చతికిలబడ్డ ఆమెను కాలితో నెట్టుతూ తలుపు రెక్కలు పట్టుకున్నది చంద్ర.

"చంద్రా! చంద్రా! ఏమిటా గొడవ? ఎంతకీ తగలడవే?" లోపలినుంచి విసుగ్గా కేక.

"ఏమండోయ్, ఇలారండి!" పిలిచింది చంద్ర.

లోపలినించి ఒక స్థూల కాయుడు సువాసనలు వెదజల్లుతూ బయటకొచ్చి "ఏమిటి చంద్రా?" అంటూ ఆమెను చూశాడు. 'ఎవరది?' అని చూపులతో ప్రశ్నించాడు.

"చూడండి! ఈ పాడుముండ వచ్చి పీఠం వేసింది. కదలమంటే కదలదు."

ఆమెకు కళ్ళనీళ్ళపర్యంతం అయింది. కాని ఆమెకు కళ్ళ నీళ్ళు రాలేదు.

"అమ్మాయి, రేపు ప్రొద్దున నీ వుండమన్నా, ఒక్క క్షణం ఈ పాపిష్ఠి కొంపలో ఉండను. ఈ లోపల ఆలోచించుకో. నీవు బాగుపడాలని దేవుడు దయతలిస్తే నీకు మంచి బుద్ధే పుట్టుంది. లేమా,.. .."

"ఎవరమ్మా నీవు? ఏమిటే గొడవ?" మర్యాదగా అడిగాడు అతను.

ఆమె మాడలేదు; మాటాడలేదు.

"మీ అమ్మేనా?" అడిగాడు. చంద్రను.

"అమ్మ! లమ్మ! ఈ పాడుముండ వచ్చి ఒక్కటే గొడవ. నే నేదో తప్పుపని చేస్తున్నానట! బాగుపడాలట! చెవిలో ఊరికే తెగ పోరుతూంది. బయటికి నెట్టి పారేయండి. అబ్బబ్బ!"

"ఎంత కాకపోయినా తల్లి! ఊరుకో చంద్రా! తెల్లవారగానే ఆమె అంత ఆమె పోతుందిగా! ఎవరమ్మా నీవు! చెవికోసిన నక్కల్లే ఊరికే వాగావంటే.. రా చంద్రా! పడిఉంటుందిలే!"

శూలంలా తగిలింది.

"హుం. పడివుంటుంది! ముద్రష్టపు ముండా కొడుకా! దాన్ని చెడగొట్టి, దాని జీవితాన్ని నాశనంచేసి, ఇప్పటికైనా దాన్ని బాగుపడనియ్య వట్రా?" అని చేతు లెత్తి నేలకు విసిరింది.

వెన్నున బాకు పొడిచినట్లు చటుక్కున వెనక్కి తిరిగి, చంద్ర నడుము వదిలి ఆమెదగ్గిరికి వచ్చి "ముసలమ్మా! నోరు కట్టేసుకుంటావా? బయటికి ఈడ్వమంటావా?" అని గర్జించాడు.

"నీవా ఈడ్చేది?! అహ్హహా. నీవు ఈడవాలసింది మీ అమ్మనా!"

ఆమె కనులు తుడుచుకుంటూ తల వంచింది.

అతడు చంద్రకళ్ళల్లోకి చూశాడు కనుసైగ చేసింది.

అతడు ఆమెను రెండు చేతులూ పట్టుకుని గుమ్మందగ్గిరకు ఈడ్చాడు.

గంభీరంగా "అమ్మాయి! నా జీవితం, నా కోసం కాదు; నీ కోసం" అన్నది ఆమె.

గుమ్మం అవతల మెట్లు. అత డామెను వాకిట్లోకి కాలితో తోశాడు.

ఏ ఆటంకం లేకుండా తలుపు రెక్కలు చుంబించుకున్నై.

మళ్ళా: మెరుపుతో నయానా, ఉరుములతో భయానా చెప్పింది; బ్రహ్మాండం బ్రద్దలయ్యేట్లు గర్జించింది ఆకాశం. ఊహుం. నిరాశ చేసుకుని వలవలా విలపించింది.

కొన్ని క్షణాల్లోనే;—

అంతవరకూ పిచ్చెత్తినట్లు నవ్వుతున్న చీకటి చెట్లు; నిశ్చలమై, అంధకారపు గుట్టలైనవి.

నక్షత్రాలు చీకటి తెరమాటున దాగుకున్నై.

ఆకాశం నిశ్శబ్దం.

ప్రకృతి స్తబ్ధం.

—

పెళ్లితాపులు

"యత్న న్"

"ఉత్తరా లేం రాలేదుటోయ్?" అంటూ అందుకున్నా ఒక శుభలేఖను తపాలా బంట్రోతువద్దనుంచి.

"లేదండీ" అంటూ వెళ్లిపోయాడతడు.

"పెండ్లిపిలుపు" అని చదువుతూ కుర్చీలో కూలబడ్డాను. వెంటనే నాఒళ్లు గరిపొడిచినట్లయింది. మన స్సన్యాయత్త మైంది.

* * *

రేపు కాలేజి తెరుస్తారు. అప్పుడే రూముకి వచ్చా రైలు దిగి. సామాను లోపల పెట్టించా కూలీవాడిచేత. ఇంతలోకే మా ప్రియస్నేహితుడు రంగా వచ్చాడు.

కాస్సేపు పిచ్చాపాటీ కొట్టాం. ఇంతలో సూర్యుడు పశ్చిమాద్రిని జేరడాన, రంగడు కొంపకి, నేను అన్నదాత సుబ్బయ్యభవనానికీ బయల్దేరాం.

"కబుర్లలో రంగా చెప్పాడు - శెలవుల్లో ఎవరో నాకోసం రెండుమూడుసార్లు వచ్చారని. పెండ్లి మనువు విషయమై అనికూడా చూచాయగా అన్నాడు. ఇంక అది విన్నప్పటినుంచీ నాకు కాలు నేలమీద ఆనలేదంటే నమ్మండి.

మరునాడు కాలేజీనుంచి అప్పుడే వచ్చా రూముకి. ఇంతలో నావెనకాలే ఒకాయన లోపలకు వచ్చాడు.

"సుబ్బారావుగారంటే మీరేనా?" అన్నాడు బహుసున్నితంగా.

"ఔనండీ, తమరూ...?" అన్నా వినయంగా అదోమాదిరి.

"మీరు ఫోర్తియర్ కాదూ చదువుతూంటా? అన్నాడు నన్ను నిర్ధారణచేసుకుంటూ."

"ఔనండీ." అన్నాను.

సంభాషణధోరణిని బట్టి ఈయనే కాబోలు సెలవుల్లో నాకోసం వచ్చింది అనుకున్నాను.

నేననుకున్నది నిజం.

"మీకోసం యిదివరలో రెండుసార్లు వచ్చాను. మీరు నన్నెరగరు కానీండి. మీవాళ్లు బాగా యెరుగుదురు." అని ఉపోద్ఘాతంతో ప్రారంభించాడు. నేను వాక్యానికీ వాక్యానికీ మధ్య సందు బోకుండా "ఊఁ" కొడ్తున్నాను.

"నాకు ఒక చెల్లెలుండీ..." అంటూ ఏదో చెప్తున్నాడు గాని పారవశ్యంలో నాక వ్వేమీ వినబల్లేదు.

"ఈవిషయమై మీ తలిదండ్రులవద్దకు వెళ్లి వచ్చాను...వారు మాత్రం ఏమంటారు? పిల్లా పిల్లాళ్ళు చూచకుంటే లగ్ననిశ్చయం చేసికో వచ్చునన్నారు" అన్నాడు.

"ఆఁహా" అన్నాను వింటున్నట్లు విశదపరుస్తూ.

"పిల్లకు పద్నాలుగో యేడు. కాస్త సంగీతం అదీ వచ్చు. ఫోర్తుఫారందాకా చదివింది." అని ఎడ్వర్టయిజ్ చేస్తో నన్నువ్విళ్లూరిస్తున్నాడు.

మధ్యలో "మరి మీ ఉద్దేశ్య మేమంటారు?" అని వేశాడో గడ్డు ప్రశ్న.

"చచ్చాన్రా దేవుడా"అనుకున్నా. లేకపోతే అదేం ప్రశ్న! అందులోనూ పెండ్లికొడుకునా?

ఐనా మనస్సు బిగపట్టి, "నా దేముందండీ, పెద్దవాళ్లున్నారుగా?" అన్నా జిహ్వాంతం నుంచి.

"ఆ విషయం చెప్పానుగాదూ? ఐతే లేవండి వెళ్దాం బెడవాడ. పిల్లను చూచి రేపు రావచ్చు" అన్నాడు వ్యవహారం చాలావరకు పరిష్కారం ఐనట్లు.

"ఊఁ" అంటూ నేనో గుటక వేశాను. నాకైతే వెళ్లి చూచివద్దామని, మనస్ఫూర్తిగా వుంది. ఐతే ధైర్యం చాలలేదు. ఎవరైనా, ముఖ్యంగా రంగా, గేలిచేస్తాడేమో నని బిడియపడ్డాను.

"ఇవ్వాళ వీలు పడదులెండి. ఈసారి చూద్దాం" అన్నా బెట్టుగా.

"అల్లా కాదు. మీరు మళ్లా వెంటనే తిరుగుముఖం పట్టవచ్చు"నని అభయ మిస్తూ నాచేత సరేననిపించాడు.

"బయల్దేరుతూండండి. నే పోయి బండీ తేస్తా"నని సగర్వంగా (ఉత్తరగోగ్రహణంలో విజయం సాధించిన విజయుడిలా) బయటికి సాగాడు. ఇక నేను 'మ్యారేజి ఇంటర్వ్యూకు' ముస్తాబౌతున్నాను.

ఇంతలో వాకిట్లో కారు హారన్ మోత వినపడింది. తొంగి చూద్దునకదా ఒక జీపు ఆగి వుంది. "గెట్ ఇన్ మిస్టర్ సుబ్బరావు" (*get in Mr. Subbarao*) అని ఒక అపరిచిత కంఠస్వరం వినపడింది.

ఇంత చనువుగా పిలిచేది ఎవరా అని ఒక సెకండు ఆలోచించా. కాని 'ఆబావ లే'నని వెంటనే నిర్ధారణ చేసికున్నా. సరే, మాట్లాడకుండా తలుపుకు తాళం తగిలించి జీప్ ఎక్కాను.

ఇక నా పూహాపథంలో చిత్రాలు ఎన్నెన్ని గడచిపోయాయో చెప్పలేను. అసలప్పుడు నాకేదైనా ఆలోచన వచ్చిందో లేదోకూడా చెప్పలేను.

కారు శరవేగాన పోతోంది. కాని కారులో మా (కాబోయే) బావగారుమాత్రం కనపడలేదు. బహుశా స్టేషనులో కలుస్తారేమో అని సంతృప్తి చెందాను.

కారు పోయిపోయి పోలీసుస్టేషను ముందాగింది. ఎవరికోరకో అనుకున్నాను. ఇంతలో నా కారులో ఆతడు దిగి నన్ను "గెట్ డౌన్" అన్నాడు కొంచెం కటువుగా. మొదట నన్ను కాదేమో అనుకున్నాను. కాని నేనుకాక ఇంకెవరున్నారు దిగవలసింది? నా కేం అర్థం కాలేదు. విషయమంతా అగమ్యగోచరంగా ఉంది.

"గెట్ డౌన్" అని మళ్లీ కఠోరతమంగా వినపడింది. నా కేం తోచలేదు. ఎల్లా ఎక్కానో అల్లాగే మౌనంగా దిగా. తరువాత నాకు లోపలి కళ్లే దోవ చూపించబడ్డది.

ఒక్క క్షణంలో నా చుట్టూ పదిమందీ పిశాచాల్లాగా మూగారు.

ఇంతలో ఒక డొచ్చాడు! సబ్ఇన్స్పెక్టరేమో!

"*Come on, you fellow, out with the truth*" (రావోయ్. రా. కక్కు. నిజం కక్కు) అన్నాడు. నేను మౌనము వ్రహించా.

"*Come on*" అంటూ హరోహరిగా రెండు వడ్డించాడు.

"నాకేం తెలీయదండీ" అన్నా వణుకుతూ.

"తెలియదూ?" అంటూ పచ్చడి పచ్చడిగా కొట్టాడు.

ఈ దెబ్బలో ప్రతీవాడూ తలో తన్ను తన్నారు.

"చిక్కావురా! ......నెలనుంచీ చంపుతున్నావు" అని ఒకడు.

"నా......!నువు నా యకుడివిరా" అని ఇంకొకడు.

"ఇన్నాళ్లెక్కడ చచ్చావురా" అని మరొకడు.

తలా ఒకటే, రెండూ జబురుకున్నారు. నా కిదంతా గొడవగా ఉంది. ఏడుపూ రాలేదు మాటా రాలేదు.

ఇంతలో ఒక డొచ్చి నా జేబు తడుముతున్నాడు. దేనికో అనుకున్నా.

"..... ఒక దమ్మిడీ అన్నా తేలేదు కదరా" అని అంటూ కసితీరక, నా (పెండ్లి ముస్తాబు) సిల్కుచొక్కా చినిగేలా కొట్టాడు. పెండ్లి సంబరంలో పర్సు మరిచిపోవడం కూడా మేలే ఐంది. ఇంతలో మరొకాతానదిగాడు—ఎర్రని కండ్లు బుర్రమీసాలూ తనూ.

"ఇన్నాళ్లూ ఎక్కడ దాక్కున్నావు? మీకరపత్రా లెవరు వ్రాస్తున్నారు? నిజంచెప్పు. లేకపోతే.. " అని దౌర్జన్యపూరితంగా సంబోధించాడు.

"నా కేమీ తెలీదండీ" అన్నా ముక్తసరిగా.

"సరే" అంటూ నన్ను ఆ పిశాచాలకు వదిలిపోయాడు. ఇక నాపాట్లేమని చెప్పుదును? ఒకడు నామీద స్వారి చేయడమేనా? నా కంఠానికు గంతగట్టి మొట్టికాయలు కొట్టడమేనా —ఏంచెపుతాను?

ఇంతలో మాబావమరది వచ్చి "ఏమండీ బావగారూ, పెండ్లి చేసుకుం...?" అన్నాడు పకపకలాడుతూ.

"ఓరి నీమొహం ఈగ్నా! నువ్వింతకూ C. I. D. వా?" అనుకున్నాలోపల. కాని కుయ్ కయ్ లాడలేదు. ఎందుకూ? పెదిమ మెదిలిస్తే.. సత్యం బహిర్గతం చేయడానికి వీల్లేకపోయె!

ఇంతలో ఒక పాకీది వచ్చి అధికారుల ఆజ్ఞ శిరసావహిస్తూ తన చీపురుతో దిష్టి తీస్తోంది. అడ్డేమని అనడానికి వీల్లేదు. కారణం - అదీ ఒక ప్రభుత్వోద్యోగిగా! తల వంచుకున్నాను.

ఇల్లా అవమానించి ఏదో సాధిద్దామని కాబోలు. కాని ఆ మనుష్యులను నేనే ఎందుకు ఎన్నైనానో తెలీలేదాయె!

చివరికి ప్రాణాలమీద ఆశ వదలి, పారిపోతున్న పంచప్రాణాలను పట్టుకుని, ధైర్యంచేసి, తెగించి ప్రబల ప్రయత్నంతో "ఎందుకండీ నన్నిల్లా హింసించడం?" అన్నాను. ఇంకో రెండు తాపులు తిన్నాను.

ఇంతలో ఒక ఫ్రెంచికటింగ్ మీసాల ఆసామి "బ్రదర్, దీనిమీద సంతకం చెయ్యి. బాగుపడతావు. లేకపోతే ఈ శీతలరాత్రుల్లో దిగంబరివై అడవుల్లో అల్లాడాల్సి వుంటుంది" అని విశదం చేశాడు. అసలు సంబోధనతోనే నాకు గాంధీజీ, బుద్ధుడు వగైరాలు గుర్తుకొచ్చారు. అక్కడ అంతమాత్రం మృదువుగా మాట్లాడేవా రున్నందుకు ఆశ్చర్యపడ్డాను. సంతోషించాను కూడా.

ఆతృతతో ఆ కాగితం అందుకొని ఇల్లా చదివాను: "నే నింతతో.. సంఘంతో సంబంధం, సభ్యత్వం వొదులుకుంటున్నాను" అని ఇంకా ఏమేమో వుంది. నాకు తేళ్లూ, జెర్రులూ పాకినట్లయింది.

"నా కసలు దాంతో సంబంధం లేదండీ. నేనో చదువుకునే కుర్రాణ్ణి" అని బావురుమన్నాను. ఇందాకటి బాధంతా ఇప్పుడనుభవానికి వచ్చింది.

"ఆ!" అన్నాడాయన ఆశ్చర్యార్థకంగా ప్రశ్నిస్తూ.

"ఐతే మీ పేరు?"

"పి. సుబ్బారావు."

"మీ రేం చదువుతున్నారు?"

"ఫోర్తు బి. యస్సి."

"ఓ! క్షమించండి: మీకు ఫోర్తు బియ్యే చదివే వి. సుబ్బారావుగా రని మా సి. ఐ. డి రిపోర్టు చేశాడు. మీరు మమ్మల్ని క్షమించాలి" అని ప్రాధేయపడ్డాడు. ఇంతలో తక్కినరూపా ఒక్కొక్కటే తప్పుకున్నై మా బావమరదిమాత్రం చివాట్లు తినేవరకూ అక్కడే ఉన్నాడు.


నేను చావు తప్పి కన్ను లొట్టపోయి బయటపడ్డా. కేసు పెడదామా అనుకుంటే దమ్ము లేవు అందుకని నాలో నేను దిగమింగా. అప్పటినుంచీ పెండ్లంటే......

* * *

మరొకసారి శుభలేఖ చూస్తూ'ఇస్సు'రన్నాను.

ఇందాకటినించీ నా చర్యను గమనిస్తోంది మా చెల్లాయి.

"ఏమిటన్నాయి. ఎన్ని సార్లు పిల్చినా కాఫీకి రావు?" అనేవరకు నాకు మెలకువ వచ్చినట్లయింది. చూద్దునుకదా చేతిలో శుభలేఖా, ఎదురుగా చెల్లాయి. నాకు నవ్వు వచ్చింది సరేనంటూ కాఫీకి లేచాను.



కాశ్మీర్ దృశ్యము: లిడ్డరునదిలోయ

★ నాగపూజ ★

శ్రీ ఆర్. ఆర్. రవి

హిందూదేశములో అనాదిగా వ్యాప్తమై యున్న పూజాపద్ధతులలో నాగపూజ ఒకటి. ప్రస్తుత మీ పద్ధతి యింకను దక్షిణాదిని చూడగలము. ఆదియందు, అనగా సృష్టికి పూర్వము, దట్టమైన చీకటి తప్ప మరేమియు ఉండేది కాదు - ఇది క్రైస్తవుల దృఢవిశ్వాసము. శాస్త్రరీత్యా చూస్తే - గాలిమాత్రం ఉండే దని స్పష్ట మౌతోంది. హిందూ ఆచారాన్ని బట్టి చూస్తే - ప్రపంచం పుట్టకముందు ఒక నాగు బాము మాత్రమే ఉండే దని తెలియుచున్న ది.

ఆదియందు ఆదాము అవ్వలను ప్రేరేపించి నట్టి పాము వారికొఱకే పుట్టబడలేను. అది పూర్వమునుండియు ఉన్నది. ఆదియందు సృష్టికి పూర్వముననూ అది కలదు. అది యేడు పడగలతో వద్భుతముగా నుండెడి దనియు, ఆ యేడుపడగలనీడనే - హిందూ దేవతలు సకలమూ సృష్టించిరనియు హిందువుల దృఢనమ్మకము. దీనినే ఆదిశేషు యని పిలుచుట వాడుకై యున్నది. అది యిప్పటికిని భూమి కడుగుభాగమున కల దనియు, భూభార మంతయును, తన పడగలపై మోయుచున్న దనియు, విస్తరించిన దాని వితానముక్రింద, హిందూదేవతలు, విలాస క్రీడలు సలుపుదు రనియు వారి నమ్మిక.

దాని క్రిందనే జగద్రక్షకుడైన శ్రీ మహావిష్ణువు తన భార్య లక్ష్మీదేవితో - విశ్రాంతి కాలము వెళ్లబుచ్చునట.

ఈ నాగపూజా పద్ధతి ఒక్క హిందూదేశములోనే వ్యాపించియుండలేదు. ఒకప్పుడి ది - ప్రపంచం అంతా ఆచరణలో పెట్టినదే. ప్రాచీన గ్రీకులలో విశేషముగా నాగపూజ కనబడుతుంది. హెర్క్యులీస్ కూడ నాగపూజలో ప్రాచీనుడుగా పరిగణింపబడుచున్నాడు. ఈజిప్షియన్లుగూడ నాగపూజను పవిత్రముగా నెంచియున్నారు. యూదులు, చైనాదేశీయులు, రకరకాల భయంకరమైన పాముల నారాధించెడు వారు. ఉత్తరదక్షిణఅమెరికాలలో నివసించు భారతీయులలోకూడ నాగపూజ ప్రబలంగా ఉంది.

సృష్టిలోని మొదటి స్త్రీకిని, పాముకు గలిగిన సంపర్కమునుబట్టి తదుపరి వంశోత్పత్తి కలిగిం దని, గాన వంశమూలపురుషుడు నాగబాము అని వారి నమ్మకము.

ప్రస్తుతము ప్రపంచంలో నవనాగరికత ప్రబలిపోయింది. దీని కారణముగా వర్తమాన కాలంలో చాల దేశములలో నాగపూజ కనపడనప్పటికీ, ఆఫ్రికా హిందూదేశములలో మనం చూడగలము. అందులో దక్షిణహిందూదేశములో విశేషం.

మన దక్షిణాదిని పర్యటిస్తూ ఉంటే - యెన్నో రాతితో చెక్కబడిన పాములు, పూజాచిహ్నాలు గోచరిస్తూ ఉంటాయి. ఇచ్చట పాములను రాతిదిమ్మలపై చెక్కి ప్రతీ మార్గస్థుడు పూజా పునస్కారాలు జరుపుకునేందుకు వీలుగా దారి ప్రక్కను జాగ్రత్తగా పెడతారు. వాటిపై ధగధగ మెరిసే కుంకుమపూత ఉంటుంది.

కొద్దికాలము క్రిందట దక్షిణహైదరాబాదు జిల్లాలో నేను పర్యటనము చేస్తున్నాను. అచ్చట ఒక పొలముగుండా పోవుచుండగా బుద్ధుని విగ్రహ మొకటి నాకు కన్పించింది. నేనొక్కడినే ప్రయివేటుగా శిల్పపరిశీలనకు వచ్చినట్లుగా తోచింది నాకు. దానిని వెంటనే నా సాలువాతో కప్పి జాగ్రత్తచేశాను. ఇంతట్లో అచ్చటి జనం బాగా ప్రోగయ్యారు. నేను వాళ్ల ప్రాంతానికి చెందిన విగ్రహాన్ని నా అదుపుచేసుకోవడం వాళ్లకు బాధగా ఉందేమో - నన్ను కసరడమూ, కోపంగా చూడడమూ ప్రారంభించారు. ఇంతలో దానికి ప్రక్కగానే నాకో చిన్న చిహ్నము కనుపించింది. అది పాముబొమ్మ చెక్కిన రాతిదిమ్మ. ఏమోగాని వాళ్ల మనోవికారాలు కొంత చల్లబడినాయి.

నే ననుకుంటున్నాను: దానికి కారణం నేను వేసుకొన్న నిక్కరేమోనని; పైయధికారి గావల్నని ఝడిసిఉంటారు.

తర్వాత అచ్చటి విషయాలన్నీ వాళ్లంత వాళ్లే చెప్పడం మొదలెట్టారు. అచ్చటి వారు పాముల నర్చిస్తే వర్షము రమ్మంటే వస్తుందిట. మానమంటే మానుతుందట. అది కోపించి యెవ్వరినైనా శపిస్తే కుష్ఠురోగులై పోతారుట. పాములవల్ల చనిపోయినవారు తిరిగి లోకంలో చెడ్డ ఆత్మలతో పుడతారుట - ఇది వాళ్లు చెప్పింది.

లెఖలు వేసి చూస్తే మన హిందూదేశములో ప్రతీ సంవత్సరమూ సగటున 10,0000మంది పాములవల్ల మరణిస్తున్నారని తెలియుచున్నది. దీనికి సరియైన చికిత్స యింకనూ చేయబడుట లేదు. ఆసుపత్రిలో పాముకాటుకు "ఏంటి విసైన్ సిరమ్ను" మాత్రము యిస్తారు. ఇదైనా పట్టణాల్లో నివసించేవారికే అందుబాటులో ఉంటుంది. మరి పల్లెలలో నివసించు బీదవారిగ తేంగాను?

మన మిచ్చట రెండు విషయాలు గుర్తించుకోవాలె. మొదటిది నిరోధకము. పాముతో సంబంధం గాని అది కఱచే సంఘటనలుగానీ లేకుండా చేసుకొనడము. చూడండి! మనవాళ్లింకా - చీకటిపడిన తర్వాత పాముపుట్టల వద్దకు వెళ్లి, మల్లెపూలు, పాలు సమర్పిస్తుంటారు. ఆడాళ్లు - అప్పుడప్పుడూ పాములను బిర్శించినప్పుడెల్లా మొకరిల్లి - "అమ్మా! నా దడలూ నీబిడ్డలే, వారి నేమీ చేయకు తల్లీ" అని వినయంగా ప్రార్థిస్తుంటారు. ఏమి టిదంతా?

పోనీ, యిన్ని చేస్తున్నా అది శాంతించదు. వీలు చిక్కినపుడెల్లా కాటు వేస్తూనే ఉంది.

వాళ్లు చెప్పారు. ఆప్రక్కగ్రామంలోనే ఒక యోగి ఉన్నాడట. అతను మహాశక్తిమంతు డని చెప్పా రంతా. నాగదేవతలతో స్వయంగా మాటలాడతాట్ట. అతనిగురించి వాళ్లంతా కథగా చెప్పడం మొదలెట్టారు. అతనియొద్ద కొక దినమున పాముకఱచినవానిని తీసుకొచ్చేరట - అతనేం చేశాడట! - ఒక దారం తెచ్చి దాని చివర అన్నీ ముడులు పెట్టేసాడట. కొన్ని బియ్యం తెచ్చి పాము కఱచినవాని దగ్గి రుంచాడట. కుడిచేత్తో పడుకున్నా వాని ముఖంపై మంత్రించి చిలికాడుట. ఆవుపేడ తెప్పించి మంటపెట్టి ఆ బూడిద గాయంపై పెట్టి రుద్దాడట - అల్లా చేయడంలో పామువిషం విడిపోతుం దని - ఇదంతా మూఢాభిప్రాయంకదూ!

ఈ పాముల విషయంలో యింకో పాతముంది. కెప్ కొమొరిన్ వద్ద నాగర్ కోయిల్ అనే దేవాలయ ముంది. అది నాగదేవతయైన అనంతకు పుణ్యపీఠము. నాగదేవత లేడుగురులోను అనంత ఒకడు. శివనివాసమైన కైలాసగిరినుండి, రెండుపర్వతాలను, దక్షిణాదికి లాక్కొచ్చేందుకు అగస్త్యమహాముని యీ యేడు నాగదేవతలను త్రాళ్ళగా నుపయోగించె నని ప్రతీతి. అంతపనీ చేసినతర్వాత అతని కెక్కడలేని ఆయాస మొచ్చి దాహం తీరక సముద్రాలు. మ్రింగేటంత పని జరిగిందట.

శివుడీ పాములకు ప్రభు వని చెబుతారు దక్షిణాదిదేవతలలో ముఖ్యుడు అతని కుమారుడు, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి గూడ పాము అవతారమూర్తియై యున్నాడు.

మలబారులో ప్రతీనాయరు యింటిలోను ఒకొక్కక్క నాగదేవత ఉంటుంది. ప్రతీతోటలోను, ప్రత్యేకంగా చిన్నతోట భాగము, నాగదేవతానివాసార్థము ప్రత్యేకించబడుతుంది. ఆ తోటను, గుబురుగా దట్టంగా పెరుగనిస్తారు. ఆ తోటకు - అస్పృశ్యుల నీడసైతం తగలకుండా పవిత్రంగా ఉంచుతారు.

ఆధునికకాలంలో వాటిపై నమ్మకం లేనివాడికి గనక ఆ యిల్లూ తోట అమ్మబడితే - వాడు ఆ దేవతారాధన చేయకుండా ఉండడము కూడ జరుగుతుంది. అందువల్ల ఆతనిపై యితర నాగదేవతలకు కోపము వస్తుందేమో నని భయం మిగతావాళ్ళకి. దానికి కూడ వాళ్లల్లో యేర్పాటులు ఉన్నై. అట్లాంటి విషమ పరిస్థితు లేర్పడ్డపుడు, మలబారులోని నంబుద్రీబ్రాహ్మణులు ఆపాముదేవతలను మరియొక తోటలోనికి ప్రవేశపెట్టే బాధ్యతను తీసుకొంటారు.

పైడ్ పైపర్ ఆఫ్ హేమిలిన్ (*Pide* (*Piper of Hamelin*) లాగ నంబుద్రీబ్రాహ్మణుల ప్రభావం చాల అద్భుతం.

ఆపద్ధతి చాల సులువైంది కూడాను.

ఊరికే - ఆపూజా పరికరాలన్నీ మరియొక స్థలానికి మార్చడంతో పనంతా పూర్తైనట్లే.

ఆదిశేషుడు గనక - యెప్పుడైనా పడగ క్రిందికి వంచినట్లయితే - భూమికి ప్రమాదము వాటిల్లుతుం దనియు, నాశనం కలుగుతుం దనియు వాళ్ల నమ్మకం.

పాముల విషయంలో అద్భుతవిషయ మింకొకటి గలదు. వాటి పడగలపై అమూల్యమైన మణు లుంటాయట. వాటి మధ్య ధనాగారముంటుందట.

పాములు నివసించే స్థావరాల్లో బంగారం కుప్ప లుంటా యని, విలువైన రాళ్లుంటా యని చెబుతారు.

మానవునికి పునర్జన్మ కల దని చెబుతుంది హిందూఆచారము. ఈ జన్మలో బహు పిసినిగొట్టైనవాడు ఉత్తరజన్మలో నాగుబాముగా పుడతా డట.

రాష్ట్రసాధనకై ఆంధ్రప్రజల మహాసభలు

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య

ఆంధ్రప్రజల మహాసభను రాష్ట్రసాధన సందర్భంలో జరుపదలచామంటూ మద్రాసు నగరంలోని ఒక బహిరంగ సభలో తీర్మానించారు. మద్రాసు రాజధానీనగరంగా ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించేందుకు ఈ సభ కడపలో ఈ నెల 24 వ తేదీ జరుగుతుం దని శ్రీ బులుసు సాంబమూర్తిగారు ప్రకటన చేసారు. ఇంతలోనే ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కార్యవర్గం ఆ కడపసభను తమ తరఫుననే జరుగునని తీర్మానించింది.

ఆంధ్రు లనేకమంది కడపనుండి మద్రాసుకు మార్చుమన్నారు కావున మద్రాసులో 16, 17 తేదీలలో జరుప నిశ్చయించామని సత్వరాంధ్ర విషయంలోనూ, మద్రాసు ఆంధ్ర పరిహద్దుల విషయంలోనూ అభిమానం గలవారు రావలెనని ఆంధ్రసరిహద్దు సంఘం తరఫున శ్రీ బులుసు సాంబమూర్తిగారు 6 వ తేదీ ఆంధ్ర పత్రికలో పకటించారు.

ఇంతలో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘాధ్యక్షులు శ్రీ ఆచార్య రంగాగారు ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సంఘం ఇదివరలో నాయకత్రయ నివేదిక సందర్భంలో చేసిన తీర్మానాన్ని బలపరచుటకు 24 వ తేదీ మద్రాసులో ఆంధ్రుల మహాసభ జరుగుతుం దని ఈ నెల 8 వ తేదీ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ఒక ప్రకటన చేశారు.

ఆంధ్రరాష్ట్రవాదులందరి సమావేశం ఆంధ్ర మహాసభ జరుపుట అవసరమని శ్రీ కొండా వెంకటప్పయ్యగారిమధ్య ప్రకటించారు. అటులే ఈ సమావేశావసరాన్ని చాలా మంది బలపరిచారు కూడా.

అటుపై అట్టి సమావేశం జరుపుటకు ఆంధ్ర మహాసభా స్థాయీ సంఘ సమావేశం జరుగనున్నదని ఆంధ్రమహాసభ కార్యాధ్యక్షులు శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమ రావుగారు ప్రకటించారు. ఇంతలో గంజాం కోరాపుట్టి జిల్లా ఆంధ్రమహాసభ బరంపురంలో 25 వ తేదీ జరుగుతుం దని ప్రకటన వెలువడింది. ఈ బరంపురం సభకై ఆంధ్రమహాసభా స్థాయిసంఘం యొక్క 24 వ తేదీ సమావేశం వాయిదా వేయబడింది. బరంపురాంధ్రులపై ఓఢ్రులు జరిపిన అత్యాచారం అందరికీ తెలిసిందే. చివరకు 26 వ సభ కూడా వాయిదా పడింది. ఇటు 24 సభ ఆగిపోయింది.

అయితే బరంపురాంధ్రుల యెడ సానుభూతి చూపుటకు మద్రాసులో జరిగిన బహిరంగసభలో మాట్లాడుతూ ఆంధ్రమహాసభా సహాయ కార్యదర్శి శ్రీ తట్టా రాఘవాచారిగారు జూలై 6 వ తేదీ ప్రాంతంలో చెన్నపురిలో ప్రధానమగు ఆంధ్రసభ ఒకటి జరుగనున్నదన్నారు. 28 వ తేదీ ఆంధ్రపత్రికా సంపాదకీయానికి జవాబిస్తూ శ్రీ గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు నాయకత్రయనివేదికను ఆంధ్రమహాసభా కార్యవర్గం మాత్రమే అంగీకరించి యున్నదని, ఇంకా స్థాయీ సంఘం కూడా అంగీకరించవలసి యున్నదని, మద్రాసు నగరం రాజధానిగా వుండవలె ననే వారు మాత్రమే గాక ఆంధ్రులందరి సంయుక్త సమావేశం ఆంధ్రుల మహాసభ జరుపదలెంచుచున్నదని 6 వ తేదీ ఆంధ్ర పత్రికలో ప్రకటించారు. ఆంధ్ర స్వరాజ్య పార్టీ ఇట్టి సభను బెజవాడలో జరుపడం అవసర మని తీర్మానించింది.

ఆంధ్రరాష్ట్ర సాధనకై 36 సంవత్సరాల క్రిందట యేర్పడిన ఆంధ్రుల సంస్థ ఆంధ్రమహాసభ న్యాయమైన కారణాలే కావచ్చుగాక - మొత్తంమీద స్థాయిసంఘసమావేశాలు వాయిదా వేస్తూ, వచ్చింది. అందువల్ల తా ముద్దేశించిన అఖిలాంధ్ర మహాసభ కూడా వెనుకపడుతూనే వచ్చింది.

శ్రీ బులుసు సాంబమూర్తిగారు కడపలో 24 వ తేదీ జరుగుతుంది అన్న సభ, కాదు ఆంధ్ర సరిహద్దు సంఘం తరఫున మద్రాసులో జరుగుతుంది అన్నారు.

కడపలో శ్రీ సాంబమూర్తిగారు జరుపదలంచిన ఆంధ్రుల సభ మేమే నిర్వహిస్తా మన్న ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సంఘాధ్యక్షులు ఆ సభ కడపలో కాదు మద్రాసులో జరుగుతుంది; అది 24 ననే జరుగుతుంది-అని 8 వ తేదీ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రకటించారు. ఈ 24 న జరిగే సభ ఇదివరకు ఆంధ్రరాష్ట్రకాంగ్రెస్ సంఘం చేసిన తీర్మానాన్ని అంటే మద్రాసు నగరం హక్కును వదలుకోకుండా, 11 జిల్లాలతో ఆంధ్రరాష్ట్రం యేర్పడవలె నని మిగత సరిహద్దుల నిర్ణయానికి సంఘం వేయవలె ననే తీర్మానాన్ని బలపరచుటకే నన్నమాట జరుగుతుంది అన్నారు.

ఆంధ్రసరిహద్దు సంఘం మద్రాసు నగరం ఆంధ్రులకు రాజధాని కావాలె నంటుంది. శ్రీ బులుసు సాంబమూర్తిగారు, మద్రాసు సగం ఆంధ్రులది. కావున విడదీయండి. లేదంటారా ఆంధ్రులకే కావాలె నంటున్నారు.

శ్రీ టంగుటూరి ప్రకాశం గారు ఇపుడు మద్రాసువిషయం తా నేమీ చెప్పనని, అంతా ప్రజలే చెప్పతారని అంటారు. 1948 లో ప్రధాని ఎన్నికసందర్భంలో తమను బలపరిచేందుకు మద్రాసుపై తాము హక్కును వదలుకుంటామని డా. సుబ్బరాయన్, వైద్యనాథయ్యర్‌లతో రాజీపడా.రన్న సంగతి ప్రకాశం మంత్రివర్గంలో పార్లమెంటరీ కార్యదర్శి చేసిన రాజమన్నార్‌గారి పత్రికా ప్రకటనతో అందరకు తెలిసిందే. ధార్ కమిటీముందుకూ మకు ఉత్తరంగా వున్నదంతా ఆంధ్రుల దని, దక్షిణాది ఉమ్మడి దని అయినా మద్రాసు ఆంధ్రులకు రాజధాని చేయవలెనని, లేకపోతే మద్రాసును ప్రత్యేకరాష్ట్రంచేయాలె నని చెప్పిన సంగతీ అందరికీ తెలిసిందే.

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘం మద్రాసును బొంబాయివలె చేయరాదా యని మద్రాసుపై హక్కు వదలుకోవలసిందిగా ఆంధ్రులను కోరలేమని, 11 జిల్లాలతో ఆంధ్రరాష్ట్రం యేర్పరచుడని, మిగతా భాగాలకై సరిహద్దు సంఘాన్ని నియమించవలెనని కోరింది. ఆంధ్రరాష్ట్రానికి మద్రాసు రాజధాని తాత్కాలికంగానైనా కూడా కావలెనని కోరనేలేదు. పైపెచ్చు చెన్నపురి భవితవ్య నిర్ణయం సరిహద్దుకమీషన్ నిర్ణయించాలెనని కోరింది.

దాని అధ్యక్షులు ఆచార్యరంగాగారు నాయకత్రయ నివేదిక ఆంధ్రులకు ప్రయోజనకారి యని తలంచియే కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో అంగీకరించా మన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ తీర్మానం అందుకు వ్యతిరేకంగా వున్నా, ప్రజాస్వామికవాది రాష్ట్రకాంగ్రెస్ తీర్మానాన్నే అంగీకరిస్తున్నా మన్నారు. 'చెన్నపట్టణం వదలుకోమని ఇక్కడి నాయకులు చెపితే రుచించదు. ఏదో ఒక తీర్మానం చేసి రాష్ట్రాన్ని కేంద్రప్రభుత్వమే నిర్మించాలె నని రంగాగారి అభిప్రాయమని వారి ఆంతరంగికమిత్రులతో అంటున్నా'రని కృష్ణాపత్రిక మే 28 న ప్రకటించింది.

ఆంధ్రులు రాష్ట్రం రావాలెనంటే ఇప్పటి కన్నా లభించే అవకాశం లేదని, అదీ నాయకత్రయ నివేదికను అంగీకరించడంవల్లనే అనీ భారత కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ కళా వెంకట్రావుగారంటూ, ఆంధ్రరాష్ట్రకాంగ్రెస్ తీర్మానమే తమకు శిరోధార్యమన్నారు. నాయకత్రయ నివేదిక నంగీకరించి రాష్ట్రం సాధించాలె నన్నారు.

ఆంధ్రమహాసభా కార్యవర్గం నాయకత్రయ నివేదికను అంగీకరిస్తూ మద్రాసును వదలి, నిర్వివాదమైన 11 జిల్లాలతో ఆంధ్రరాష్ట్రాన్ని వెంటనే నిర్మించాలెనని తీర్మానించింది. మిగత ప్రాంతాలకు సరిహద్దు కమీషన్‌ను వెంటనే వేయవలెనని కోరింది.

దీనిని స్థాయీసంఘం ఇంకా స్థిరీకరించలేదని, స్థాయీసంఘం స్థిరీకరించనూ వచ్చు; త్రోసివేయనూ వచ్చునని, స్థాయీసంఘ నిర్ణయమే ఆఖరు దని తదధ్యక్షులు శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగా రన్నారు. అంతే కాకుండా మద్రాసునగర భవిష్యత్తు తేలడం అనవసరం అని కూడా అన్నారు. అన్ని అభిప్రాయాలవారు ఒక నిర్ణయానికి వచ్చేటందుకు ఆంధ్రప్రజల మహాసభ అవసరం అన్నారు.

నాయకత్రయ నివేదికలో ఆంధ్రరాష్ట్రవాదులు మద్రాసును వదలుకోవాలెనని, వివాదం లేని ప్రాంతాలతో మద్రాసు రాజధానిలోని వివాదాలులేని ఆంధ్రజిల్లాల నొక రాష్ట్రంగా నిర్మించడం, అందరు అంగీకరించితే జరుగుతుం దన్నారు. తర్వాత ఎన్నడో చేర్పులు, మార్పులు జరుగుటకు నిషేధం లేదని కూడా చెప్పబడింది.

అందు కనుగుణంగా ఖచితంగా తీర్మానం చేస్తేనేగాని నాయకత్రయ నివేదిక అంగీకరింపబడినట్లు కాదని, మద్రాసు వదలుకున్నట్లు తీర్మానించవలె నని రాష్ట్రపతి డాక్టరు పట్టాభి సీతారామయ్యగా రంటున్నారు.

ఈ ఇందరి వాదనలోనూ మద్రాసు ఆంధ్రులది అని కాని, మద్రాసు కేంద్రంగా ఆంధ్ర రాష్ట్రం యేర్పడవలె నని కాని లేనేలేదు. మద్రాసు చరిత్ర రాజకీయ పోరాటాలు, చేసిన త్యాగం ఎవరి తరఫున వున్నా అవిఅంతా చరిత్రలో మిగిలిపోవలసిందే! మద్రాసు నగరమంతా ఆంధ్రులది అని ఎవరూ అనలేకుండా వున్నారు ఉత్తరమద్రాసు ఆంధ్రుల దని, దక్షిణమద్రాసు అందరిది అని అంటారు. ఉత్తరమద్రాసుకోసం దక్షిణమద్రాసును కూడా కోరడంతో ఆంధ్రుల వాదన బలహీనపడింది. జనాభానుబట్టిగాని, పెట్టుబడుల ప్రాబల్యమునుబట్టిగాని ఆంధ్రులు మద్రాసును సాధించలేరు అనేది విదిత మవుతునే వున్నది. అందువలననే చివరకు ప్రత్యేక రాష్ట్రంగానన్నా చేయరాదా అని అడుగవలసి వచ్చింది

ఈ పరిస్థితులలో ఆంధ్రులు మద్రాసును వదులుకుంటే మరల చేజిక్కుతుందా, హక్కే పోతుందే అనే భయంతో ఈ పేచీలన్నీ జరుగుతున్నవి. ప్రజాస్వామికపు రోజుల్లో చెన్నపురి భవిష్యత్తు తేలవలసింగి ఒక్కటే విధానంపై - అది జనవాక్యం. జనవాక్యంలో ఏమవుతుందో నని అంటే చెన్నపురిలోని ఆంధ్రులకు బలం చాలదు కావున రెండుకోట్ల మందినికూడ వత్తిడి చేయమని అడగడమే అవుతుంది. అందువలననే మద్రాసు ఆంధ్రులకు వస్తుందనే విశ్వాసం ఆంధ్రులకే లే దని తేలుచున్నది. అసలు భయపడవలసిందే లేదుగా నిజ మాలోచిస్తే! అంటే ఉమ్మడిరాష్ట్రంలో వుండగా వున్న ఈమాత్రపు దబాయింపుతో మద్రాసును సాధించదలంచితే అపతలివారు చేతగానివారైనపుడే సాధ్యం అవుతుంది. ఒకసారి వదులుకుంటే అసలే పోతుం దేమోనని భయం ఎందుకు?

నిజంగా ఆంధ్రులకు మద్రాసు నగరం వచ్చే అవకాశమే ఉంటే నాయకత్రయ నివేదికలోని *We do not rule out the possibility of changes or additions at a later stage* (*Page 14*)—తర్వాత కొన్నాళ్ళకు మార్పులు చేర్పులు చేసే అవకాశాలను మేము త్రోసివేయడం లేదు అనే వాక్యం గమనిస్తే, ఈనాడు 11 జిల్లాలతో రాష్ట్రంకోరడంవలన భవిష్యత్తులో మనకు రావలసిన ప్రాంతాలను వదులుకోవడం కాజాలదు. మద్రాసునగరం మినహా ప్రాంతాలు కోరడం వల్ల, అటులే ఒరిస్సా, మైసూరు తెలంగాణా, బస్తరు ప్రాంతాలు ఉదహరించనందున వాటిని వదులుకున్నవార మవుతామా- కాజాలమే! కాజాలం కూడా!

మద్రాసు లేకుండా రాష్ట్రం మా కక్కరలే దనడం నాయకత్రయ నివేదికను తిరస్కరించడమేకదా? నాయకత్రయనివేదిక ఆంధ్రులకు అన్యాయం చేసిందా లేదా అనేది వేరు. అసలు నేడున్న అవకాశాలలో ఆంధ్రరాష్ట్రం సాధించడమా, త్రోసివేయడమా అనేదే ముఖ్యం! ఆంధ్రరాష్ట్రం నేడు సాధించితీరవలసిందే అంటే నాయకత్రయ నివేదిక సూచనలద్వారాకన్నా మరో మార్గ మేది? అంతకన్న మరో మార్గం లేదని, సర్దార్ పటేల్, పండిత నెహ్రూల అంగీకారం లేనిదే రాష్ట్రం సాధించలే మనేది తేలుతున్నదిగా. ఆంధ్రరాష్ట్రవాదులు మద్రాసును వదలుకోవలెనని ఖచితంగా చెప్పివేశారు. పైన ఒక్కమాటకూడా చెప్పలేదు. చెప్పవలసిన పనికూడా లేదు. వారిద్వారా రాష్ట్రం సాధించవలెనంటే ఆంధ్రులు మద్రాసును వదలుకోవాలె. మద్రాసు రాజధానిలోని 11 జిల్లాలతో రాష్ట్రం కావలెనని తీర్మానించాలె. అంటే మద్రాసును వదలుకున్నట్లు వ్రాసినా వ్రాయకపోయినా దాని ప్రసక్తిని ఎత్తకుండా 11 జిల్లాలతో ఆంధ్ర రాష్ట్రం యేర్పరచవలెనని కోరడమే కార్యసాధనకు మార్గం.

ఈ పరిస్థితులన్నీ అవగతం చేసుకుంటే మద్రాసును వదలుకోలేమని, 11 జిల్లాలకు రాష్ట్రం నిర్మించండి అనీ, ఇతర ప్రాంతాలకు సరిహద్దు నిర్ణయసంఘం వేయండి అనీ అనే తీర్మానాన్ని బలపరిచితే యే మవుతుంది? నాయకత్రయ నివేదికను తిరస్కరించడం అవుతుంది. అది వేదవాక్కు కావున తిరస్కరించవద్దు అనడంలేదు. దానిని తిరస్కరించి రాష్ట్రం సాధించే అవకాశం ఆంధ్రరాష్ట్రోద్యమానికి వుందా? లేదు కనుక తిరస్కరించడం అంటే రాష్ట్రసాధన వాయిదా వేయడమేకదా అవుతుంది. అందుచే మద్రాసును వదలుకోలేము, బొంబాయివలె మద్రాసును ఒక ప్రత్యేక రాష్ట్రం చేయకూడదా అనే తీర్మానాన్ని అంటే ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘ తీర్మానాన్ని బలపరిచే సభకు, మద్రాసు నగరమే రాజధానిగావుంటే రాష్ట్రం కావలెననే ఆంధ్ర సరిహద్దు నిర్ణయసంఘం యేర్పరిచే సభకు నాయకత్రయ నివేదికను నిరాకరించడంలో ఏకత్వంఉన్నా, అసలులో చాలా తేడా వుంది. అందువలన ఈ రెండు సభలు వేరువేరు తేదీలలో వేశారేమో తెలియదు. అప్పుడు 16, 17 తేదీలు ఒక సభ, 24 వ తేదీ ఒక సభ వేయడం సబబే అవుతుంది.

అయితే శ్రీ సాంబమూర్తిగారు కడపలో జరుపుతామన్న సభను ఆంధ్ర కాంగ్రెస్‌సంఘం తమ తరఫున జరుపుతా మనడంలో తమతమ అభిప్రాయాలను ఎవరు మార్చుకున్నట్లు? మరి ఏ అభిప్రాయానికి ప్రాధాన్య మిచ్చినట్లు? ఏది ఎటు లున్నా ఈ రెండు దృక్పథాలలో ఏది మిగిలినా, నాయకత్రయ నివేదికను ఆంధ్రరాష్ట్రం ఏర్పరచదలంచుతే, రాష్ట్రసాధనకు తోడ్పడే సభలు కావని నాయకత్రయ నివేదికను చూచిన వారికి, నాయకత్రయ నివేదికకన్నా ఆంధ్ర రాష్ట్రం వచ్చే అవకాశం లేదని వాస్తవపరిస్థితుల ననుసరించి అవగతం చేసుకున్న వారికి బోధపడుతుంది.

ఈ పై వాదనల నన్నింటిని సాగదీస్తే తేలేది మద్రాసు ఆంధ్రరాజధాని అగుటకు ప్రయత్నించేదానికన్నా మద్రాసును కనీసం ప్రత్యేకరాజధానిగా నన్నా చేసే పరిస్థితులన్నా యేర్పరుపవలెనని తేలుతుంది. ఆ వాదనకు రెండుకోట్ల ఆంధ్రుల రాష్ట్రాన్ని బలిపెట్టదలంచారనవలసివస్తున్నందుకు ఖేదపడుతున్నారు.

ఎవరెవరి తీర్మానాలకు బలం ఎంత వుందో మద్రాసులో ప్రదర్శింపదలంచి చేస్తున్న సభలైతే ఎవరూ దీర్ఘంగా ఆలోచించవలసిన పనిలేదు. నా కెవరిమీదా కోపంలేదు. నాకు ప్రేమ అల్లా ఆంధ్రరాష్ట్ర సాధనే విషయంలోనే. అందుచే మనం జరిపే సభలు ఆంధ్రరాష్ట్ర సాధనకు సహాయపడేవిగా వుండాలె. ఒక అభిప్రాయాన్ని బలపరుచుట కేర్పడిన సభలు సమావేశాలు *Rallys* అవుతవి. మహాసభలు కాజాలవు.

ఈ నాడాంధ్రజీవితం కోరేది రాష్ట్రం. రాష్ట్రసమస్య కోరేది రాష్ట్రసాధన విషయంలో విభిన్నదృక్పథాలతో వున్నవారి నందరిని ఆంధ్ర మహాసభ, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘాల సంయుక్త ప్రాతినిధ్యంక్రింద ఆంధ్రప్రజాపరిషత్తు అనండి, ఆంధ్రమహాజనసభ అనండి సమా

(21 వ పేజీ చూడుడు)

కాలానా కబుర్లు

"కూనిరాగంతో కుంభవృష్టి"

శ్రీ జి. యన్. సూరి

భారతదేశం పుణ్యభూమి కాదని ఎవరు అనగలరు? ఏదిక్కుకు పోయినా మహానుభావు డొకడు ప్రత్యక్షమై తీరుతాడు. కుర్తాళం వెళ్ళితే నోరుకదల్చని మౌనస్వామి, తిరువన్నామలై వెళ్ళితే కౌపీనధారి రమణమహర్షి, పుదుచ్చేరి పోతే ఏడాది కొకసారి దర్శన మిచ్చే అరవిందయోగి. ముమ్మిడివరంపోతే ముట్టుకోకుండా తలుపులు బిడాయించే బాలయోగి, ఇన్నివైపులనుంచీ ఇందరు మహాత్ములు మనకు అంగరక్షకులుగా అనిపడుతున్నారు కాబట్టే దేశానికి ఎన్ని ఈతిబాధలు సంప్రాప్తమయినా ఢోకా లేకుండా మనం కాలం వెళ్ళతీయగలుగుతున్నాము.

బరోడా రాష్ట్రంలో ఒక వింతయాగం ప్రస్తుతం జరుగుతున్నది. రాష్ట్రమంతటా వర్షాలు విపరీతంగా పడుతున్నా సూరత్ పట్నంలో చినుకులే రాలటంలేదుట. నీటి కాటకం భరించలేక పౌరులంతా సభచేసి, నిస్పృహతో పండితోత్తములను ఆశ్రయించారు. ఆ భూసురులు తల పంకించి, కుండలాలను కంపించి, ధర్మశాస్త్రాలను పరికించి, వరుణయాగం చేస్తే కుంభవృష్టి కురిసితీరుతుంది అన్నారు. వెంటనే పందిళ్లు వేయించారు. చలవపంద్రాలు కట్టించారు. అన్నివైపులనుంచీ హేమాహేమీలను పిలిపించారు. కర్మకాండ ప్రారంభించారు.

సుప్రసిద్ధ ఔత్తరాహిక గాయక శిఖామణి అయిన ఓంకార్‌నాథ్ ఠాకూర్ వేంచేశారు. సుముహూర్తం చూచి మలహార్‌రాగం ఎత్తుకున్నాడు. అంతవాడు పాడుతున్నాడనేసరికి వేలకువేలు జనం హాజరైనారు. జాగా చేసి ఆలాపన చేస్తుంటే తన్మయులై ఉడ్డుకుడుచుకుంటున్నారు. మలహార్‌రాగం గానంచేస్తే వరుణదేవుడు తృప్తిపడి వర్షం కురిపిస్తాడుట. వర్షంమాట ఎట్లా ఉన్నా, కానీ ఖర్చులేకుండా సూరత్ వాస్తవ్యులు మహత్తరమైన దివ్యసంగీతాన్ని విని ఆనందిస్తున్నారు. గానానికి రాళ్లే కరుగుతవి అంటారు. అటువంటప్పుడు మేఘాలు ఎందుకు కరగకూడదు?

ఓంకార్‌నాథ్‌గారు వర్షమే కురిపించాడా అంటే ఇక సంగీతవిద్వాంసులను పట్ట పగ్గాలు ఉండవు. మేము తలచుకున్నామా అంటే ఏమైనా చేయగలంఅని, ఉంటే మీసాలు మెలివేస్తారు. శంఖరాభరణం ఆలాపనచేసి శివాలయంలోని లింగాన్ని నృత్యం చేయిస్తారు. ఆనందభైరవి పాడి కాలభైరవుళ్లను గగ్గోలు పెట్టిస్తారు. సరస్వతీరాగం పాడి కవుల కలాలను కదలించివేస్తారు. భూపాళరాగం పాడి జనాన్ని నిద్రపోకుండా చేస్తారు.

ముఖ్యంగా మాకు మరీ భయంగా ఉన్నది. మా బజారులో ఫించెక్ పుచ్చుకున్న ఉద్యోగస్థుడు ఒక డున్నాడు. ఆయన మూడవపెళ్లి భార్య గొప్ప పాటకురాలు. మలహార్‌రాగంతో వానలు కురిపించారని ఆమెకు తెలిస్తే ఊరుకుంటుం దని తోచదు. ఏదో శుక్రవారం నాడు చక్కగా తలంటి పోసుకుని, జాజిపూలతో జారు జడ వేసుకుని, కొత్త బనారసు చీరె కట్టుకొని, తంజావూరి తాంబూర చేత పట్టుకొని, భర్తను ఉద్దేశించి కామవర్ధని రాగాన్ని ఆలాపన చేసి తీరుతుంది. అయితే గృహోద్యోగుడికి కొంచెం వినికిడి తక్కువ ని ప్రతీతి. అందువల్ల ఈ గానామృతం ఆయన చెవికి సోకక చుట్టు పక్కల వారికి సోకితే సంగతి సందర్భాలు ఏ విధంగా పరిణమించ కలవో ఊహించటం కష్టంగా ఉన్నది. పాడటంలో ఏదో అపశ్రుతి పడితే నే తప్ప కామవర్ధని ఖంగారు పెట్టి తీరుతుంది.

పంచ భూతాలను ఇంత సులభంగా లొంగదీయటానికి సంగీతంలాంటి సాధనం ఉన్నదని ఇతర దేశాలకు తెలిసినట్లు లేదు. ఒక వేళ తెలిసినా ఆయా దేశాల సంగీతంలో ఇటువంటి ప్రభావం లేక పోవచ్చు. లేదా అక్కడి విద్వాంసులకు ఇంతటి డొక్క శుద్ధి లేక పోవచ్చు అందువల్లనే పాశ్చాత్యులు ఇటువంటి వాటిని సాధించటానికి పదార్థ విజ్ఞాన శాస్త్రాన్ని పట్టుకుని పాకులాడుతారు. లక్షలు ఖర్చు పెట్టి సంవత్సరాల తరబడి పరిశోధనలు చేసి, అఘాయిత్యపు ప్రయోగాలను చూసి, కొండను తవ్వి ఎలుకను పట్టుతారు.

నిదర్శనంగా దీనిని చూడండి అమెరికా లాంటి దేశంలో వర్షాలు కరువై పోయిన వనుకోండి. ఊరి మీద నుంచి కారు మబ్బులు మందగమనంతో ప్రయాణం చేసి అవసరం లేని చోట కుమ్మరించి వేస్తున్న వనుకోండి. అప్పుడు శాస్త్రజ్ఞులు ఊరుకోరు. మంచి ధాటీగల విమానం నిండా బొగ్గు పులుసు వాయువును ఘనీభవించి తయారుచేసిన మంచు గడ్డల బస్తాలను నింపుతారు. బాగా మదించిన మేఘం ఊరిమీదికి వచ్చే వరకూ పొంచుండి, నడినెత్తికి రాగానే జైపరమేశ్వరా అని విమానంలో పైకి ఎగురుతారు. మేఘాన్ని భేదించుకొని పై భాగానా రేండ్లుకొడుతూ ఆ మంచు గడ్డలను మేఘం మీదికి వేలుస్తారు. ఈ మంచు గడ్డలు మేఘాన్ని శీతలింప చేసి, ఒక చుక్క అయినా దాటి పోకుండా అనుకున్న చోట కురిపించివేయటం జరుగుతుంది. ఆ తరువాత సావకాశంగా విమానం నేల వాలటమో నేల కూలటమో సంభవిస్తుంది. పాశ్చాత్య దేశాలలో ఈ విధంగా కృత్రిమ వర్షాన్ని కురిపించటం తరచుగా వింటూనే ఉన్నాము. కొంత కాలానికి ఇది బాగా పరిపాటి అయి పోతుం దనటానికి సందేహం లేదు.

అయితే ఈ పద్ధతిలో కొన్ని తిరుసల్లు లేక పోలేదు. ముందు మేఘం అంటూ ఒకటి ఉంటేనేగాని ఈ ప్రయోగానికి వీలుపడదు. రోహిణీకార్తెలో బెజవాడమీదుగా—క్షమించాలి—విజయవాడమీదుగా ఏ మేఘాలు పోవటానికి అవకాశం ఉండగలదు? ఇతర కార్తెలలో మనకు వర్షం ఎందుకు! అది మొదటి చిక్కు. ఇక రెండవది. ఏదో ఒక మేఘం దోవ తప్పి విజయవాడమీదికి రాగానే దానిని అక్కడే హతమార్చారు అనుకోండి. అప్పుడు గుంటూరు పౌరులు ఊరుకుంటారా? మా వూరు వస్తున్న బ్రహ్మాండమైన మేఘాన్ని, మాకు నష్టం కలుగచేయవలె నన్న దురుద్దేశముతో, మార్గమధ్యమున అటకాయించి, ఎట్టి హక్కులు లేకుండా లొంగదీసి, నిక్షేపంలాంటి నది పక్కనే ఉన్నా తృప్తిపడక, మంచినీళ్ళ కోసం మహాయాతన పడుతున్న మమ్మలను అనుభవించనీయక, దుర్వినియోగం చేసినందుకు కోర్టులో దావా వేసితీరుతారు. సదరు దావా పరిష్కార మయేవరకు ఏ ఇతర మబ్బులజోలికీ పోకుండా ఇంజంక్షను ఆర్డరు పొందుతారు. జిల్లాకోర్టు, హైకోర్టు సుప్రీంకోర్టు మొదలైనవన్నీ తిరిగి కక్ష సాధించి తీరుతారు.

అదీగాక ఈ విధంగా వర్షాలు కురిపించాలంటే ప్రతి పెద్ద నగరంలోను ఫైరు ఇంజన్ల మాదిరిగా విమానాలను ఉంచవలసి వస్తుంది. మంచు గడ్డల ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయవలసి వస్తుంది. ఒక వేళ ఇవన్నీ అమర్చుకుని తంటాలు పడ దలచుకుంటే ప్రభుత్వం వారు ఊరుకోరు. అప్పటికీ గోపాలరెడ్డిగారే ఖజానా మంత్రిగా ఉంటే మేఘానికి ఇంత అనో, లేక దుక్కిపదునుకి ఇంత అనో కొత్తగా పన్ను విధించి తీరుతారు. దక్షిణాన తటాకాలు, రిజర్వాయర్లు నింపేదాకా మనకు పర్మిట్లు రాకుండా భక్తవత్సలంగారు తిన సర్దుబాట్లు చేసి తీరుతారు మొత్తానికి అన్నివిధాలా ఇటువంటి కృత్రిమవర్షాలు మనకు కలిసిరాగల వని తోచదు.

అందువల్ల మన యంత్రాలను నమ్ముకోటం లాభసాటి బేరం కాదు. ఇక పోతే మనకు మిగిలింది మలహార్ రాగం. ఈ రాగం గొడవ ఏమిటో అంతు చూడడమే మన ప్రస్తుత కర్తవ్యం. ఓంకార్‌నాథ్ ఠాకూర్‌గారు సఫలీకృతులైనా రని తెలిసిన తక్షణమే అఖిలాంధ్ర గాయక మహాసభను ఏర్పాటుచేసి సంసిద్ధులం కావాలి ఈ లోపుగా మనమందరం ఆ రాగాన్ని కూనిరాగాలు తీస్తూ ఉందాం.

హాంకాంగ్ రక్షణలో ముప్పేటలముళ్లు

(9-వ పేజీ తరువాయి)

రంగా పోలీసులు జరుపుతూన్న సోదాలు అరెస్టులూ వారికి కంటకంగా ఉన్నాయి.

అసలీ ఆర్టి నెన్సుపై తీవ్రవిమర్శలన్నీ దూరస్థమైన 'పీపింగ్'నుంచి కమ్యూనిస్టులనుంచి కాక, కమ్యూనిస్టుసానుభూతి పక్షాలైన, తొమ్మిది రాజకీయ పక్షాల వారి నుంచి వచ్చింది. ఇది "చైనా ప్రతికూల" చర్య అనే ప్రజల ప్రజాస్వామ్య హక్కులను కబళించి హాంకాంగ్ పోలీస్ రాజ్యం చేస్తున్నారనీ విమర్శించాయి ఈవిమర్శలకు నాయకుడు మార్షల్ లీ, ఛి-సెక్ కూమింటాంగ్ విప్లవ సంఘానికి అధ్యక్షుడు. రాజకీయ వైరుధ్యాలలో తల దాచుకొనేందుకు హాంకాంగ్ చేరాడు. అక్కడనుంచీ ఏడాదిక్రిందే పీపింగ్‌కు కదిలాడు.

నేడు హాంకాంగ్ కున్న బలమైన రక్ష దాని ఆర్థికసౌష్ఠవమే! ఆర్థికపునర్నిర్మాణానికీ, దేశాన్ని పారిశ్రామికంగా చేయటానికీ, కమ్యూనిస్టులు ప్రాముఖ్య మిస్తూన్నారు.

కాని వాళ్ళ కున్న నాకలు కొద్ది. విదేశాలలో ఋణాల పలుకుబడి తక్కువ. రష్యా ఎగుమతులన్నీ ఇప్పటికే ఇతరులకు అంకితమైపోయాయి. అమెరికా కూమింగ్‌టాంగ్‌కు అధికసహాయం చేసి, అటు మొగ్గు చూపించి ఉండటంవల్ల, నెమ్మదినెమ్మదిగా తప్ప కాలు వెనక్కి తీసికొనే వీలు లేదు. కమ్యూనిస్టులకు కావలసిన ఓడలు, వ్యాపార ఒడంబడికలు, హాంగ్‌కాంగ్ మాత్రమే సమకూర్చిపెట్టగలదు. హాంకాంగ్ ద్వారా, రష్యాకు బ్రిటన్ అమ్మబోని ముఖ్యపదార్థాలు కూడా, బ్రిటిష్‌వారిద్వారానుంచి చైనా కమ్యూనిస్టులు కొనుక్కోగలరు.

"హాంగ్‌కాంగ్ ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నాన్ని దేన్నీ సహించమనే కమ్యూనిస్టులకు హెచ్చరిక నిస్తున్నాము. కాని తుపాకులు చూపించే పోట్లాటల ప్రమేయాలవల్లకన్నా, కమ్యూనిస్టు చైనా, హాంకాంగ్‌లు, దీర్ఘ కాలంనుంచి వస్తూన్న చైనా హాంకాంగ్‌ల మైత్రికి అనుకూలంగా పరస్పరం స్నేహబాంధవ్యాలతో విరాజిల్లే పద్ధతిలో, బ్రిటిషువారు స్నేహప్రయత్నాలు చేస్తే, కమ్యూనిస్టుల సుహృద్భావాన్నీ గౌరవాన్నీ చూరగొని, ఉభయులూ శాంతంగా బ్రతకగల ఆస్కార ముంది" అని హాంకాంగ్ "టెలిగ్రాఫ్" పత్రిక ప్రకటించింది.

"ఆర్థికకారణాలవల్ల, చైనాకమ్యూనిస్టులు, అధమం రెండేళ్లదాకానైనా హాంకాంగ్‌ను ఏవిధంగానూ బెదిరించబోరు. రాజకీయంగా కొంత వత్తిడి తేగల్గుతారేమో" అని అభిజ్ఞవర్గాల అభిప్రాయము. ఇంక ఉన్న భయం అల్లా, తృతీయప్రపంచ సంగ్రామం త్వరలో సంభవించవచ్చునేమో అని! అల్లా జరిగేపక్షంలో, చైనాకమ్యూనిస్టులు "ఈచైనామీది కిటికీని" మాత్రం ముందుగానే పగలగొట్టారు.

ఆంధ్రరాష్ట్ర సాధనకై ఆంధ్రప్రజల మహాసభలు

(20-వ పేజీ తరువాయి)

వేశమై రాష్ట్రం సాధించగలిగిన ఒక ఏకగ్రీవాంగీకారానికివచ్చి, ఆ ప్రజాభిప్రాయాన్ని కాంగ్రెస్ నాయకవర్గానికి భారతప్రభుత్వానికీ తెలియజేసి ఆంధ్రరాష్ట్రం ఆంధ్రప్రజ లందరి ఏకైక వాంఛతో సాధించడం అవసరం. అదొక్కటే ఆంధ్రరాష్ట్ర సత్వరసాధనకు మార్గం. నిజంగా ఆలోచిస్తే ఈ నాడు జరుగనున్న పై సమావేశాలు ఒక అభిప్రాయాన్ని బలపరిచేందుకు ఆంధ్రప్రాంతం అంతటనుండి వచ్చినవారి సమావేశం మాత్రమే అవుతుంది. అటుల కాకుండా ఆంధ్రులలో రాష్ట్రసాధనయే తమ తక్షణ కర్తవ్యంగా తలంచిన అందరికి అవకాశం వుండి, అందరు కలసి చర్చించి, తలలు లెక్కపెట్టేపద్ధతి కాకుండా, ఒక ఏకాగ్రీవాంగీకారయోగ్యమగు తీర్మానాన్ని తెచ్చే సభగా వుంటే అది అపుడు ఆంధ్రమహాజనసభ అవుతుంది; కాగలుగుతుంది.

అట్టి సభకు రాష్ట్రపతి కూడా రావడం అవసరం. సాధ్యాసాధ్యాలు ఆంధ్రప్రజ లందరకు తెలియజేయడం, కార్యసాధనకు సహాయపడుతుంది ఆ అభిప్రాయానికి ఆంధ్రుల పూర్తి బలం వుంటుంది. కేంద్రనాయకత్వమే గాని, ప్రభుత్వంగాని ఈవాంఛను త్రోసి వేయజాలదు. ఆ అభిప్రాయం అందరు ఆంధ్రులు ఎంతవరకు దగ్గరకు వచ్చుటకు వీ లుంటుందో అంతవరకు తీసుకొని రాగలిగిన దయినప్పుడు కాదనగలవారూ వుండజాలరు. అది జరిగినప్పుడే అవసరమైతే నాయకత్రయ నివేదిక గిరిగీతలలోనే కాకుండా దానిని దాటికూడా ఆంధ్రరాష్ట్రం సాధించగలుగుతాం.

ఈ ఆంధ్రప్రజల పరిషత్తు నిర్ణయాలు ఆంధ్రప్రజల ఏకైకకనీసవాంఛగా ప్రకటింపబడిన తర్వాత పరిషత్తు తరఫున ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వం, నాయకత్వంతో వివరించి ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించ కలుగుతారు.

ఆంధ్రరాష్ట్ర నిర్మాణము ఆంధ్రుల సర్వతోముఖాభివృద్ధికి అత్యవసరము గాన సరిహద్దుల విషయం భవిష్యన్నిర్ణయమునకు వదలి విశాలాంధ్ర నిర్మాణమునకు ప్రాతిప్రతిపదికగా ప్రస్తుతము పదకొండుజిల్లాలతో ఆంధ్రరాష్ట్రమును వెంటనే నిర్మింపవలెనని భారతప్రభుత్వాన్ని ఈ సభవారు కోరుతున్నారు." అనే తీర్మానం కొంతవరకు సహాయపడవచ్చు నని తలుస్తా.

విశాలాంధ్ర నిర్మాణానికి నేడు ఆంధ్రరాష్ట్ర సాధనమే గత్యంతరం. కావున ఈ రెండు సభలు తర్వాత ఆంధ్రమహాసభ జరపదలచిన విభిన్న దృక్పథాలతో కూడిన మరొకసభ విడివిడిగా కాకుండా సర్వాంధ్రప్రాతినిధ్యంతో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సంఘం, ఆంధ్రమహాసభలు కలిసి ఆంధ్ర ప్రజాపరిషత్తును అనండి ఆంధ్ర మహాజనసభను అనండి పిలిచి ఆంధ్రుల ఏకైక వాంఛను వీలైనంత దరిదాపుగా తయారుచేసి ఆంధ్రరాష్ట్ర నిర్మాణం సాధించి విశాలాంధ్ర నిర్మాణానికి ఆంధ్రు లంతా పూనుకొంటా రని ఆశిస్తున్నా.

"తమిళకర్నాటబంధము లూడ్చి తెల్గు
సీమను స్వతంత్రమ్ముగా మార్చువరకు
రాష్ట్రనిర్మాణకార్యము నివార్య మటంచు
మప్పువారికి నచ్చచెప్పువరకు
ఖడ్గమాగాణమం దొదిగి పేర్వాసిన
తెనుగుఖండమునెల్ల తెచ్చువరకు
బళ్లారిలో నాంధ్రభాగమంతయు జేర్చి
తెనుగురాజ్యములో కలుపువరకు
నిదియు నది యని లెక్కింపనేల యాంధ
దాంధ్రవిషయమ్ము నొక్క రాజ్యమ్ము చేసి
పట్టి జయభేరిపై దెబ్బ కొట్టువరకు
తెలుగుపసిపాపకైన నిద్రింపదగునె?"

పచ్చలు

(6-పేజీ తరువాయి)

మిశ్రమం నీటిలో కలసి, ఒక మిశ్రితద్రావణం ఏర్పడుతుంది. క్రమేణా చల్లార్చినప్పుడు, మరకత ఖనిజం ద్రావణంలోనుండి వెలువడ్తుంది. ఈ విధంగా, తయారుచేయబడ్డ పచ్చలు, ఒక్కొక్కటి 1 సె. మీ పొడవుండి, 2,3 మి. మీ. వెడల్పుండి షుమారు ఒక క్యారటు బరువుంటవి. ఇవి సర్వవిధాలా సహజమణులతో సరి తూగుతవి. కాని, సహజమైనవాటి మాదిరి, వీటిలో గీతలు, బుడగలు మొదలైన సామాన్య దోషా లుండవు.

గుణదోషాలు

ఈ పచ్చలకు పుప్పి, గార, కర్కశము అనే మూడు దోషా లున్నట్లుగా భైరవకవి 'రత్నపరీక్ష' అనే గ్రంథంనుండి తెలుస్తుంది. మరకత స్ఫటికాల్లో, పుచ్చినట్లుగాని, గీతలుగాని, లేక బుడగలు గాని, ఉన్నట్లైతే, ఆ మణికి పుప్పి అనే దోష ముందంటారు. మణి అంత ప్రకాశవంతంగా లేకుండా, ఏదో పైన కప్పు వేసినట్లుంటే, దానికి 'గార' అనే దోష ముం దంటారు. ఉపరిభాగాన సున్న పుగచ్చు చేసినట్లుగా కనిపిస్తే, దానికి కర్కశ దోష ముంటుంది.

సహజగుణాలు

మణిని సూర్యుడి కెదురుగా ఉంచి చూస్తే. రెండువైపుల కాంతి ప్రజ్వరిల్లుతూ ఉంటుంది, మరకతాలకుగల శ్రేష్ఠతకు కారణం, వీటిని బంగారందగ్గరగాని, వజ్రందగ్గరగాని, కుండవద్దగాని, గుడ్డవద్దగాని ఉంచితే, అవిగూడ పచ్చగా చూడటానికి సొగసుగా కనిపిస్తవి. శుద్ధమైన పచ్చలకు పైన సున్నం పూసినప్పటికీ, మంచి ప్రకాశవంతంగానే ఉంటాయి. వీటిని చల్లతో శుద్ధిచేస్తారు. అన్నివిధాలా మరకతమణులను పోలిన వస్తువులను, జీడిపూసి కడిగితే, అంత కాంతివంతంగా ఉండవు సహజమైన మణి మాత్రం నిర్మలంగా ఉంటుంది. ఇదే పద్ధతిలో మణి సహజమైనదో, కృత్రిమమైనదోకూడ నిర్ధారణ చేయవచ్చు. కృత్రిమరత్నాలకు, కాంతి పోదు. నిలువుగా చూచినప్పుడున్న కాంతి అడ్డంగా చూచినప్పు డుండదు.

మరొక చిత్ర మేమిటంటే, దీన్ని బాగా కాల్చినపుడు ఆ పచ్చరంగు కాస్త మాయమౌతుంది. దానిలో జీవపదార్థం (*Organic matter*) ఉండటం దీనికి కారణం అని, సుప్రసిద్ధ శాస్త్రజ్ఞుడు యమ్. లెవీ (*M. Levy*) అభిప్రాయం. ఇతర రత్నాలమాదిరి కాకుండా, పచ్చలకుగల విచిత్ర మేమిటంటే, బాగా కాల్చినపుడు నూటికి 9 సార్లు బరువు తగ్గిపోతవి. దాన్నిబట్టి తారతమ్యసాంద్రత 2.9 నుండి 2.4 వరకు తగ్గుతుంది. ఇదే మిగతా రత్నాలకంటె చాల చిత్రంగా ఉండేది. ఖనిజోత్పత్తి స్థానంలో కొంత జీవపదార్థం (*Organic matter*) ఉండి అదే రత్నాల్లోకూడ ఉండిపోవటం దీనికి కారణం.

పురాతనకాలంనుంచీ ధరించే రత్నమనే కాకుండా వైద్యసంబంధంగాకూడా ఎక్కువ ఉపయోగంలో ఉన్నవీ పచ్చలే. వీటికి విషాన్ని హరించే గుణమున్న దని, ఇవి ధరించినవారికి తేలుగాని, పాముగాని కరచినప్పటికీ విష మెక్కదని ప్రతీతి. మరకతం మని విషహర చెప్పటానికి గరుడపురాణంలో ఒక చిన్నకథకూడ ఉన్నది: పూర్వం బలాసురు డనే ఒక రాక్షసు డుండేవాడు. వాసుకి అనే సర్పరాజు అతన్ని జయించి అతని చేదుకట్టును తీసికొని ఆకాశవీథిని పోతుండగా, గరుత్మంతు డాతని అడ్డుపెట్టి యుద్ధం చేయసాగాడు. గరుత్మంతునితో పోరాడలేక వాసుకి ఆ చేదుకట్టును రత్నసిలయమైన ప్రదేశంలో వదలివేసింది.

ఆ చేదుకట్టును క్రిందపడే సమయంలో దాన్ని గరుత్మంతుడు మ్రింగి మూర్ఛపోయి ముక్కుద్వారా బైటకు వెడలగ్రక్కాడు. అది ఆ రత్నాలపై పడటంవల్ల ఆ ప్రదేశంలోని రత్నాలని మరకతత్వాన్ని పొందుతాయి. అందువల్లనే వీటిని గరుడపచ్చ లంటారు. గరుత్మంతుని సంబంధంవల్ల ఇది పుట్టటంచేత, విషాన్ని హరించటంలో సందేహ మేమీ లేదని పెద్దలు చెప్పుతారు. పాశ్చాత్యులు కూడ మరకతాన్ని విషహరంగా ఉపయోగించారు.

ఇవే, ఈ మణులు పిచ్చి, మూర్ఛలు (*Epilepsy*), అతిసారం (*Dysentry*) మొదలైన వ్యాధులు కుదురుస్తందనీ, వీన్ని ధరించినవాటికి సుఖప్రసవం కల్గుతుందని వాడుక.

"బుధుడు మెచ్చు పచ్చ ప్రీతిగను"

మరకతమణుల అధిపతి బుధుడు కావటంవల్ల మణినిధరించినవారికి మానసికాభివృద్ధి కల్గుతుంది. అందువల్లనే,

"గారుత్మకం తథైశాన్యం, సోమపుత్రస్య తుష్టయే"

నవరత్నాలను ఉంగరాన్నిచేయిస్తూ, బుధుని ప్రీతికై, ఈశాన్యభాగాన్న పచ్చను పెట్టి, ధరిస్తారు.

ఇక, మన సంస్కృత గ్రంథాల్లో మరకత శబ్దప్రయోగం అసంఖ్యాకం. గత వ్యాసాల్లో వివరించబడిన కెంపులు, నీలాలు మొదలైన రంగు రత్నా లన్నిటిలో, విరివిగా ఉపయోగంలో ఉన్న వీ పచ్చలే. దీనికి కారణం వాటికిగల చూడసొగసైన పచ్చరంగు. ఎరిగిన రంగు లన్నిటిలోను పచ్చరంగే నేత్రానందాన్ని కల్గించేది. శారీరకంగాగాని. మానసికంగాగాని బాధ నొందేటప్పుడు పచ్చటిరంగుగల వస్తువుల వైపు దృష్టిసారిస్తే, బాధ ఉపశమిస్తుం దని పెద్ద లంటారు. కాలిలో విరిగిన ముల్లు తీసేటప్పుడు చెట్లవైపు చూడమంటారు. పచ్చరంగుకు అట్టి విశేషత ఉండటంవల్ల, పచ్చలు (మరకతాలు) హృదయాహ్లాదకరాలు.



గ్రామపంచాయితీ బిల్లు

అయ్యా,

త్వరలోనే గ్రామములందు, పంచాయతీ పరిపాలన ప్రారంభింపనుండుట యెంతియు సంతసింపవలసిన విషయమై యున్నది. 500 జనాభాకు తక్కువగాని ప్రతి రెవిన్యూగ్రామమునకు, పంచాయతీ యేర్పరుప బోవుట వుత్తమమై యున్నది. యిందుకుగాను, కొందరు, రెవిన్యూగ్రామముకాని, శివారు గ్రామాదులకుకూడ, పంచాయతీ యేర్పరచుట అవసరమనియు, లేనియడల మాంజీగ్రామవాసులు, శివారు గ్రామస్థుల, కష్టసుఖములను చూడరనియు విమర్శించిరి. ఆవిధముగ ప్రతిశివారు గ్రామమునకును కూడ, పంచాయతీ యేర్పాటు చేయునెడల, పార్టీకక్షలమాట అటుంచి, ఆర్థికప్రతిపత్తి చాలా దెబ్బ తినగలదు. ఏ శివారు గ్రామమునకుగూడ, తన వాటాకు రాబడిన, ధనము, ఏ ఒక్క నిర్మాణకార్యక్రమమునకున్నూ సరిపోక, యెప్పటికప్పుడు, పరసహాయమునకై చేయి చాచవలసి రాగలదు. రెవిన్యూ గ్రామము, ఎలాగూ వార్డులుగా విభజింపబడును. గాన శివారుగ్రామములో ఒక సభ్యుడైనను కనీసము వుండగలడు. గాన ఒక సంవత్సరము, ఒక శివారుగ్రామమునందును, మరియొక సంవత్సరము, మరియొక శివారునకున్న పనులు నిర్విఘ్నముగా జరిగించుకొన వీ లుండును. గాన రెవిన్యూగ్రామమునకు మాత్రమే పంచాయితీ యుండుట వుత్తమము. అదిన్నీగాక ప్రభుత్వపరిపాలనకున్నూ గూడ అనువుగా నుండగలదు.

2. పంచాయితీ అధ్యక్షుని, ఓటర్లందరున్నూ యెన్నుకొనే పద్ధతే చాలా సమంజసముగా నున్నది. యెన్నకోబడిన సభ్యులకున్నూ, అధ్యక్షునకున్నూ సామరస్యము కుదుర దనే భయము అవసరము లేదు. ఏలనన, అధిక సంఖ్యా సభ్యులచే అంగీకరింపబడే అంశములేగదా, తీర్మానింపబడి, అమలు జరుగగలవు. అదిన్నీగాక, ఒకే పార్టీవారు రావలయుననే ప్రచారము తగ్గి పార్టీ కక్షలు చాలవరకు సమసిపోగలవు. పార్టీలతో సంబంధములేని విద్యాధికులున్నూ, ప్రజామోదము నందినవారున్నూ, అధ్యక్షు లగుటకున్నూ వీలుండును. ఓటర్లందరున్నూ, అధ్యక్షుని యెన్నుకొనే సందర్భములో, గ్రామపెద్దగాని, గ్రామాధికార్లుగాని పాల్గొనరా దనుట బాగులేదు. ఓటర్లందరి ఆమోదము పొందిననే గదా వారు అధ్యక్షులుగా గాని, సభ్యులుగా గాని రాగలరు? నిరంకుశ ప్రభువులను ఏ ఓటర్లున్నూ కూడా యెన్నుకొనరు. వారు, ఎక్సు అఫీషియో మెంబర్లుగా వుందురుగదా యన్న, దానివల్ల యెట్టి ప్రయోజనమున్నూ లేదు. వారు వట్టి వుత్సవ విగ్రహములుగా మాత్రమే వుండుట జరుగగలదు. వారికిన్నీ యెన్నికలందు పాల్గొనుటకు అర్హత యుండవలెను. అయితే గ్రామాధికారి, తన వుద్యోగముతోపాటు, అధ్యక్షపదవి నలంకరించుట, యంగీకరింపరానిది, తన గ్రామాధికారి పదవికి, శలవుపెట్టి, పంచాయితీ విధుల నిర్వర్తించుటకు గాను, అంగీకరింప వచ్చును. అధ్యక్షుని తొలగించు నధికారము, ప్రభుత్వమున కుండుట యనునది, యెంతమాత్రము అంగీకరింపరాని విషయమైయున్నది ఓటర్లకే అ అధికారముండవలయును. లేనిచో అధ్యక్షుడు ప్రజలకు జవాబుదారీగా, నుండుటకు బదులు, ప్రభుత్వమునకే జవాబుదారీగా యుండవలసి రాగలదు. అందుచే, అధికార్ల చేతి కీలుబొమ్మలుగా పంచాయితీలు తయారై, పంచాయితీల ముఖ్యోద్దేశ్యములకే భంగము రాగలదు.

3. "గ్రామమహాజనసభ" ను, ప్రతి ఆరు మాసములకైనను, పంచాయితీలు తప్పక జరిపి, తాముచేసిన పనియొక్క, సమగ్ర సమీక్ష, ప్రజలముందు పెట్టి, ఆక్షేపణలను, అభిప్రాయములను కూడ తెలుసుకొని, తదనుగుణ్యముగా, పంచాయతీ నడచుకొనవలయుననే క్లాజు వుండుట ముఖ్యము. అదీగాక, ఆ సభయందే పంచాయతీబడ్జెటును కూడా ప్యాసు చేయునట్లుకూడా చూడవలెను. యీ మహా సభవలన, కార్యనిర్వాహక వర్గమువారి, నిరంకుశ పాలన, దుష్పరిపాలన, పరిపాలనయందలి వక్ర మార్గములుకూడ అరికట్టబడగలవు.

4. న్యాయనిర్వహణాధికారములో, మొదటి తరగతి పంచాయతీలకున్నూ, రెండవతరగతి పంచాయతీలకున్నూ, వ్యత్యాస ముంచుట యెందులకో బోధపడుట లేదు. అన్ని తరగతి పంచాయతీలకున్నూ, ఒకే విధమగు అధికారము లుండుటవలన, ప్రమాద మేమిన్నీ యుండదు. పంచాయతీలకు వుండుకున్న శివిల్ క్రిమినల్ అధికారములలో, స్వల్పవివాదములు విచారించుటయే గాక, యిరుకక్షులవారున్నూ వప్పుకొనినమీదట, గొప్పవివాదములున్నూ పరిష్కారముచేయు నధికారముండవలయును. అంతేగాక ప్రభుత్వఅధికార్లచే మోపబడు స్వల్ప నేరముల విచారణాధికారముకూడ యుండవలయును, రిజర్వుఫారెస్టులోని, చిన్న చిన్న, నేరములు, ఆరోగ్యాధికార్లచే మోపబడు, న్యూసెన్సు కేసులు, టీకాలు వేసుకొనలే దనే మున్నగు కేసులు, లైసెన్సులు లేకుండా వ్యాపారములుచేయుట, చేపలు పట్టుట, కోడిపందెములు, జూదములు ఆడుట, మున్నగు నేరములన్నియు, ముందుగా ఆయా అధికార్లచే పంచాయితీలకే రిపోర్టు కావలెను. అందుపై పంచాయితీలు తగు శిక్షలవిధించి, వసూలు చేసి పంచాయితీ నిధులకు జమకట్టుకొను, అధికారముండవలయును - వీ రిచ్చు తీర్పులు న్యాయశాస్త్రరీత్యా పట్టబద్ధమయినదీ కానిదీ, నిర్ధారణ చేయుటకు, ఒక "న్యాయశాస్త్ర సలహా సంఘము," ఒక న్యాయాధికారి అధ్యక్షత క్రింద, కొన్ని గ్రామాదుల కొకటి చొప్పున యుండవలెను. గ్రామపంచాయితీలో తీర్పు యిచ్చిన తగవును, ఆ సంఘమునకు పరిశీలనార్థమై పంపి, ఆ సంఘ అనుమతి పొందినదైనచో, న్యాయశాస్త్రరీత్యా చట్టబద్ధమైనదని యెంచవచ్చును. లేనిచో పునర్విచారణకు తిరిగి పంచాయితీలకు పంపవలయును. యిట్టి సంఘము వలన, పంచాయితీలు, తగు కట్టుబాట్లతో పని చేయుటయేగాక, అన్ని పంచాయితీలు ఒకే విధానముపై పనిచేయుచు, వ్యక్తిగతద్వేషములకు దూరముగా నుండగలవు.

5. వృత్తిమాన్యములు, నౌకరి యీనాములు, పరులపాలై గ్రామములలో జీవనాధారము లేనందున, కమ్మరి, కుమ్మరి, మంగలి, చాకలి, మున్నగు పనివా రందరున్నూ బస్తీలకు చేరిరి. అందుచే పల్లెలలో, చాకలి, మంగలికికూడ కరవైనది.

వారిని తిరిగి గ్రామాదులకు రప్పించుకొనవలసి యున్నది. గాన అట్టి యీనాములను, తిరిగి పంచాయితీలు స్వాధీనము చేసుకొనియు, లేని చోట్ల వానిని యేర్పరచియు, ఆయావృత్తులను, సక్రమముగా వారిచే జరిపించుకొను నధికారము, యీ పంచాయితీల కుండలెను. గ్రామవైద్యుని, నియమించి, పంచాయితీనిధినుండిగాని, లేక కుటుంబమునకు కొంత వైద్యపుపన్ను వసూలుచేయుట మూలముగాగాని, లేదా, కొంత భూమి యీనాముగా యిచ్చుటద్వారాగాని, వానిచే పనిచేయించుకొను నధికారము గూడ నుండవలయును.

6. పశువ్యాధుల నివారణ, పశువులకు నీరేర్పాటుచేయుట, ఆబోతులను పోషించుట మున్నగు పశువులకు సంబంధించిన యావత్తు విషయములందును తగు చర్య తీసుకొనుట కధికార ముండవలెను.

విద్యావిషయములో, పంచాయితీలకు ప్రాథమిక విద్యాశాలలను నడుపుటయందేగాక, సమర్థు లని తోచినవారిని, తమ గ్రామమునుండి పెద్దచదువులకు, పంచాయితీ ధనమునుండి ఖర్చుచేసి, పంపుటకు అధికార ముండవలెను.

7. పంచాయితీనిధులలో, గ్రామబందెల దొడ్లపై వచ్చు ఆదాయమునుకూడా కలుపుట అవసరము. గ్రామాధికారి యెప్పటివలెనే బందెలదొడ్డిని నిర్వహించుచూ, తన కమీషను పోను, మిగతాపైకము పంచాయితీకి జమ కట్టుచుండవచ్చును, అదీగాగ, గ్రామాదులలో వసూలగు వినోదపుపన్నులు, విక్రయపు పన్నులు గూడ, పంచాయితీలకే సంక్రమింపవలయును.

8. పంచాయితీల నిర్మించుటతోపాటు, వాటికి తగు సలహా నిచ్చుటకు గాను, ఫిర్కా పంచాయితీల నేర్పాటుచేయుట చాలా అవసరము. అంతేగాక, యిప్పుడనేకమంది సమర్థులగు యువకులు, నిరుద్యోగులై యున్నారు. వారిని వ్యవసాయము, పారిశుధ్యము, ఆరోగ్యము, గ్రామపరిపాలన మున్నగు వివిధ విషయములందు తర్ఫీదుచేసి, వేతనములపై వారిని నియమించి, కొన్ని గ్రామాదులను వారి యధీనమునం దుంచిన, వారు ఆయా గ్రామాదులందు తిరుగుచూ, అవసరమునుబట్టి, ఒక్కొక్క గ్రామమునందు నెలరోజులైనను, మకాము వేసి, పంచాయితీలకు, లెక్కలు సరిగా నుంచుట, న్యాయనిర్వహణము మున్నగు విషయములలో తగు సలహాల నివ్వగలడు.


పై విషయములను గూడ చేర్చి, యింకను సమగ్రమగు మార్పులతో, త్వరలోనే పంచాయితీచట్టము చేసి, వయోజనఓటుపద్ధతిపై పంచాయితీల నేర్పాటు చేయునెడల, విద్యాధికులు క్రమేపి, నెమ్మదినెమ్మదిగా తిరిగి గ్రామములకు చేరగలరు. గ్రామములున్నూ పూర్వపు ఔన్నత్యమునకు రాగలవు. గాన త్వరలోనే పంచాయితీ రాజ్యము యేర్పడగలదని ఆశించుచున్నాము.

కృత్తివెంటి జానకిరామయ్య.




హైదరాబాదు ఆంధ్ర సారస్వత పరిషత్తు

కుర్చీలలో కూర్చున్న వారు: శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం, శ్రీ మాడపాటి హనుమంతరావు, శ్రీ లోకనంది శంకరనారాయణ, శ్రీ గడియారం రామకృష్ణశర్మ, శ్రీ ఇల్లెందుల రామచంద్రరావు, శ్రీ నర్సోత్తమరెడ్డి, శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, శ్రీ పైనంపాటి శ్రీనివాసరావు, శ్రీ సత్యదుర్గేశ్వర శర్మ.



మదరాసు విద్యాశాఖామాత్యులు గౌ॥ శ్రీ కె. మాధవమీనన్ గారు, వారిసతీమణి శ్రీమతి కుట్టిఅమ్మాళ్ గార్లు యల్లపల్ల గ్రామం వచ్చిన సందర్భంలో తీయబడిన ఛాయాచిత్రం.



సర్ ఎ. రామస్వామి మదల్యారు, ఓహియోలో జరిగిన సంయుక్త రాజ్యాల విద్యాశాస్త్రీయ విజ్ఞాన సంస్థ యందు ఉపన్యసించుచున్నారు.

వార్తా చిత్రాలు



అంకారాలో బ్రిటిష్ రాయబారి సర్ నోయల్ ఛార్లిస్. మునుపు ఈ స్థానంలో ఉన్న సర్ డేవిడ్సన్‌ను మాస్కోలో రాయబారిగా నియ



ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం స్థిరంగావుండే ప్రదేశం. ఇది న్యూయార్కు నగరంలోని 5 ...

Regd. No. M. 4479

Edited, Printed & Published by S. Sambhu[redacted]the[redacted]Chetty St., G. T.[redacted]